పైరవీలకు చెక్ పెట్టేలా ఆన్‌లైన్ బదిలీల ప్రక్రియ

ఈనాడు, హైదరాబాద్: విద్యుత్తు పంపిణీ సంస్థలో పైరవీలకు చెక్ పెట్టేలా ఆన్‌లైన్ బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఎక్కడాలేని విధంగా డిస్కంలో ఫోకల్(ఆదాయం వచ్చే స్థానాలు), నాన్ ఫోకల్ పోస్టులు ఉన్నాయి. బదిలీల్లో కొంత మంది పలుకుబడి కలిగిన ఆపరేషన్ ఇంజినీర్లు ఏళ్ల తరబడి ఫోకల్ పోస్టుల్లోనే ఉంటున్నారు. బదిలీలు చేపట్టినా సరే.. పైరవీలతో ప్రాధాన్య పోస్టులు సాధించుకునేవారు. దీంతో తమకు తీవ్ర నష్టం జరుగుతుందని కార్యాలయంలో పని చేసే ఇంజినీర్లు వాపోయేవారు. ఈసారి వెబ్‌సైట్‌లో రూపొందించిన మాడ్యూల్ ప్రకారం... ప్రస్తుతం ఫోకల్ పోస్టుల్లో చేస్తున్న ఉద్యోగికి నాన్ ఫోకల్ ఆప్షన్స్ మాత్రమే కన్పించేలా రూపొందించారు. దీంతో పైరవీలకు చెక్ పడుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న చోట రెండేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారిలో 50 శాతం మంది బదిలీలకు అర్హులు. వీరు శుక్రవారం వరకు ఆప్షన్స్ ఇచ్చే అవకాశం కల్పించారు. సోమవారం బదిలీ ఉత్తర్వులు జారీ అవుతాయి.

పంచాయతీ ఓటర్ల తుది జాబితా విడుదల



ఈనాడు, హైదరాబాద్: గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం యోచిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని వార్డుల్లో ఓటర్ల తుది జాబితాను గురువారం ప్రకటించింది. రంగారెడ్డి జిల్లాలో 7.94లక్షల ఓటర్లు, మేడ్చల్ జిల్లాలో 64,397 ఓటర్లున్నారని ఎన్నికల కమిషన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా జిల్లాలో మహిళల కంటే పురుష ఓటర్లే ఎక్కువగా ఉన్నారు.

జిల్లా	మండలాలు	గ్రామ పంచాయతీలు	వార్డులు	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం ఓటర్లు
రంగారెడ్డి	21	549	4896	3,99,404	3,95,216	33	7,94,653
మేడ్చల్	3	34	320	32,402	31,992	3	64,397

అలంకార రూపిణి.. దివ్యదర్శిని



బల్కంపేట ఎల్లమ్మ



ఉజ్జయిని మహాకాళి అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు మొదటిరోజు బాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలను వివిధ రకాల పూలు, విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. నగరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



పూలతో జూబ్లీహిల్స్ పెద్దమ్మ ఆలయం ముస్తాబు



జల్లు.. ఘొల్లు..

నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్ జవహర్ నగర్ వద్ద పరిస్థితిని చక్కదిద్దుతున్న జీహెచ్ఎంసీ సిబ్బందిని ఈ చిత్రంలో చూడొచ్చు.

మూసీ మూసి

- పరీవాహకంలో అక్రమాల ప్రవాహం
- వేల సంఖ్యలో అడ్డగోలు నిర్మాణాలు చేపట్టి అద్దెలకు

మూసీ పరీవాహక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, క్రికెట్ గ్రౌండ్ల ఏర్పాటుతో కొంత మంది పెద్దలు రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. ఈ నిర్మాణాలకు ఏ సంస్థ నుంచి అనుమతులు లేకపోయినా బల్దియా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. మంచిరేవుల నుంచి నాగోలు వరకు 55 కిలో మీటర్ల పొడవున మూసీ నదిని సుందరీకరణ చేపట్టాలని సర్కార్ నిర్ణయించింది. ఇందుకు గత కొద్ది రోజులుగా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూర్తిస్థాయిలో సర్వే చేసి దాదాపు పదిహేను వేల నిర్మాణాలున్నాయని తేల్చారు. ఇందులో దాదాపు 5 వేలకుపైగా నిర్మాణాలకు ఎటువంటి అనుమతులు లేవు. మరికొన్నింటికి తప్పుడు అనుమతి పత్రాలను సృష్టించినట్లు తెలిసింది. దాదాపు మూడు వేల వరకు నిర్మాణాలకు బల్దియా అనుమతి ఇచ్చినట్లు సమాచారం. అనధికార నిర్మాణాలు పరిశీలించగా.. చాలా వరకు మూసీని ఆక్రమించి ఇళ్లను నిర్మించిన అద్దెలు ఇచ్చినట్లు తెలిసింది. సంబంధిత భవనాల్లో ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా అద్దెలు భారీగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని అక్కడి వారు చెబుతున్నారు. మూసీ గర్భంలోనూ 1600లకు పైగా నిర్మాణాల్లోనూ ఎక్కువగా అద్దెలకు ఇచ్చినట్లు గుర్తించారు. వీరు తమకు రెండు పడక గదుల ఇళ్లను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి, నాగోలు, న్యూస్‌టుడే



రూ.లక్షల్లో వసూలు

అత్తాపూర్ నుంచి మొదలు పెడితే కిషన్‌బాగ్, చాదర్‌ఘాట్, శంకర్‌నగర్, చైతన్యపురి, నాగోలు ఇలా అనేక ప్రాంతాల్లో మూసీలోనే దాదాపు మూడువేలకు పైగా భారీ షెడ్లను నిర్మించారు. కొన్ని పెద్ద షెడ్లకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు నెలవారీ వసూళ్లు చేస్తున్నారని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన అధికారులు చెబుతున్నారు. అత్తాపూర్ నుంచి బాపూఘాట్ వెళ్లే దారిలో రెండు మూడు మెకానిక్ షెడ్లను మూసీని పూడ్చి నిర్మించారు.

ఫణిగిరి కాలనీలో నదిని ఆనుకొని భవన వ్యర్థాలతో పూడ్చివేత

క్రికెట్ గ్రౌండ్ల నిర్మాణంతో వ్యాపారం

మూసీ నదీ పరీవాహకంలో పెద్దత్తున చిన్నపాటి క్రికెట్ గ్రౌండ్లను నిర్మించి రూ.లక్షల్లోనే వసూళ్లు చేస్తున్నారు. చైతన్యపురి దగ్గర ఒక ప్రధాన పార్టీ అనుచరుడు మూసీ నదికి ఆనుకునే ఏకంగా రెండు క్రికెట్ గ్రౌండ్లను నిర్మించారు. వ్యాపారాలకు అనువుగా మూసీ పరివాహక ప్రదేశాన్ని మార్చి అక్రమంగా వినియోగిస్తున్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా నడుస్తున్న సదరు క్రికెట్ గ్రౌండ్ నదీ గర్భంలో ఉందంటూ రెవెన్యూ అధికారులు ఎరుపురంగు మార్కు వేసి వెళ్లారు. సదరు ఆట స్థలాన్ని దాటిన తరువాత మరింత స్థలాన్ని చదును చేసేందుకు కొందరు మట్టికుప్పలు పోస్తుండటం గమనార్హం. ఇలా మూసీ పరివాహక ప్రాంతాల్లో అక్రమంగా ఇలా రూ.కోట్లలోనే వ్యాపారం జరుగుతోంది.



నదికి ఆనుకొని మైదానం

అడకత్తెరలో ఆర్కిటెక్చర్ వర్సిటీ

- అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 10 ఎకరాల కేటాయింపు
- యూజీసీ మార్గదర్శకాల ప్రకారం 30 నుంచి 50 ఎకరాలు అవసరం

ఈనాడు, హైదరాబాద్, కార్వాన్, న్యూస్‌టుడే

జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం తరలింపు వ్యవహారంపై వివాదం ముదురుతోంది. మాసాబ్‌ట్యాంక్‌లో 50 ఏళ్లకుపైగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న జేఎన్ఏఎఫ్‌యూను జూబ్లీహిల్స్‌లోని అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోకి వెళ్లాలని.. కొత్త భవనాలను నిర్మించుకోవాలంటూ 10 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఈ అంశంపై రెండు వర్సిటీల రిజిస్ట్రార్లకు ప్రభుత్వ ఉన్నతాధికారులు లేఖ రాశారు. ఈ లేఖపైనే అంబేడ్కర్ విశ్వవిద్యాలయం బోధన, బోధనేతర సిబ్బంది, విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులు వేర్వేరుగా ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. బోధన, బోధనేతర సిబ్బంది ఐకాసగా ఏర్పడి ఆందోళనలు నిర్వహిస్తున్నారు. అంబేడ్కర్ వర్సిటీకి చెందిన స్థలాన్ని తమకు ఇష్టం లేకపోయినా వేర్వేరు అవసరాల కోసం ప్రభుత్వం తీసుకుందని, ఇప్పుడు స్థలాలను ఎవరికీ ఇవ్వబోమని ఐకాస ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు ప్రస్తుతానికి వర్సిటీ కార్యకలాపాలకు ఇబ్బంది లేకపోయినా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని జేఎన్ఏఎఫ్‌యూ అధికారులు చెబుతున్నారు.




జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్, ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం

భవిష్యత్తులో ఇబ్బందులు

విశ్వవిద్యాలయం స్థాయికి తగినన్ని స్థలాలు, విస్తరణకు అవసరమైన భూములు, పరిశోధనల ప్రయోగశాలు లేకపోతే జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని నిపుణులు చెబుతున్నారు. మూడున్నర ఎకరాల స్థలంలోనే విశ్వవిద్యాలయం ఉందని, రెండు వేల మంది విద్యార్థులకు ఇది సరిపోదని వివరిస్తున్నారు. అన్ని చోట్లా విశ్వవిద్యాలయాల ప్రాంగణంలోనే వసతి గృహాలు ఉంటాయని, జేఎన్ఏఎఫ్ వర్సిటీకి మాత్రం వసతిగృహాలు క్యాంపస్ వెలుపల ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వర్సిటీకి అవసరమైన 50 ఎకరాల భూములను కేటాయించాలని నిపుణులు కోరుతున్నారు.

ప్రారంభోత్సవాల సందడి

సికింద్రాబాద్ హాకీ గ్రౌండ్స్‌లో 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' పైలెట్ ప్రాజెక్టును, ఎల్బీ స్టేడియంలో సీఎం కప్ పోటీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. ఒకేరోజు రెండు కార్యక్రమాలు నిర్వహించడంతో సందడి నెలకొంది. 1. డిజిటల్ కార్డు దరఖాస్తు ఫారాన్ని సీఎం ఆవిష్కరించి అధికారిణి చేతికి అందించారు. 2. మరోవైపు ఎల్బీ స్టేడియంలో బాక్సర్ నిఖత్ జరీన్‌ను రాష్ట్ర ప్రభుత్వం డీఎస్పీగా నియమించింది. ఆమె ముఖ్యమంత్రితో కలిసి పోలీసు యూనిఫాంలో ఫొటో దిగారు.





జలమండలిలో 'కేటగిరి' కహానీ

- నల్లాలు పెరుగుతున్నా.. 'వాణిజ్య' ఆదాయం అంతంతే
- అక్రమాలతో ఆదాయానికి గండి.. సర్వేకు సిద్ధం

ఈనాడు, హైదరాబాద్

గ్రేటర్‌లోని జలమండలి పరిధిలో నల్లా కనెక్షన్లల్లో కేటగిరి పేరుతో అక్రమాల దందా నడుస్తోంది. క్షేత్రస్థాయిలో సరైన పర్యవేక్షణ లేకపోవడం.. అధికారులు, సిబ్బంది కుమ్మక్కై బోర్డు ఆదాయానికి టోకరా వేస్తున్నారు. ఏయేటికాయేడు నల్లాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వాణిజ్య కేటగిరిలో వినియోగదారుల సంఖ్య అంతంతమాత్రంగా ఉంది. గ్రేటర్‌లో 13 లక్షలపైనే నల్లాలుండగా ఇందులో వాణిజ్య కేటగిరిలో కేవలం 40 వేల వరకు చూపిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. దీంతో వాణిజ్య భవనాలు, సముదాయాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంచుకొని సర్వేకు జలమండలి సిద్ధమవుతోంది. తద్వారా వాణిజ్య నల్లాల కచ్చితమైన సంఖ్య తెలుస్తుంది. జలమండలికి ఏటా కొత్త నల్లాల జారీ, నీటి బిల్లులు ఇతరత్రా ఏటా రూ.1000-1300 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

ఇందులో సింహభాగం నీటి బిల్లుల నుంచే వసూలవుతోంది. ఈ ఆదాయంలో 70 శాతం వాణిజ్య నల్లాలదే. మొత్తం నల్లాల్లో ఇవి 3 శాతమే. దీంతో వాణిజ్య నల్లాల శాతాన్ని పెంచేందుకు జలమండలి దృష్టి సారించింది. ప్రస్తుతం గృహ నల్లాలకు ఒక్కో కుటుంబానికి నెలకు 20 వేల లీటర్ల నీటిని ఉచితంగా ఇస్తున్నారు. ఆపైన వాడుకుంటే దానికి బిల్లు చెల్లించాలి. ఇలా ఏటా రూ.350 కోట్లు వరకు ఆదాయం కోల్పోతోంది. క్రాస్ సబ్సిడీ ద్వారా ఆ ఆదాయాన్ని వాణిజ్య నల్లాల నుంచి భర్తీ చేసుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది.



కేటగిరి మార్చేసి...

- గృహ, వాణిజ్య కేటగిరి బిల్లింగ్‌లో చాలా వ్యత్యాసం ఉంది. గృహ నల్లాకు 1000 లీటర్లు రూ.10కి ఇస్తున్నారు. అదే వాణిజ్య నల్లాకు 1000 లీటర్లకు రూ.40 నుంచి మొదలై నీటి వాడకాన్నిబట్టి బిల్లింగ్ పెరుగుతుంది.
- కొందరు ఈ బిల్లులను తప్పించుకోవడానికి సిబ్బందితో కుమ్మక్కై కేటగిరిలో మార్పులు చేస్తున్నారు. వాణిజ్య నల్లాలకు గృహ కేటగిరిలో బిల్లులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.
- జలమండలి నిబంధనల ప్రకారం.. ఇంటి కిందిభాగంలో షాపు, హోటల్ లేదా ఇతర వాణిజ్య కార్యకలాపాల కోసం నిర్వహిస్తూ.. ఇంటి పైభాగంలో నివసిస్తుంటే అది వాణిజ్య కేటగిరి కిందే చూపాలి. అయితే చాలాచోట్ల ఇలాంటి వాటిని గృహ కేటగిరితో సరిపెడుతున్నారు. దీంతో జలమండలి పెద్దఎత్తున ఆదాయం కోల్పోతోంది.
- చాలా వాణిజ్య నల్లాలకు అమర్చిన ఆటోమేటిక్ మీటర్లు ఎప్పుడో పాడయ్యాయి. దీంతో నెలానెలా సక్రమంగా బిల్లులు రావడం లేదు. భారీగా నీటిని వాడుతున్నప్పటికీ సాధారణ బిల్లులతో ఆదాయానికి గండి పడుతోంది. తాజా అధ్యయనంలో ఈ అంశాలన్నిటిపైనా జలమండలి దృష్టి సారించనుంది. ప్రతి వాణిజ్య, వ్యాపార సముదాయాన్ని సందర్శించి అక్కడ నల్లా కనెక్షన్ ఉందా.. ఏ సైజులో ఉంది.. నెలవారీ బిల్లులు పరిశీలించి ఆదాయం పెంపు దిశగా దృష్టి సారించనుంది.

తూతూమంత్రం.. ప్రమాదాలకు మార్గం

- అటకెక్కిన ఆటోమేటిక్ ఫిట్‌నెస్ కేంద్రాల ప్రతిపాదన

ఈనాడు, హైదరాబాద్

గ్రేటర్‌లో ఆటోమేటిక్ వాహన ఫిట్‌నెస్ కేంద్రాలు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. గతంలో చౌటుప్పల్ ప్రాంతంలో ఆటోమేటిక్ ఫిట్‌నెస్ కేంద్రం పనులు ప్రారంభమైనప్పటికీ వివిధ కారణాలతో ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం తూతూమంత్రంగా చేస్తున్న ఫిట్‌నెస్‌తో స్కూల్ బస్సులు, ఆటోలు, స్కూల్ వ్యాన్లు, మినీ బస్సులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. గ్రేటర్‌లో 3 కమిషరేట్ల పరిధిలో ఏటా 5-6 వేల ప్రమాదాలు జరుగుతున్నాయి. నిబంధనల ప్రకారం ప్రజారవాణాకు సంబంధించి ప్రతి వాహనానికి ఏటా ఆర్టీవో నుంచి ఫిట్‌నెస్ ధ్రువపత్రం తీసుకోవాలి. కొన్నిసార్లు అధికారులకు కొంత ముట్టజెప్పి ఫిట్‌నెస్ లేని వాహనాలకూ ధ్రువపత్రాలు తీసుకుంటున్నారు కొందరు. ఆటోమేటిక్ ఫిట్‌నెస్ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ ఇక్కడ అందుబాటులోకి తేవడంలో జాప్యం జరుగుతోంది.



గ్రేటర్‌లో ఫిట్‌నెస్‌కు అర్హమైన వాహనాలు....

వాహనాల కేటగిరి	సంఖ్య
ఆటో రిక్షాలు	1,08,710
కాంట్రాక్టర్ క్యారేజీలు	6,947
పాఠశాలల బస్సులు	15,513
మాక్సీ క్యాబ్‌లు	15,744
మోటారు క్యాబ్‌లు	81,276
మోటారు కార్లు	14,95,121
ప్రైవేటు సర్వీసు వాహనాలు	2,300
స్టేజీ క్యారేజీలు	8,548

ఆటోమేటిక్‌తో ఇలా..

- ఆటోమొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ) నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వాహనానికి సంబంధించి 40 అంశాలను ఈ కేంద్రాల్లో పరిశీలించి వాహన సామర్థ్యాన్ని అంచనా వేస్తాయి.
- టైర్లు, బ్రేకులు, స్టీరింగ్, ఇంజిను సామర్థ్యం, వాహన బాడీ ఇలా ప్రతి అంశాన్ని తనిఖీ చేసి సదరు వాహనం రోడ్లపై తిరిగేందుకు అర్హమైనదా.. కాదా.. గుర్తించి స్కోరు అందిస్తుంది. ఆ స్కోరునుబట్టి ఫిట్‌నెస్ ధ్రువీకరణ జారీ చేస్తారు.
- ఇందులో మానవ ప్రమేయం లేకపోవడం వల్ల అసలైన వాహన సామర్థ్యం ఏంటో తెలుస్తుంది. ప్రస్తుతం సరైన ఫిట్‌నెస్ లేకుండానే వాహనాలు బయట తిరుగుతున్నాయి. ఈ కేంద్రాలతో ఆ పరిస్థితి ఉండదు.

సికింద్రాబాద్

•సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

సందడిగా దాండియా నృత్యాలు



మారేడుపల్లి: వెస్ట్‌మారేడుపల్లి మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్లో యువతులు, మహిళల దాండియా నృత్యాలు సందడిగా సాగాయి. కిడ్స్ కిరణ్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్ కొంతం దీపిక విచ్చేసి జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం నృత్య కార్యక్రమాలు కోలాహలంగా సాగాయి.

ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రారంభోత్సవ సభలో సందడి



డిజిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డుల దరఖాస్తులు సమర్పించిన కుటుంబ సభ్యులతో సీఎం రేవంత్ రెడ్డి తదితరులు



సభకు హాజరైన మహిళలు

కంటోన్మెంట్, కార్ఖానా, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలోని మడ్‌ఫోర్ట్ హాకీ మైదానంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభ విజయవంతమైంది. కంటోన్మెంట్‌లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. కేంద్రం ఆధీనంలోని కంటోన్మెంట్‌లో నెలకొన్న స్థానిక సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న సందర్భంలో సభా ప్రాంగణం హర్షధ్వానాలతో మారుమోగింది. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని కంటోన్మెంట్‌లో పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభించనుండడంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఏర్పాట్లను చేసింది. ఈ సభకు సంబంధించిన సైడ్‌లైట్స్ ఇలా ఉన్నాయి.

● ఫ్యామిలీ డిజిటల్ కార్డు దరఖాస్తు ఫారాన్ని మొదటగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేశ్ సతీమణి వర్షకు, అనంతరం మరో నలుగురు మహిళలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అందజేశారు.

● సభ 11:50 గంటలకు ప్రారంభమైనప్పటికీ ఉదయం 9 గంటల నుంచే ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ● జయజయహే తెలంగాణ రాష్ట్ర గానంతో సభ ప్రారంభమైంది.

● కంటోన్మెంట్‌లో దీర్ఘకాలికంగా నెలకొన్న భూమార్పిడి, ఇళ్ల పట్టాల పంపిణీ, కంటోన్మెంట్ ఎన్నికల ఓటరు జాబితాలో ఓట్ల తొలగింపు, విలీనం అంశాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. దీంతో ప్రజల నుంచి పెద్దఎత్తున హర్షధ్వానాలు వ్యక్తమయ్యాయి. ● ఉదయం 8 గంటలకే సభా ప్రాంగణానికి చేరుకున్నామని, కనీసం నీటి వసతిని సైతం ఏర్పాటు చేయలేదని పలువురు మహిళలు బహిరంగంగానే అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంతలో అక్కడున్న పోలీసులు స్థానిక నేతల సహకారంతో మహిళల గ్యాలరీలో నీటి వసతి కల్పించడంతో శాంతించారు. ● సభలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉత్తర మండలం పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు.

ఏళ్లు గడుస్తున్నా.. కేటాయించరా ఇళ్లు?

హమాలీబస్తీ ఫేజ్-2లో లబ్ధిదారుల నిరీక్షణ

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: ఆ బస్తీలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయి ఏళ్లు గడుస్తున్నాయి. వీటిలో కొన్ని ఇళ్ల కేటాయింపులు జరగక, అటు నెలవారీ అద్దెలు కట్టలేక లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అశ్రద్ధ కారణంగా ఏహమాలీబస్తీ ఫేజ్-2లోని పక్కా ఇళ్ల కేటాయింపు ఇంకా కొలిక్కి రాలేదు. మెట్టుగూడ డివిజన్ పరిధిలోకి వచ్చే బస్తీలో మొత్తం 272 ఇళ్లను నిర్మించేలా దశాబ్దాల కిందట ప్రతిపాదనలు చేశారు. 2008లో నిర్మాణాలు ప్రారంభించగా.. లబ్ధిదారులంతా బస్తీని ఖాళీచేసి బయట అద్దెలకు ఉంటున్నారు. సాఫీగా జరగాల్సిన ఇళ్ల నిర్మాణాలకు తరచూ అడ్డంకులు ఏర్పడ్డాయి. అధికారులు, కాంట్రాక్టర్ మధ్య అవగాహన లోపం.. రెండు బ్లాకులు తమ పరిధిలో ఉన్నాయంటూ రైల్వేశాఖ అడ్డు తగలడం.. తదితర ఆటంకాల నేపథ్యంలో 2012 నాటికి 160 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. లబ్ధిదారులు తమ ఇళ్లను సొంతం చేసుకోవాలంటే తమ వాటాగా రూ.80 వేలను కట్టాల్సిందేనంటూ కొంతకాలం ఒత్తిడి తీసుకువచ్చారు. వీరిలో యాభై మంది మొత్తం డబ్బు చెల్లించినా.. వారికి సరైన రీతిలో నిర్మాణాలను చేపట్టలేదు. వివిధ కారణాల వల్ల తీవ్రంగా జాప్యం జరిగి 2014 నాటికి మొత్తం పూర్తయ్యాయి.

మండల కార్యాలయంలోని దస్త్రాల గల్లంతు!

జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం ద్వారా నిర్మించిన 272 ఇళ్లల్లో ఇంకా 60 ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించాల్సి ఉంది, పూర్తయిన ఇళ్ల కంటే లబ్ధిదారులు ఎక్కువగా ఉన్నారనే బస్తీవాసుల వాదనల మేరకు రెవెన్యూ అధికారులు అక్కడ పలుమార్లు సందర్శించి సర్వేలు నిర్వహించినా పరిష్కారం లభించలేదు. నిర్మాణాల సమయంలో 32 ఇళ్లకు సంబంధించిన రెండు బ్లాకులను రైల్వే అడ్డుకోవడం, మరో ఇరవై ఇళ్ల విషయంలోనూ అడ్డుకున్న నేపథ్యంలోనే పూర్తయిన 60 ఇళ్ల కేటాయింపు ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతున్నట్లు చెబుతున్నారు. నిర్మించిన ఇళ్లను కేటాయించక ఖాళీగా ఉంచేయటం వల్ల పైపులైన్లు పగిలిపోయి, చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి, మెట్ల దారులు మూసుకుపోయి దెబ్బతింటున్నాయి. తాజాగా బస్తీ గృహనిర్మాణ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించాలని కోరుతూ అధికారులను కలిసి విన్నవించారు. ఆ ఇళ్లకు సంబంధించిన ఫైళ్లు మండల కార్యాలయంలో గల్లంతైనట్లు అధికారులు చెబుతున్నారని, ఈ నేపథ్యంలో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు.



కొత్త ఇళ్ల సముదాయం

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్	:	8008573368
కంటోన్మెంట్	:	8008573361
సనత్‌నగర్	:	8008573356

కంటోన్మెంట్, రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే

? నాలుగో వార్డు పరిధిలోని పికెట్ నాలా పరివాహక ప్రాంతాల్లో పందులు స్వైరవిహారం చేస్తుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. – రాఘవేంద్ర, పికెట్

✓ పికెట్ నాలా పరివాహక ప్రాంతాల్లో స్వైర విహారం చేస్తున్న పందులను ఏరివేస్తాం. – ఆవుల మహేందర్, బోర్డు పారిశుద్ధ్య విభాగాధిపతి

? సికింద్రాబాద్ రెజిమెంటల్‌బజార్‌లోని 'ఏ' లైన్‌లో చెత్త పేరుకుపోయి దుర్గంధం వస్తోంది. పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా రాకపోవడం, చెత్తను తొలగించకపోవడంతో ఈ ప్రాంతంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – కృష్ణారావు, రెజిమెంటల్‌బజార్

✓ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. – ధర్మారెడ్డి, డీఈ, జీహెచ్‌ఎంసీ

ప్రారంభమైన శరన్నవరాత్రి మహోత్సవాలు



సికింద్రాబాద్, మధురానగర్‌లో..



కుమ్మరిగూడలో రాజరాజేశ్వరీదేవి



వారాసిగూడ ప్రాంతంలో మాత ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో



సీతాఫలమండిలో ..

బన్సీలాల్‌పేట్, రాణిగంజ్, సంజీవ రెడ్డినగర్: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తొలిరోజు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు మల్లికార్జునగౌడ్, అరుణగౌడ్, కిరణ్మయితో కలిసి ఆలయాన్ని సందర్శించారు. బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రోత్సవాలను దేవస్థానం ఈఓ బి.కృష్ణ, ఛైర్మన్ కె.సాయిబాబాగౌడ్ పాల్గొని ప్రారంభించారు. మొదటి రోజున ఎల్లమ్మ బాలాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానానికి ఆయన విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు.

నీటి నిర్వహణ పనులు పరిశీలించిన జలమండలి ఈడీ

రెజిమెంటల్‌బజార్: జలమండలి ఓఅండ్‌ఎం డివిజన్ 7 పరిధిలోని శ్రీనివాస్‌నగర్, నల్లగుట్ట ప్రాంతాల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ గురువారం గురువారం పర్యటించారు. ఆ ప్రాంతంలోని తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, సప్లయ్ లెవల్స్, మురుగు నీటి నిర్వహణ తదితర పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈడీ వెంట డైరెక్టర్ ఆపరేషన్స్-1 విజయరావు, జీఎం, డీజీఎం, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌ టైం లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

లాలాపేట: పార్ట్ టైం లెక్చరర్ల సమస్యలను పరిష్కరించి విధిగా చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్ టైం లెక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సంస్థ రాష్ట్ర ఛైర్మన్ డాక్టర్ రియాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. క్లాస్‌తో సంబంధం లేకుండా నెలకు రూ.50 వేల చొప్పున 12 నెలలు ఇవ్వాలని కోరారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు డా. రమేందర్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎర్రం నాగేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ డా. ఎం.కుమార స్వామి పాల్గొన్నారు.

ఐఐసీటీలో వ్యవస్థాపక వేడుకలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తార్నాకలోని ఐఐసీటీలో 83వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించామని సీఎస్ఐఆర్, ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నేషనల్ ఫిజికల్ డైరెక్టర్ వేణు గోపాల్ ఆచంట ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఫౌండేషన్ డే లెక్చర్ మెట్రాలజీ, మెటీరియల్స్‌పై దృష్టి సారించిందన్నారు. చెరగని సిరా, ప్లాస్టిక్‌తో పేవ్‌మెంట్‌లను, ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం వంటి సాంకేతికత పరిశోధన కార్యక్రమానికి దోహదపడుతుందని తెలిపారు. సిమెంట్, పెట్రోలియం, నీటి పరీక్ష, అధిక స్వచ్ఛత రసాయనాలు, విలువైన లోహాలు ఫార్మాస్యూటికల్స్ వంటి వాటిపై 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకుందని వివరించారు.

తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలు.. నిందితుడి అరెస్టు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇళ్లలో చేసుకుని పట్టపగలే చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని సెక్రటేరియట్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, క్రైం ఎస్సై హనుమంతరావుల కథనం ప్రకారం... ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా, గండేపల్లి మండలం, మల్లేపల్లి గ్రామానికి చెందిన కొల్లపాలు మణికంఠ(21) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఎంఎస్ మక్తాలో నివాసం ఉంటూ క్యాటరింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ డబ్బు విలాసాలకు సరిపోకపోవడంతో చోరీల బాట పట్టాడు. ఇతడు బోరబండ, కూకట్‌పల్లి, అల్లాపూర్‌లో కలిసి ఆరు కేసుల్లో నిందితుడు. ఎంఎస్ మక్తాలో నివాసం ఉంటూ ఆటోడ్రైవర్ బాలకృష్ణ తన భార్యకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఈ నెల 2న ఉదయం ఇంటికి తాళం వేసి తాళపు చెవి చెప్పుల స్టాండ్‌లో పెట్టి భార్యను తీసుకుని ఆసుపత్రికి వెళ్లాడు. 3న ఉదయం తిరిగి వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉంది. అందులోని బంగారు నగలు కనిపించకపోవడంతో సెక్రటేరియట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్లూస్ బృందం పరిశీలించగా ఎలాంటి వేలిముద్రలు, ఆధారాలు లభ్యం కాలేదు. సెంట్రల్‌జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్, ఇన్‌ఛార్జి ఏసీపీ పూర్ణచందర్‌రావుల ఆదేశాల మేరకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. పాత నేరస్థులపై అనుమానంతో నిఘా ఉంచారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుడు మణికంఠను గురువారం ఉదయం అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతడి నుంచి నగలు స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించారు. 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకున్న సెక్రటేరియట్ ఇన్‌స్పెక్టర్, ఎస్సై, సిబ్బందిని డీసీపీ అక్షాన్ష్ యాదవ్ అభినందించారు.

తప్పుడు ప్రచారంపై అత్యాచార బాధితురాలి కేసు

ఈనాడు, హైదరాబాద్: తనపై సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ యూట్యూబర్ హర్షసాయిపై నమోదైన అత్యాచార కేసులో బాధితురాలు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హర్షసాయి సూచన మేరకు తప్పుడు ఆడియో కాల్ రికార్డింగ్స్, అవాస్తవ సమాచారాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. అత్యాచార కేసులో బాధితురాలి ప్రతిష్ట దిగజార్చాలనే ఇవి వ్యాప్తి చేస్తున్నారని వివరించారు. తప్పుడు ప్రచారం చేస్తున్న విజ్ఞాన్ దాసరి, మహిధర్ సురిశెట్టి, ఆర్జే శేఖర్ భాషాపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 30న కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీఎడ్ ఫలితాల విడుదలకు వినతి

లాలాపేట, న్యూస్‌టుడే: ఓయూ పరిధిలో బీఎడ్ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసి డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు మార్గం సుగమం చేయాలని అభ్యర్థులు రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణకు గురువారం వినతి పత్రం అందజేశారు. పలువురు క్వాలిఫైడ్ అభ్యర్థులు పాల్గొన్నారు.

వీసీగా మాదిగ ప్రొఫెసర్‌ను నియమించాలి

లాలాపేట: ఓయూ వీసీగా మాదిగ ప్రొఫెసర్‌ను నియమించాలని ఎమ్మెఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ డిమాండ్ చేశారు. ఓయూలోని ఆర్ట్స్ కళాశాల వద్ద మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు వర్సిటీ పాలనాపరమైన పదవుల్లో వివక్షతో వ్యవహరించారని విమర్శించారు. రాష్ట్రంలో అత్యధికంగా జనాభా ఉన్న మాదిగలకు ఓయూ వీసీ పదవి ఇచ్చి న్యాయం చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు.

కారుణ్య నియామకాల్లో జాప్యంతో అవస్థలు



బోర్డు కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బాధితులు

కంటోన్మెంట్, కార్ఖానా న్యూస్‌టుడే: కంటోన్మెంట్ బోర్డులో కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని కంటోన్మెంట్ బోర్డు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పరశురాం డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు బాధితులతో కలిసి గురువారం బోర్డు కార్యాలయం ఆవరణలో ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత 14 సంవత్సరాలుగా కారుణ్య నియామకాలు చేపట్టడం లేదని, దాదాపు 125 మంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. అనేక మంది బాధితుల కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పారిశుద్ధ్య విభాగంలో మరణాల రేటు ఎక్కువగా ఉంటుందని, అయినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆందోళనలో నిరంజన్, రాజేశ్, మధు, మనోజ్, హేమలత, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి రామానందతీర్థ జయంతి



స్వామి రామానందతీర్థ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, చిన్నారులు

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: బేగంపేటలోని బ్రాహ్మణవాడీలో ఉన్న స్వామి రామానందతీర్థ మెమోరియల్ కమిటీలో స్వామి రామానంద తీర్థ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామీజీ సమాధి వద్ద పుష్పాంజలి సమర్పించారు. కీర్తనలు ఆలపించడంతో పాటు భజన చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి అసెంబ్లీ ఎదురుగా ఉన్న స్వామి రామానందతీర్థ విగ్రహం వద్దకు వెళ్లి నివాళులు అర్పించారు. పీవీ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ పి.వి.ప్రభాకర్‌రావు, సురభి సోలార్ ఛైర్మన్ శేఖర్ మరంరాజు, మెమోరియల్ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వాసుకి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్లో ప్రయాణికుడి బ్యాగులోని నగదు అపహరణ

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రైల్లో నగరానికి వస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు బ్యాగులోని రూ.లక్షన్నర నగదు చోరీకి గురైంది. కృష్ణా జిల్లా గుడివాడ, రాజేంద్రనగర్‌కు చెందిన పల్లెం త్రివేణికుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. నగరంలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చేందుకు గుడివాడ రైల్వేస్టేషన్ నుంచి బీదర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరాడు. గురువారం తెల్లవారు జామున 4.10 గంటలకు మెలకువ వచ్చి చూసుకోగా.. సీట్ కింద ఉంచిన బ్యాగు కనిపించలేదు. బ్యాగులో దుస్తులతో పాటు రూ.1.5 లక్షల నగదు ఉండటంతో అంతా వెతికాడు. చివరికి బ్యాగును బాత్‌రూంలో ఉన్నట్లుగా గుర్తించి చూడగా.. అందులోని నగదు కనిపించలేదు. ఈ సమయంలో రైలు కాజీపేట్ ప్రాంతంలో ఉండటంతో రైల్లో సికింద్రాబాద్‌కు చేరుకున్న అనంతరం జీఆర్పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని కాజీపేట్‌కు బదిలీ చేస్తున్నారు.

ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం సాయంత్రం రైల్వేస్టేషన్‌లోని 5వ నెంబరు ప్లాట్‌ఫాంపై ఓ వ్యక్తి(35) మృతిచెంది ఉన్నట్లుగా గుర్తించిన రైల్వే సిబ్బంది జీఆర్పీ పోలీసులకు తెలియజేశారు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు పరిశీలించి అనారోగ్యంతో మృతిచెందినట్లుగా గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

భర్త దరికి చేరుతూనే.. అనారోగ్యంతో మృత్యు ఒడికి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోగా.. మతిస్థిమితం సరిగాలేని తమ్ముడిని అన్నీ తానే అయి పోషించింది. ఇటీవలే ఆపరేషన్ చేయించుకున్న ఆమె కుమారుడు, సోదరుడితో కలిసి సొంతూళ్లోనే ఉండేది. తమ్ముడు అదృశ్యం కావడంతో నగరంలో ఉంటున్న భర్త దగ్గరకు బయలుదేరి వచ్చిన కొద్దిసేపట్లోనే ప్రాణాలను కోల్పోయిన ఘటన సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్సై రమేష్ కథనం ప్రకారం... బిహార్ రాష్ట్రానికి చెందిన సునీల్‌రాయ్, రూబీదేవి(33)లకు 15 ఏళ్ల క్రితం వివాహం కాగా.. ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. కొద్ది రోజుల క్రితం నగరానికి వచ్చిన సునీల్‌రాయ్ మేడ్చల్‌లో ఉంటూ అక్కడే హోటల్‌లో పనిచేస్తున్నాడు. రూబీదేవికి అనారోగ్యం కారణంగా మూడు నెలల క్రితం గర్భసంచిని తొలగించారు. ఇటీవల ఆమె సోదరుడు కనిపించకుండా పోవటంతో.. భర్త ఫోన్ చేసి హైదరాబాద్‌కు రమ్మని చెప్పాడు. దీంతో దర్భంగా ఎక్స్‌ప్రెస్ రైల్లో బయలుదేరి గురువారం తెల్లవారు జామున సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. అక్కడికి వచ్చిన సునీల్‌రాయ్ రెండు రోజులకు పైగా ప్రయాణం చేసి నీరసించి ఉన్న భార్య నడవలేక పోతుండటంతో నీరు తాగించి 4వ నెంబరు ప్లాట్‌ఫాం నుంచి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి మీదుగా ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంకు తీసుకువచ్చాడు. అక్కడి నుంచి ఆసుపత్రికి తరలించాలని ప్రయత్నంలో ఉండగానే కన్నుమూసింది. రైల్వే పోలీసులకు తెలియజేయడంతో జీఆర్పీ పోలీసులు సమాచారం తెలుసుకుని మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించారు. సొంతూరుకు తరలించే స్తోమత లేకపోవడంతో నగరంలో ఉన్న బంధువులు, స్నేహితులు, తెలిసిన వారితో కలిసి ఇక్కడే అంత్యక్రియలు పూర్తిచేశాడు.

ఎస్డీ రోడ్డులోని ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



షెడ్లను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రెజిమెంటల్‌బజార్: ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు నడుం బిగించారు. ఎస్డీ రోడ్డు మినార్వా కాంప్లెక్స్ ప్రాంతంలోని దుకాణాల ముందున్న షెడ్లను తొలగించారు. నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహంకాళి ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్, ఎస్ఐ మహేష్‌ల నేతృత్వంలో గురువారం సాయంత్రం అక్కడున్న దుకాణాల షెడ్లను తొలగించారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కంటోన్మెంట్ అభివృద్ధి

కార్ఖానా: కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధి భాజపాతోనే సాధ్యమని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ పేర్కొన్నారు. భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం రెండో వార్డులోని అన్నానగర్, అర్జున్ నగర్ బస్తీలలో పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టారు. కంటోన్మెంట్‌లో జరిగే ప్రతీ అభివృద్ధి పనిలో కేంద్ర ప్రభుత్వ పాత్ర ఉందన్నారు. భాజపా వార్డు అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి స్వామి, యువ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ.. సంస్కృతికి పట్టుగొమ్మ



బీకేగూడ చాణక్యనగర్ కాలనీలో..



ఎస్సార్‌నగర్ సి-టైపు కాలనీలో..

న్యూస్‌టుడే బృందం: బతుకమ్మ వేడుకలు మహిళలు సందడిగా నిర్వహించుకుంటున్నారు. అందంగా పేర్చిన బతుకమ్మలను మహిళలు, యువతలు తీసుకువచ్చి ఒకచోట పేర్చి వాటిచుట్టూ తిరుగుతూ ఆటాపాటలతో అలరిస్తున్నారు.



జెక్ కాలనీలో..



బన్సీలాల్‌పేట డివిజన్ బోలక్‌పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..

సేవలకు గుర్తింపు



భాస్కర్ గుప్త

సంజీవరెడ్డినగర్: కళాకారుల సంక్షేమానికి కృషి చేసినందుకు ఎన్టీఆర్ విశిష్ట పురస్కారం రావడం సంతోషంగా ఉందని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ ఇన్‌ఛార్జి, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ ఇన్‌ఛార్జి డా.కటకం భాస్కర్‌గుప్త చెప్పారు. అంతర్జాతీయ సంగీత దినోత్సవం సందర్భంగా సౌత్ ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ ఈ అవార్డును బుధవారం రాత్రి ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారన్నారు.

భాజపా జిల్లా కమిటీ ప్రతినిధుల నియామకం

సికింద్రాబాద్: సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఉపాధ్యక్షులుగా సీతాఫల్ మండికి చెందిన కనకట్ల హరి, కార్యదర్శిగా బౌద్ధనగర్‌కు చెందిన మద్దెర్ల శ్యామ్ సుందర్‌లు నియమితులయ్యారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.శ్యాంసుందర్ గౌడ్, మేకల సారంగపాణిలు నియామక పత్రాలను అందజేశారు.

కళామహోత్సవంలో విద్యార్థుల సందడి



ఈశాన్య రాష్ట్రాల స్టాల్ సందర్శిస్తున్న విద్యార్థులు

బొల్లారం: బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళామహోత్సవానికి గురువారం విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇక్కడి ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయ, జానపద, గిరిజన వృత్తులు, నృత్యాలను చూసి మంత్రముగ్ధులయ్యారు. పలు స్టాళ్లలోని గిరిజన ఉత్పత్తులను ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులకు నిలయం నిర్వహణ అధికారి రజిని ప్రియ ఆధ్వర్యంలో ఈశాన్య రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా సద్దుల బతుకమ్మ వేడుకలు ఈనెల 10న వైభవంగా నిర్వహించనున్నట్లు బీకేగూడ బతుకమ్మ ఉత్సవ కమిటీ ప్రతినిధులు వడ్డే కరుణాకర్‌రెడ్డి, పి.కుమార్, బి.ఆర్.నారాయణ రాజు చెప్పారు. ఉత్సవ ఏర్పాట్లపై గురువారం ప్రతినిధులతో బీకేగూడలో సమావేశం ఏర్పాటు చేశారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో ఈ వేడుకలు ఏర్పాటు చేశామన్నారు. దాండియా, కోలాటం వంటి ఆటలు ఉంటాయన్నారు. బతుకమ్మలను తీసుకుని వచ్చిన మహిళలకు బహుమతులు అందజేస్తామన్నారు.

హత్యగా తేలిన వ్యక్తి మృతి

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: అమీర్‌పేట కుమ్మరి బస్తీలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఓ యువకుడి మృతి హత్యగా తేలింది. స్థానిక సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించిన ఎస్సార్‌నగర్ పోలీసులు మృతుడికి వరుసకు అన్నయ్య అయిన వ్యక్తిని విచారణ చేయగా.. అసలు విషయం బయటకు వచ్చింది. బల్కంపేటకు చెందిన సర్దార్ గురుప్రీత్‌సింగ్ (26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసి ఇటీవలే మానేశాడు. ఈయనకు కడుపులో కత్తి గుచ్చుకుని బుధవారం అర్ధరాత్రి తరువాత మృతి చెందాడు. ఇతడి పెదనాన్న కుమారుడు బల్బీర్‌సింగ్ (36) తన ఇంటిలో మెట్లపై జారిపడటంతో నడుముకు ఉన్న కత్తి గుచ్చుకుని మృతి చెందినట్లు పోలీసులకు చెప్పాడు. అనుమానం వచ్చిన పోలీసులు స్థానికంగా ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఈ నేపథ్యంలో పోలీసులు బల్బీర్‌సింగ్‌ను విచారించగా తానే హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడు. మద్యం దుకాణం వద్ద తన మాట వినకుండా మిత్రుడు ఏఆర్ కానిస్టేబుల్ సాయితో అతడు గొడవ పడటంతో తనకు కోపం వచ్చిందని, ఆవేశంలో కత్తితో అక్కడే పొడిచినట్లు చెప్పాడు. ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడని వివరించాడు. నిందితుడిని అరెస్టు చేసి పరారీలో ఉన్న మిగతా ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్: (గురువారం నాటివి..కిలో రూ.లో) టమాటా 63, వంగ 28, బెండ 38, పచ్చిమిర్చి 28, కాలీఫ్లవర్ 23, క్యాబేజీ 19, క్యారెట్ 43, దొండ 45, ఆలు 38, ఉల్లి 44, సొర 17, పొట్ల 18, బీన్స్ 95, గోరు చిక్కుడు 40, చిక్కుడు 55, దోస 28, బీర 38, కాకర 45, చామగడ్డ 35, కీర 40, క్యాప్సికం 70, బీట్‌రూట్ 25, కందగడ్డ 55,మునగ 75, ముల్లంగి 6(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ: టమాటా కిలో రూ.63, వంగ 35, బెండ 38, పచ్చిమిర్చి 28, కాకర 45, బీర 38, క్యాబేజీ 19, బీన్స్ 95, క్యారెట్ 43, దొండ 45, చిక్కుడు 55, క్యాప్సికం 70, ఆలు 38, కీర 21, దోస 28, చామగడ్డ 35, అరటి 10, బీట్‌రూట్ 25, సొర 17, గోకర 40, చిలకడదుంప 38, మామిడి 105, మునగ 76.

తడి పొడి చెత్తను రిక్షాలలోనే వేయండి


పటేల్‌నగర్ వాసులకు చెత్తను రిక్షాల్లోనే వేయాలని కోరుతున్న కార్పొరేటర్

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరి డివిజన్ పరిధి లోని పటేల్‌నగర్‌లో గురువారం కార్పొరేటర్ శ్రవణ్‌కుమార్ పర్యటించారు. ప్రతి ఇంటిలోని తడి, పొడి, చెత్తను పారిశుద్ధ్య విభాగం రిక్షా కార్మికులకు అందజేయాలని కాలనీవాసులకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ కప్పులలో టీ అమ్మకాలు చేయవద్దని టీ స్టాల్స్ వారిని కోరారు. అధికారులు శ్రీనివాస్, గిరి, బాలమణి, రాజు తదితరులు పాల్గొన్నారు.

హృద్యంగా గాత్ర కచేరీ


గీతాలు ఆలపిస్తున్న డాక్టర్ మంగళంపల్లి స్వర్ణ

గౌతంనగర్, న్యూస్‌టుడే: కూచిపూడి నృత్య భారతి అకాడమీ ఆధ్వర్యంలో దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లో నిర్వహించిన గాత్ర కచేరీ హృద్యంగా సాగింది. డాక్టర్ మంగళంపల్లి స్వర్ణ ఆలపించిన భక్తి గీతాలు వీనుల విందుగా సాగాయి. కేవీఎన్ మూర్తి వయొలిన్, బి.జనార్దన్ మృదంగ సహకారం అందించారు. డాక్టర్ పసుమర్తి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువ పనుల పరిశీలన

మల్కాజిగిరి, న్యూస్‌టుడే: మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని పటేల్‌నగర్‌లో గురువారం భారాస నేత, మాజీ కార్పొరేటర్ ఎన్.జగదీశ్ గౌడ్ పర్యటించారు. ఇక్కడ జరుగుతున్న కాలువ పనులను ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు పరిశీలించినట్లు తెలిపారు. ఇక్కడి కాలువను హైదర్‌నగర్ వద్ద కాలువలో కలిసేలా నిర్మాణం చేయాలని కొంతమంది స్థానికులు విజ్ఞప్తి చేశారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

కాలనీల్లో రహదారుల నిర్మాణం


శంకుస్థాపన కార్యక్రమంలో కార్పొరేటర్ జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారంలోని బొల్లారం రైల్వే స్టేషన్-సంజీవరెడ్డిగార్డెన్ మార్గంలో రూ.34లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం కార్పొరేటర్ జితేంద్రనాథ్ శంకుస్థాపన చేశారు. ప్రతి కాలనీలో కొత్తగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే చాలా కాలనీల్లో సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు.

భాజపా సభ్యత్వ నమోదు

అల్వాల్, న్యూస్‌టుడే: మచ్చబొల్లారంలోని వీబీఆర్ గార్డెన్ సమీపంలో గురువారం నిర్వహించిన భాజపా సభ్యత్వ నమోదుకు మంచి స్పందన లభించిందని ఆ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పద్మిని, ఓబీసీ సెల్ ప్రచార కార్యదర్శి మోయి సుజాత పేర్కొన్నారు. శిబిరంలో పలువురు సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. వెంకటేశ్, మల్లికార్జున్, ఆనంద్ పాల్గొన్నారు.

జాగాలున్నా.. జాగేలన్నా!

- పార్కులను పట్టించుకోని యంత్రాంగం
- వ్యర్థాలకు నిలయాలుగా ఉద్యానాలు

అల్వాల్, న్యూస్‌టుడే: జీహెచ్ఎంసీ ఆధీనంలోని పలు స్థలాలు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. కొన్ని పొదలు, పనికిరాని మొక్కలు పెరిగి దోమలకు నిలయాలుగా మారుతుండటంతో స్థానికులు తల్లడిల్లుతున్నారు. కోట్ల విలువైన స్థలాలను అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల ప్రకటనలకు చేతలకు పొంతన ఉండటం లేదని వాపోతున్నారు. ఇందుకు మచ్చబొల్లారంలోని హుడా అభివృద్ధి చేసిన మాసంతోషి కాలనీ ఉదాహరణ. కాలనీలో నలు దిక్కులా మున్సిపల్ స్థలాలు ఉండగా.. ఇందులో ఒక స్థలం పొదలు, వ్యర్థాలకు నిలయంగా మారగా.. మరొకటి మురుగుతో నిరుపయోగంగా మారింది. 2008లో ఇక్కడి మున్సిపల్ ఖాళీ స్థలాలను జీహెచ్ఎంసీ స్వాధీనం చేసుకొని ప్రహరీ నిర్మించింది. ఆ తర్వాత కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు ఉద్యానవనంగా మార్చే ప్రతిపాదనలను సిద్ధం చేశారు. అప్పటి యంత్రాంగం మారడంతో ప్రతిపాదనలను అటకెక్కించారు. ఆ తర్వాత స్థానికుల ఆందోళనతో రెండింటిని మొక్కుబడిగా అభివృద్ధి చేసి మిగిలిన వాటిని ఖాళీగా వదిలేశారు.


మాసంతోషి కాలనీలో పొదలతో ఉద్యానవనం

ఐదు వందల గజాల్లో.. సర్కిల్ పరిధిలో అతిపెద్ద కాలనీలో ఒకటైన మా సంతోషికాలనీలో ఐదు వందల గజాల్లో ఉద్యాన వన స్థలం ఉంది. పచ్చదనం, నడక మార్గం, పిల్లలు ఆడుకునేలా పరికరాలు ఏర్పాటు చేయాలని.. స్థానికంగా వృద్ధులను దృష్టిలో ఉంచుకొని పఠనగదిని నిర్మించాలని ప్రతిపాదించారు. ఐదు సంవత్సరాల కాలంలో వివిధ కాలనీలలో ఉద్యానాలను అభివృద్ధి చేశారు. ఇక్కడ మాత్రం యంత్రాంగం విస్మరించింది. స్థలం ఖాళీగా ఉండటంతో వ్యర్థాల పారబోతకు కేంద్రంగా మారింది.

నిర్వహణకు ముందుకు రాకపోవడంతో.. కాలనీ వాసులు ముందుకు వస్తేనే ఉద్యానవనాలు అభివృద్ధి చేస్తామని అధికారులు చెబుతున్నారు. నిర్వహణకు ఒక కాపాలాదారుడిని నియమించుకొంటామని కాలనీ సంక్షేమ సంఘం రాతపూర్వకంగా హామీ ఇవ్వాల్సి ఉంటుందని.. అప్పుడే నిర్వహణకు ప్రతి నెలా కొంత మొత్తంలో జీహెచ్ఎంసీ నిధులు కేటాయిస్తుందని చెబుతున్నారు. నిర్వహణకు సంబంధించి కాలనీ వాసులు ముందుకురాలేదని అధికారులు అంటుంటే.. కాలనీ వాసులు దాన్ని ఖండిస్తున్నారు.

నిర్వహణ బాధ్యత తీసుకుంటా:


– జడల కృష్ణ, మాజీ కౌన్సిలర్

కాలనీలో ఉద్యాన వనం నిరుపయోగంగా మారడానికి అధికారులే బాధ్యత వహించాలి. వివిధ ప్రాంతాల్లో పార్కులుగా తీర్చిదిద్ది కాలనీలోని ఈ ఉద్యాన స్థలాన్నే విస్మరించారు. పలుమార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదు. పార్కును అభివృద్ధి చేస్తే కాలనీకే కొత్త అందం వస్తుంది. నిర్వహణ బాధ్యతను నేను తీసుకుంటా.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

మల్కాజిగిరి, గౌతంనగర్, డిఫెన్స్‌కాలనీ, అల్వాల్, న్యూస్‌టుడే:

? తూర్పుఆనంద్‌బాగ్ డివిజన్ ఎన్ఎండీసీ కాలనీలో దోమల సమస్య తీవ్రంగా ఉంది. – వేణుకుమార్, కాలనీవాసి

✓ సమస్యను పరిశీలించి నివారణకు చర్యలు తీసుకుంటాం. – నజీరుద్దీన్, పర్యవేక్షకుడు, సర్కిల్ ఎంటమాలజీ విభాగం

? లాల్వాణీనగర్‌లో వారం రోజులుగా పగలు కూడా విద్యుత్తు దీపాలు వెలుగుతున్నాయి. ఎంతో విద్యుత్తు వృధా అవుతోంది. – ఉమ, లాల్వాణీనగర్

✓ టైమర్ల ఏర్పాటుతో సమస్య ఉత్పన్నమవుతోంది. క్షేత్ర స్థాయిలో పరిశీలించి మరమ్మతులు నిర్వహిస్తాం. – వెంకటేశ్, ఏఈ, వీధి దీపాల నిర్వహణ

? నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి మధురానగర్, శ్రీకాలనీలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. రాత్రి సమయంలో బయటకు వెళ్లలేక పోతున్నాం. – జయశ్రీ, మధురానగర్

✓ పరిశీలించి సమస్య పరిష్కరిస్తా. – మారుతి, వెటర్నరీ అధికారి

? కొత్తచెరువుకు వెళ్లే మార్గంలో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. మ్యాన్‌హోళ్లు పూడికపోయి మురుగు బయటకు వస్తోంది. – రాజశేఖర్, స్థానికుడు

✓ పూడిక తొలగించి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటా. – కృష్ణమాచారి, మేనేజర్, జలమండలి

మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు


స్పందనకు వందనం

గౌతంనగర్, న్యూస్‌టుడే: గౌతంనగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్ ప్రధాన మార్గంలో మ్యాన్‌హోళ్లు కుంగి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సమస్య తీవ్రతను వివరిస్తూ సెప్టెంబరు 30న 'కుంగిన మ్యాన్‌హోళ్లతో ఇబ్బందులు' శీర్షికతో ఈనాడులో ప్రచురితమైన చిత్ర కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మల్లికార్జున్‌నగర్ కూడలి నుంచి జ్యోతినగర్ వరకు ప్రధాన మార్గంలో ఉన్న అన్ని మ్యాన్‌హోళ్లకు మరమ్మతు పనులు ప్రారంభించారు. అధికారులు స్పందించడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

పండగొచ్చినా పూర్తికాని ఏర్పాట్లు

- కొత్తచెరువు కోనేరు వద్ద కొనసాగుతున్న పనులు
- బతుకమ్మ నిమజ్జనాలకు ఇబ్బందులు


కోనేరు మార్గంలో ఏర్పాటు చేస్తున్న కొత్త ద్వారం


తొలగించని వ్యర్థాలు

అల్వాల్, న్యూస్‌టుడే: అల్వాల్‌లోని కొత్తచెరువు కోనేరు వద్ద అభివృద్ధి పనులు కొనసాగుతుండటంతో బతకమ్మల నిమజ్జనం ఎక్కడ చేయాలంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కోనేరును వినాయక, బతుకమ్మ నిమజ్జనం కోసం నాలుగు సంవత్సరాల క్రితం నిర్మించారు.

గడువులోగా పూర్తిచేయకుండా..

వినాయక నిమజ్జనానికి ముందు రూ.లక్షల వ్యయంతో సుందరీకరణ పనులు చేపట్టారు. వినాయక నవరాత్రులకు ముందే ఆయా పనులు పూర్తి చేయాలి. కానీ గుత్తేదారుడు అసంపూర్తిగా చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో వారం నుంచి తిరిగి పనులు మొదలు పెట్టారు. కోనేరుకు దక్షిణ, తూర్పు వైపు రెండు ద్వారాలు నిర్మిస్తున్నారు. ఈ పనులను బతుకమ్మ వేడుకలకు ముందే పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఇంకా కొనసాగిస్తూ కోనేరులోకి వెళ్లేందుకు ఉన్న మార్గాలను మూసివేశారు.

వ్యర్థాలు పేరుకుని..

మరోపక్క కోనేరు వద్ద వ్యర్థాలు కుప్పలుగా పేరుకపోయాయి. ఈ క్రమంలో వేడుకలు ప్రారంభమైన నేపథ్యంలో బుధ, గురువారాలలో బతుకమ్మలు నిమజ్జనం చేసేందుకు మహిళలు ఇబ్బందులు పడ్డారు. సాధారణంగా కోనేరు వద్ద బతుకమ్మ ఆడి నిమజ్జనం చేస్తారు. ప్రస్తుతం పనులు కొనసాగుతుండటం.. అపరిశుభ్రత నెలకొనడంతో సామూహికంగా నిర్వహించే వేడుకలకు తరలి వచ్చే మహిళలు ఏర్పాట్లపై నిరసన తెలుపుతున్నారు.

హైడ్రా బాధితులకు అండగా ఉంటా: ఈటల


శివానందనగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ రాజేందర్

మౌలాలి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ఓటేసినందుకు ప్రజల కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మౌలాలి పరిధిలోని బండ చెరువు పరిసరాల్లోని శివానందనగర్, కృష్ణానగర్, ఆర్టీసీ కాలనీ, పీబీనగర్, సంతోషిమాతనగర్‌లలో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల వాసులతో, అనంతరం శివానందనగర్‌లో మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని చెరువుల చుట్టు పక్కల్లో ఉంటున్న ప్రజలంతా నిచ్చింతగా ఉండాలని.. తామంతా అండగా ఉంటామని అన్నారు. రోజువారీ కూలీలు, చిరు వ్యాపారులు జాగాలు కొనుక్కొని కష్టపడి ఇల్లు కట్టుకున్నారని, వారి ఇళ్లు కూల్చడానికి నువ్వెవరవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. పార్టీలతో, జెండాలతో సంబంధం లేదు.. మీకు నేను అండగా ఉంటానని పేర్కొన్నారు.

కాలనీ వాసులు రాజకీయాలకు దూరంగా ఉండాలి


కాలనీ నేతను సత్కరిస్తున్న మైనంపల్లి

అల్వాల్, న్యూస్‌టుడే: కాలనీ వాసులు రాజకీయాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సూచించారు. గురువారం బటన్‌గూడ పరిసరాల కాలనీ నేతలను శాలువాతో సత్కరించారు. విద్యావంతులైన కాలనీ వాసులు అభివృద్ధికి మద్దతు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యేగా మచ్చబొల్లారం అభివృద్ధికి చేసిన కృషిని మైనంపల్లి వివరించారు. కార్పొరేటర్ జితేంద్రనాథ్, సురేందర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మురుగు శుద్ధికి ప్రాధాన్యం


అవగాహన ర్యాలీలో కార్పొరేటర్ విజయశాంతి

అల్వాల్, న్యూస్‌టుడే: అల్వాల్ పరిధిలో మురుగు శుద్ధికి ప్రాధాన్యం ఇచ్చేలా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కార్పొరేటర్ విజయశాంతి అన్నారు. గురువారం 90 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా మురుగుశుద్ధిపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వెంకట్రావు పేటలోని గోగ్రీన్ అపార్టుమెంటు వాసులకు అవగాహన కల్పించారు. వర్షపు నీటిని ఇంకుడుగుంతల ద్వారా భూగర్భంలోకి పంపిస్తే మ్యాన్‌హోళ్లపై ఒత్తిడి తగ్గుతుందన్నారు. జలమండలి మేనేజర్ కృష్ణమాచారి, శేఖర్, ఇమ్రాన్, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మొత్తుకుంటున్నా.. మార్పు రాదేమి?



నేరేడ్‌మెట్ డివిజన్ పరిధి యాప్రాల్ క్లాత్ వీధిలో రోడ్డు పక్కన చెత్తాచెదారం, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన కారణంగా స్థానికులతో పాటు ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త తరలించే వారికి డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని కొందరు పరిశుభ్రతను విస్మరించి రాత్రివేళలో రహదారి చెంత పడేస్తున్నారు. పరిశుభ్రతకు తిలోదకాలిస్తున్నారు. కొందరి కారణంగా ఎందరో ఇబ్బందులు పడుతున్నారు.

– న్యూస్‌టుడే, డిఫెన్స్‌కాలనీ

జనని శివకామిని.. జయ శుభకారిణి


శృంగేరి శంకరమఠంలో..


బాలాత్రిపుర సుందరిగా నల్లపోచమ్మ


అనంత సరస్వతీనగర్‌లోని జ్ఞాన సరస్వతి


వినోభానగర్ వెంకటేశ్వర ఆలయంలో..

గౌతంనగర్, మల్కాజిగిరి, అల్వాల్, నేరేడ్‌మెట్, డిఫెన్స్‌కాలనీ, మౌలాలి, న్యూస్‌టుడే: శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకరణలో ప్రత్యేక పూజలందుకున్నారు. ఉత్తమ్‌నగర్ దుర్గా జ్యోతిష్యాలయంలో వేద పండితులు మూగు నాగరాజుశర్మ ఆధ్వర్యంలో చండీ హోమం నిర్వహించారు.

★ అనంతసరస్వతీ నగర్‌లోని జ్ఞాన సరస్వతీ దేవాలయం, ఆనంద్‌బాగ్‌లోని లలితా పరమేశ్వరి దేవాలయం, ఆనంద్‌బాగ్‌లోని శిర్డి సాయిబాబా దేవాలయంలో వైభవంగా పూజలు నిర్వహించారు.


ఆయుగేటెడ్ కాలనీలోని మండపంలో..

★ సైనిక్‌పురి శృంగేరి శంకర మఠం విజయ గణపతి ఆలయంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. కుంకుమార్చన, చతుర్వేద పారాయణాలు, విశేష హోమాలు జరిగాయి.

★ మచ్చబొల్లారంలోని మహంకాళి ఆలయంలో అమ్మవారిని త్రిపురదేవిగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి దీక్షల్లో ఉన్న భక్తులు తోటముత్యాలమ్మ ఆలయంలో భజనలు నిర్వహించారు.

★ వినోబానగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర ఆలయంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రతిరోజు నవ దేవతామూర్తులుగా అలంకారం చేసి హోమాలు పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

★ మౌలాలి గాయత్రినగర్‌లోని శ్రీగాయత్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో చండీహోమం నిర్వహించారు.

జూనియర్ లెక్చరర్ల ఫలితాలు విడుదల చేయాలి

బాగ్‌లింగంపల్లి: జూనియర్ లెక్చరర్స్ ఫలితాలను సత్వరమే విడుదల చేసి.. ఎంపికైన వారికి నియామక పత్రాలను ఇప్పించాలని పలువురు అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుందరయ్య కళానిలయం ప్రాంగణంలో.. ఫలితాలను విడుదల చేయాలని ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం అభ్యర్థులు వేణురావు, లింగనాయక్, కిరణ్, సతీష్, పద్మ, రేఖ, సాజిద, ప్రణవ్‌లు మాట్లాడారు. 2023లో అప్పటి భారాస సర్కార్ జూనియర్ లెక్చరర్స్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిందని గుర్తుచేశారు.

'స్వచ్ఛతా హీ సేవా' ముగింపు వేడుకలు

కాచిగూడ: 'స్వచ్ఛతాహీ సేవా' ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. టెలికమ్యూనికేషన్స్ తెలంగాణ సర్కిల్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కంట్రోలర్ అనిత మహదాస్, జాయింట్ కంట్రోలర్ సీఎం సంపర్, ఉప కంట్రోలర్ ప్రతిభ ఖండేలా, ఆకుల రవీందర్‌రావు హాజరయ్యారు.






చంద్రపురంకాలనీలో యువతుల కోలాటం ★ దుర్గామాత నాటకాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థినులు ★ బతుకమ్మలతో పాషా పాఠశాల విద్యార్థులు, ఛైర్మన్ పాషా

సమీపిస్తున్న పండగ.. ప్రత్యేక రైళ్లకు నిరీక్షణ

కాచిగూడ, న్యూస్‌టుడే: దసరా పర్వదినం సమీపిస్తోంది.. పండగను స్వస్థలాల్లో కుటుంబ సభ్యుల మధ్య జరుపుకొనేందుకు.. నగరంలో స్థిరపడిన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రజల్లో ఎక్కువమంది సొంతూళ్లకు తరలివెళ్తుంటారు. వారిలో ఎక్కువ మంది రైళ్లలో వెళతారు. నగరంలోని ప్రముఖమైన కాచిగూడ స్టేషన్ నుంచి దసరాకు ప్రత్యేక రైళ్లను ఎప్పుడు నడుపుతారనే విషయమై స్పష్టత లేకపోవడంతో.. ప్రస్తుతం వారంతా నిరీక్షిస్తున్నారు. పండగ సెలవులలో నగరవాసులు ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలకు వెళ్లేందుకు కాచిగూడ-తిరుపతి మధ్య పలు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఇదేతరహాలో తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలు, పట్టణాలకు చేరుకునేందుకూ మరిన్ని రైళ్లను నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

గతంలో మూడు నెలల ముందుగానే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో టికెట్లను బుక్ చేసుకునే వారు. అనంతరం రైల్వే బోర్డు నాలుగు నెలలకు పెంచింది. దీంతో దసరా పండగకు కాచిగూడ నుంచి బయలుదేరి వెళ్లే అన్ని రైళ్లలో నాలుగు నెలల క్రితమే టికెట్లను రిజర్వ్ చేసుకున్నారు. ప్రస్తుతం అన్ని రైళ్లలోనూ నిరీక్షణ జాబితా(వెయిటింగ్ లిస్ట్)లు దర్శనమిస్తున్నాయి.

ఆటపాటలు.. కోలాటాలు

సందడిగా బతుకమ్మ వేడుకలు

అల్వాల్, మౌలాలి, నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: మల్కాజిగిరి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో గురువారం బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి. పలు కాలనీల్లో మహిళలు బతుకమ్మలు తీసుకొచ్చి ఆడిపాడారు. యువతులు, చిన్నారులు కోలాటాలతో సందడి చేశారు. చంద్రపురం కాలనీ, అల్వాల్‌హిల్స్, టెంపుల్‌అల్వాల్, హెచ్ఎంటీ కాలనీలో సామూహికంగా జరిగిన వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

★ మౌలాలి డివిజన్ సంతోషిమాతానగర్ కాలనీలోని లిటిల్ బర్డ్స్ పాఠశాలలో గురువారం బతుకమ్మతో పాటు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆడిపాడారు. అనంతరం దుర్గామాత నాటకం ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ..మన సంస్కృతి, సంప్రదాయాలపై పాఠశాల స్థాయి నుంచే అవగాహన కల్పించడానికి ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ★ నేరేడ్‌మెట్ దీన్‌దయాల్ నగర్‌లోని పాష పబ్లిక్ పాఠశాలలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు బతుకమ్మలను రూపొందించి ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ నిరీక్షణరావు విద్యార్థులను అభినందించారు.

పరిశ్రమల ప్రగతికి సంస్కరణలు

కాప్రా: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం కొత్త సంస్కరణలను తెచ్చిందని టీజీఐసీసీ ఛైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. గురువారం కాప్రా చిన్నతరహా పరిశ్రమల యజమానుల సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె విచ్చేశారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. పారిశ్రామికవాడలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

డీజే వినియోగించారని కేసు

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: పుట్టిన రోజు వేడుకలో డీజే ఉపయోగించి అర్ధ రాత్రి వేళ ఇతరులకు ఇబ్బంది కలిగించిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం. .నిజాంపేట్ ప్రగతినగర్‌కు చెందిన నలమాస అఖిల్‌కుమార్‌గౌడ్(25) ప్రైవేటు ఉపాధ్యాయుడు తన పుట్టిన రోజు వేడుకలను ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో బుధవారం రాత్రి స్నేహితులతో కలిసి మద్యం విందు ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా డీజేను ఉపయోగించారనే ఫిర్యాదుతో ఫామ్‌హౌస్ నిర్వాహకుడు అశోక్, డీజే ఆపరేటర్ పల్లెపాటి చరణ్‌లపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

శిల్పారామంలో అలరించిన కళా ప్రదర్శనలు


కళాకారుల నృత్య ప్రదర్శన

ఉప్పల్, న్యూస్‌టుడే: బతుకమ్మ-దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ఉప్పల్‌లోని శిల్పారామంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శ్రీ మానస కూచిపూడి డాన్స్ స్కూల్ గురువు కుమారి ప్రణవి తుమ్మాటి శిష్య బృందం చక్కటి నృత్యాలను ప్రదర్శించింది. మూషిక వాహన, ముద్దుగారే యశోద, వినాయక కౌతం, గణేశా పంచరత్న, గరుడ గమన, తదితర అంశాలపై కళాకారులు శ్రీవిద్య, శాన్వి, పవిత్ర, స్నేహ, దీప్తి, హిమజ, హర్షిత, రోహన్, శ్రీమయి పాల్గొన్నారు.

క్యారమ్స్ పోటీల విజేతలకు సన్మానం

అంబర్‌పేట: తెలంగాణ రాష్ట్ర క్యారమ్స్ పోటీల విజేతలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత పోటీల్లో వివిధ విభాగాలలో విజేతలుగా నిల్చినవారికి గురువారం బ్యాంకు విశ్రాంత ఉన్నతాధికారి మన్మోహన్ అభినందనలు తెలియజేశారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్యారమ్స్ అసోసియేషన్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి మదన్‌రాజ్, ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు టీవీ సుధాకర్, ఉపాధ్యక్షుడు ఉప్పు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్

• ముషీరాబాద్ • అంబర్‌పేట

సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాలి: ఎమ్మెల్యే



మహిళకు చెక్కు అందజేస్తున్న కాలేరు వెంకటేశ్

గోల్నాక, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అర్హులంతా లబ్ధిని పొందాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పిలుపునిచ్చారు. సంబంధిత పథకాలను ఇప్పటికే వేల మంది సద్వినియోగం చేసుకున్నారని గుర్తుచేశారు. గురువారం తులసీనగర్‌లోని క్యాంపు కార్యాలయం ఆవరణలో.. 20 మందికి రూ.6.22 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలు మెరుగైన వైద్య సేవలు పొందేలా.. ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందజేస్తోందని తెలిపారు. ఆరోగ్య పరిరక్షణకు ప్రజలంతా ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

ధ్వంసమైన మ్యాన్‌హోల్ మూత

నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంట సిండికేట్ బ్యాంకు చౌరస్తా సమీపంలో.. రోడ్డు మధ్యలోని మ్యాన్‌హోల్ మూత ధ్వంసమైంది. స్థానిక మూల మలుపు వద్దనే ఉండటంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడున్న ప్రమాదాన్ని హెచ్చరిస్తూ స్థానికులు ఓ కర్రకు సంచి తొడిగి అడ్డుగా పెట్టారు. ప్రమాదం జరగక ముందే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, నల్లకుంట



ప్రత్యేక పూజలు.. అన్నదానం



అన్నప్రసాద కార్యక్రమంలో వడ్డిస్తున్న దిడ్డి రాంబాబు

బర్కత్‌పుర, న్యూస్‌టుడే: బర్కత్‌పుర పరిధిలో గురువారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పలు ప్రాంతాల్లో దేవీ మండపాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బర్కత్‌పుర చమన్ వద్ద జై భవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మండపంలోని అమ్మవారిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిడ్డి రాంబాబు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు.

గోల్నాకలో కూరగాయల ధరలు

తిలక్‌నగర్: (గురువారం నాటివి... కిలోకు రూపాయల్లో) టమాట-80, ఆలుగడ్డ-45, వంకాయ-40, బెండ-55, దొండ-45, దోసకాయ-35, కాకర-60, బీర-70, సొర-25, క్యాబేజీ-40, క్యాప్సికం-50, బీన్స్-80, చిక్కుడు-70, క్యారెట్-50, ఉల్లిగడ్డ-50, పచ్చిమిర్చి-45, వెల్లుల్లి-320, అల్లం-80.

సమీపిస్తున్న పండగ.. ప్రత్యేక రైళ్లకు నిరీక్షణ

కాచిగూడ-తిరుపతి మధ్యే ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే

కాచిగూడ, న్యూస్‌టుడే: దసరా పర్వదినం సమీపిస్తోంది.. పండగను స్వస్థలాల్లో కుటుంబసభ్యుల మధ్య జరుపుకొనేందుకు.. నగరంలో స్థిరపడిన తెలంగాణ, ఏపీ రాష్ట్రాల ప్రజల్లో ఎక్కువమంది సొంతూళ్లకు తరలివెళుతుంటారు. వారిలో ఎక్కువ మంది రైళ్లలోనూ బయల్దేరి వెళతారు. అయితే, నగరంలోని ప్రముఖమైన కాచిగూడ స్టేషన్ నుంచి దసరాకు ప్రత్యేక రైళ్లను ఎప్పుడు నడుపుతారనే విషయమై స్పష్టత లేకపోవడంతో.. ప్రస్తుతం వారంతా నిరీక్షిస్తున్నారు. పండగ సెలవులలో నగరవాసులు ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలకు వెళ్లేందుకు కాచిగూడ-తిరుపతి మధ్య పలు ప్రత్యేక రైళ్లను దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. ఇదేతరహాలో తెలుగు రాష్ట్రాల్లోని ముఖ్య నగరాలు, పట్టణాలకు చేరుకునేందుకూ మరిన్ని రైళ్లను నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



నాలుగు నెలల ముందుగానే..

గతంలో మూడు నెలల ముందుగానే ఎక్స్‌ప్రెస్ రైళ్లలో టికెట్లను బుక్ చేసుకునే వారు. అనంతరం రైల్వే బోర్డు ఈ సదుపాయాన్ని 4 నెలలకు పెంచింది. దీంతో దసరా పండగకు కాచిగూడ నుంచి బయలుదేరి వెళ్లే అన్ని రైళ్లలో నాలుగు నెలల క్రితమే టికెట్లను రిజర్వ్ చేసుకున్నారు. ప్రస్తుతం అన్ని రైళ్లలోనూ నిరీక్షణ జాబితా(వెయిటింగ్ లిస్ట్)లు దర్శనమిస్తున్నాయి.

కాచిగూడ నుంచి రోజువారీ రైళ్లు: 100
ప్రయాణికులు: 40 వేలు
పండగల సమయాలలో..: 50–55 వేలు



కాచిగూడ-కాకినాడ రైలు (పాత చిత్రం)

కరోనా మహమ్మారికి ముందు కాచిగూడ-టాటానగర్ మధ్య నడిచిన రైలు.. తెలుగు రాష్ట్రాల్లోని నల్గొండ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమహేంద్రవరం, దువ్వాడ, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం సహా ఒడిశాలోని రాయగడ, సంబల్‌పూర్, రూర్కెలా స్టేషన్ల మీదుగా రాకపోకలు సాగించేది. కొవిడ్ సమయంలో దాన్ని రద్దు చేశారు. దసరా పండగ నేపథ్యంలో

టాటానగర్‌ను పునరుద్ధరించాలి

ఈ రైలును తిరిగి పునరుద్ధరించాలని ఆయా రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగించేవారంతా కోరుతున్నారు. కాచిగూడ, మల్కాజిగిరి, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం, సామర్లకోట, కాకినాడ టౌన్ మధ్య గతంలో నడిచిన కాచిగూడ-కాకినాడ ఎక్స్‌ప్రెస్‌నూ తిరిగి నడపాలని కూడా విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం కాచిగూడ-తిరుపతి మధ్య ప్రకటించిన ప్రత్యేక రైళ్లకు తోడు.. ఇతరప్రాంతాల మధ్య కూడా మరిన్నింటిని అందుబాటులోకి తెస్తేనే దసరా రద్దీని తట్టుకునే వీలుంటుందని రైల్వే ఉన్నతాధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ముషీరాబాద్	8008573400
రాంనగర్	8008573395
అంబర్‌పేట	8008573390
నల్లకుంట	8008573389

ముషీరాబాద్, న్యూసుటుడే:

? భోలక్‌పూర్ డివిజన్ పరిధిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం సమీపంలో ఉన్న జీహెచ్‌ఎంసీ వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. అంధకారంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. –వాణి, స్థానికురాలు

✓ పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయిస్తాం.

–అనుష, జీహెచ్‌ఎంసీ వీధి దీపాల నిర్వహణ ఏఈ

‘స్వచ్ఛతాహీ సేవా’ ముగింపు వేడుకలు



అనిత మహదాస్‌ను సన్మానిస్తున్న రవీందర్‌రావు

కాచిగూడ, న్యూస్‌టుడే: ‘స్వచ్ఛతాహీ సేవా’ ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. టెలీకమ్యూనికేషన్స్ తెలంగాణ సర్కిల్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి కంట్రోలర్ అనిత మహదాస్, జాయింట్ కంట్రోలర్ సీఎం సంపర్, ఉప కంట్రోలర్ ప్రతిభ ఖండేలా, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ ఆకుల రవీందర్‌రావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ‘డిజిటల్ సెక్యూరిటీ, సేఫ్టీ’ తదితర అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికులనూ ఘనంగా సన్మానించారు. ప్రమోద్‌కుమార్, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

గాంధీనగర్, బర్కత్‌పుర, బాగ్‌లింగంపల్లి, నల్లకుంట, న్యూస్‌టుడే: అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో రెండో రోజైన గురువారం కూడా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తొలుత కాలనీలు, బస్తీలతోపాటు పాఠశాలలు, విద్యాసంస్థల్లో బతుకమ్మలను తీరొక్క పూలతో ఆకట్టుకునేలా పేర్చారు. అనంతరం వాటి చుట్టూ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు సహా మహిళలంతా ఆడిపాడారు. ★ భాజపా డివిజన్ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం రాత్రి బతుకమ్మ వేడుకలు జరిగాయి. కార్పొరేటర్ పావని ముఖ్యఅతిథిగా పాల్గొని బతుకమ్మ పాటలు ఆలపిస్తూ ఉత్సాహంగా ఆడారు.



గాంధీనగర్‌లో కార్పొరేటర్ పావని తదితరులు



బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ విద్యాసంస్థల ప్రాంగణంలో..



న్యూనల్లకుంట సెయింట్ మేరీ పాఠశాలలో చిన్నారులు



బర్కత్‌పుర శ్యామలాదేవి జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థినులు

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు



జైస్వాల్‌గార్డెన్‌లో బాలాత్రిపురసుందరిగా మైసమ్మ



బంగారు జడతో అంబర్‌పేట మహంకాళి



చిక్కడపల్లిలో బాలాత్రిపుర సుందరిగా అమ్మవారు



శంకరమఠంలో బ్రాహ్మీ రూపంలో శారదాంబ



వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి దేవాలయంలో...

ముషీరాబాద్, బాగ్‌లింగంపల్లి, గాంధీనగర్, గోల్నాక, నల్లకుంట, విద్యానగర్, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజున భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలోని చారిత్రక భవానీశంకరాలయం, ముషీరాబాద్‌లోని మహంకాళి ఆలయాలతోపాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మాతా మండపాల్లోని అమ్మవారి విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ నెల 12 వరకు నిత్యం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు భవానీశంకరాలయంలో పూజా కార్యక్రమాలు కొనసాగుతాయని ఈవో బి.జ్యోతి తెలిపారు. 10న చండీహోమం, 12న సాయంత్రం 6గంటలకు జమ్మిపూజ ఉంటుందన్నారు. ★ ముషీరాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయంలోని అమ్మవారి విగ్రహాన్ని బాలాత్రిపురాసుందరీదేవి అలంకరణలో ముస్తాబు చేశారు. భక్తులంతా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టినట్లు ఈవో మహేందర్ కుమార్ తెలిపారు. ★ నల్లకుంట శంకరమఠంలోని శారదాంబ అమ్మవారు బ్రాహ్మీ అలంకారంలో కనిపించారు. సాయంత్రం ప్రముఖ విద్వాంసులు బ్రహ్మశ్రీ శ్రీపాద సుబ్రమణ్యం ‘దేవీ భాగవతం’పై ప్రవచనాలు చెప్పారు. సంగీత విద్వాంసుడు వేణుగోపాల్ బృందం నిర్వహించిన నాదస్వరం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. ★ అంబర్‌పేట మహంకాళి అమ్మవారికి మాజీ కార్పొరేటర్ నారాయణస్వామి, లీలాదేవి దంపతులు బంగారు జడను అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి సలహాదారులు కె.దుర్గాప్రసాద్ రెడ్డి, ప్రతినిధులు లక్ష్మణ్‌గౌడ్‌కు నారాయణస్వామిలకు అందచేశారు. మహంకాళి అమ్మవారితోపాటు బతుకమ్మకుంటలోని మైసమ్మతల్లి కూడా బాలాత్రిపురసుందరిదేవీగా దర్శనమిచ్చారు.



భోలక్‌పూర్‌లోని భవాని శంకరాలయంలో భక్తులు



చండీహోమంలో నర్సింగ్‌రావుయాదవ్ దంపతులు

హైడ్రా పేరుతో పేదలను రోడ్డుకీడ్చొద్దు: సీపీఐ(ఎంఎల్)



సమావేశంలో మంద నవీన్, కె.గోవర్ధన్, సాదినేని వెంకటేశ్వర్‌రావు, వి.సంధ్య, జి.అనూరాధ

నల్లకుంట, న్యూస్‌టుడే: హైడ్రా పేరుతో పేద, మధ్యతరగతి ప్రజలను రోడ్డుకీడ్చే చర్యలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిలిపేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి సాదినేని వెంకటేశ్వర్‌రావు కోరారు. దశాబ్దాలుగా స్థానికంగా నివాసముంటున్న వారి ఇళ్లను బలవంతంగా నేలమట్టం చేస్తుండటం ద్వారా వారికి నివాసాలతోపాటు జీవనోపాధి కూడా లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం హైదరాబాద్ విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో జరిగిన పార్టీ రాష్ట్ర ముఖ్య నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పాలకులు అనుసరించిన విధానాలతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని వందలాది చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురయ్యాయని ఆరోపించారు. రాజధాని నగరం బ్రాండ్ ఇమేజ్‌ని పరిరక్షించే పేరుతో విదేశీ పెట్టుబడిదారులను ఆకర్శించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా మూసీ సుందరీకరణకు రూ.లక్షల కోట్లతో భారీ పథకాన్ని ముందుకు తెచ్చిందన్నారు. జలవనరుల పరిధిలోని కబ్జాదారుల నిర్మాణాలను కూల్చడాన్ని ఆహ్వానిస్తున్నామని.. మూసీ సుందరీకరణ పేరిట పేదలను రోడ్డుకీడ్చడం మాత్రం తగదన్నారు. మరోవైపు, రుణమాఫీ పూర్తిగా అమలు చేయాలని, వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో దామగుండం రాడార్ కేంద్రం ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని కూడా డిమాండ్ చేశారు. సమావేశంలో కె.గోవర్ధన్, వి.సంధ్య, జి.అనూరాధ, మంద నవీన్ తదితరులు పాల్గొన్నారు.

‘మోదీ పాలనలో కార్మికులకు ఇబ్బందులు’

రాంనగర్, న్యూస్‌టుడే: శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాటాలు చేపట్టాలని కార్మికవర్గానికి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ పిలుపునిచ్చారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్(డబ్ల్యూఎఫ్‌టీయూ) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని భాజపా సర్కార్ పదేళ్ల పాలనలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త కార్మిక చట్టాలను తీసుకొచ్చి వారి హక్కులను కాలరాసిందని ఆరోపించారు. నాయకులు రమ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మిక సంఘం నేతలు

‘కష్టపడే నేతలకు కాంగ్రెస్‌లో గుర్తింపు’



గజమాలతో మహేశ్‌గౌడ్. చిత్రంలో అనిల్‌కుమార్ యాదవ్, అంజన్‌కుమార్ యాదవ్, అరవింద్‌కుమార్ యాదవ్

రాంనగర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ అన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయన్ను గురువారం టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముషీరాబాద్ కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. ఈ సందర్భంగా మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం అహర్నిశలు కష్టపడిన వ్యక్తి అంజన్‌కుమార్ యాదవ్ అని కొనియాడారు. హస్తం పార్టీపై నమ్మకంతో ప్రజలు అధికారం కట్టబెట్టారని.. నిరంతరం వారితో మమేకమై పనిచేయాలని శ్రేణులకు సూచించారు. అనంతరం టీపీసీసీ అధ్యక్షుడిని నేతలు భారీ గజమాలతో సత్కరించారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లఖింపూర్ రైతుల మృతికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన



బాగ్‌లింగంపల్లి: ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని లఖింపూర్ రైతులను.. మూడేళ్ల క్రితం వాహనంతో ఢీకొట్టి చంపిన ఘటనకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం రాత్రి సుందరయ్య పార్కు వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ మాట్లాడుతూ.. అప్పటి కేంద్ర మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా తనయుడు ఆశీష్‌కుమార్ మిశ్రా నిర్వాకంతోనే సంబంధిత ఘటన జరిగిందని ఆరోపించారు. పంట ఉత్పత్తులకు మద్దతు ధరలు కల్పించడం.. తదితర రైతుల డిమాండ్లను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. నేతలు శోభన్‌నాయక్, జంగారెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టండి

అంబర్‌పేట, న్యూస్‌టుడే: రహదారి నిర్మాణంలోభాగంగా పగిలిన తాగునీటి పైపులైన్‌కు సత్వరం మరమ్మతులు చేపట్టాలని అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ కోరారు. బాపూనగర్‌లో నిర్మిస్తున్న రోడ్డు పనులను గురువారం పరిశీలించాక ఆయన మాట్లాడారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జలమండలి ఏఈ మాజిద్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు దుర్గ, రమేష్, దానయ్య, వెంకటేష్, యాదగిరి, సాయి, మహేశ్, ముజ్జు, వెంకటేష్ పాల్గొన్నారు.

పాడైన చేతిపంపుల పరిశీలన

కాచిగూడ,న్యూస్‌టుడే: పాడైన చేతిపంపులకు సత్వరం మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారాణి కోరారు. గురువారం చప్పల్‌బజార్ చౌరస్తాలోని సంబంధిత చేతి పంపులను జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ భావనలతో కలిసి ఆమె పరిశీలించి ఆమె మాట్లాడారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌యాదవ్, ఆజమ్, ఓంప్రకాష్, రవియాదవ్, సూరి తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపులో జాప్యం తగదు

గాంధీనగర్: పరిసరాల శుభ్రతే ధ్యేయంగా జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావని కోరారు. జనావాసాల్లో, రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. గురువారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో ఆమె పర్యటించి మాట్లాడారు. చెత్త సేకరణలో జాప్యం లేకుండా వాహనాలను అందుబాటులో ఉంచాలని రాంకీ సంస్థ అధికారులకు సూచించారు. భాజపా సికింద్రాబాద్ పార్లమెంటు సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఏ రాజ్‌కుమార్, సోమేష్, ఆనంద్, జవాన్ విజయ్ పాల్గొన్నారు.

రోడ్ల ఆధునికీకరణకు కృషి

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ అభివృద్ధితోపాటు అధ్వానంగా మారిన రోడ్ల ఆధునికీకరణకు కృషి చేస్తున్నామని ఎంఐఎం డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ షరీఫుస్సేన్ అన్నారు. గంగపుత్ర సంఘం వీధిలో రూ.35 లక్షలతో నిర్మించిన వీడీసీసీ రోడ్డును గురువారం తమ పార్టీ నేతలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్థానికుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ కార్పొరేటర్ గౌసుద్దీన్ సహా సంబంధితశాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. నాయకులు ఖాజీ అజీజుల్లా ఉస్మాని తదితరులు పాల్గొన్నారు.

అవీ.. ఇవీ.. అన్నీ

‘కేటీఆర్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి’

కాచిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని తెలంగాణ మున్నూరు కాపు ఐక్య పోరాట సమితి డిమాండ్ చేసింది. గురువారం కాచిగూడలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు వినోద్‌కుమార్, కట్టెల సుభాష్‌లు మాట్లాడుతూ... బీసీ వర్గానికి చెందిన మహిళా మంత్రిపై కేటీఆర్ వాఖ్యలను ఖండించారు.

జూనియర్ లెక్చరర్ల ఫలితాలు విడుదల చేయాలి

బాగ్‌లింగంపల్లి: జూనియర్ లెక్చరర్స్ ఫలితాలను సత్వరమే విడుదల చేసి.. ఎంపికైన వారికి నియామక పత్రాలను ఇప్పించాలని పలువురు అభ్యర్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం సుందరయ్య కళానిలయం ప్రాంగణంలో.. ఫలితాలను విడుదల చేయాలని వారంతా ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం అభ్యర్థులు వేణురావు, లింగనాయక్, కిరణ్, సతీష్, పద్మ, రేఖ, సాజిద, ప్రణవ్‌లు మాట్లాడారు. 2023లో అప్పటి భారాస సర్కార్ జూనియర్ లెక్చరర్స్ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టిందని గుర్తుచేశారు.

దంచికొట్టిన వాన



గురువారం మధ్యాహ్నం సుమారు అరగంటసేపు ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వర్షం దంచికొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. రాకపోకల వేళ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బ్యాంకు మేనేజర్ ల్యాప్‌టాప్‌ల చోరీ

కాచిగూడ: ప్రైవేటు బ్యాంకు మేనేజర్‌కి చెందిన రెండు ల్యాప్‌టాప్‌లు చోరీకి గురయ్యాయి. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప, హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. ఏపీలోని అనంతపురం జిల్లా వేములపల్లి గ్రామానికి చెందిన షకీల్ అహ్మద్ యాక్సిస్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం బెంగళూరు నుంచి యెలహంక ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి గురువారం ఉదయం కాచిగూడకు చేరుకున్నాడు. నిద్రలేచి చూసుకునే సరికి.. రెండు ల్యాప్‌టాప్‌లను ఉంచిన బ్యాగు కనిపించలేదు.

క్యారమ్స్ పోటీల విజేతలకు సన్మానం



విజేతలతో మన్మోహన్, మదన్‌రాజ్, టీవీ సుధాకర్ తదితరులు

అంబర్‌పేట: తెలంగాణ రాష్ట్ర క్యారమ్స్ పోటీల విజేతలకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత పోటీల్లో వివిధ విభాగాలలో విజేతలుగా నిల్చినవారికి గురువారం బ్యాంకు విశ్రాంత ఉన్నతాధికారి మన్మోహన్ అభినందనలు తెలియజేశారు. జాతీయ, అంతర్జాతీయస్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్యారమ్స్ అసోసియేషన్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి మదన్‌రాజ్, ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు టీవీ సుధాకర్, ఉపాధ్యక్షుడు ఉప్పు సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సేవలు



స్వామిగౌడ్‌ను సత్కరిస్తూ..

గోల్నాక: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సేవలను అందించాలని గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య కోరారు. గురువారం జైస్వాల్‌గార్డెన్ కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, ఆర్టీసీ కంట్రోలర్ స్వామిగౌడ్‌ను కాలనీ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్‌తో కలిసి సన్మానించిన అనంతరం ఆమె మాట్లాడారు. నేతలు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉప్పల్

•ఉప్పల్ •మేడ్చల్

మూహూర్తం కుదిరేదెప్పుడో..!



బుద్ధానగర్ రోడ్డునెంబరు-5లో వేసిన కంకర

బోడుప్పల్ ,న్యూస్‌టుడే: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ బుద్ధానగర్ రోడ్డునంబరు-5లో రోడ్డు నిర్మాణానికి కంకరవేసి మూడు నెలలు గడుస్తున్నా.. నిర్మాణానికి ఇంకా మూహూర్తం ఖరారు కాలేదు. ప్రజాప్రతినిధులు వచ్చే దాకా ప్రజలు ఇబ్బంది పడాల్సిందేనా అంటూ స్థానికులు పేర్కొంటున్నారు.

అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వరూ

బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని నగర మేయర్ అజయ్‌యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. శాసన మండలి విప్ మహేందర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు టి.వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడిలతో వెళ్లి సీఎం నివాసంలో కలిశారు. బోడుప్పల్‌లోని 10వేల మంది ఎదుర్కొంటున్న వక్ఫ్ భూ సమస్యను పరిష్కరించాల్సిందిగా నివేదిక ఇచ్చారు.

అయ్యో.. ఇది రోడ్డేనా..!

నగరంలో ఉండు కాలనీ రోడ్లంటే సిమెంట్‌తో చేసినవే అనుకుంటాం..కానీ జవహర్‌నగర్ చంద్రపురికాలనీలో పలుచోట్ల అంతర్గత రహదారులు మోకాళ్ల లోతు గుంతలు పడ్డాయి. పూర్తిగా ధ్వంసమై నడవలేని స్థితిలో ఉన్నాయి. వర్షాలకు మరింతగా పాడయ్యాయి. తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేదు. ప్రజలు ఎలా నడచివెళ్తారోనని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలోచన చేయకపోవడం విడ్డూరంగా ఉంది.



బాలాజీనగర్ చంద్రపురికాలనీలోని అంతర్గత రహదారి

జవహర్‌నగర్, న్యూస్‌టుడే

రాకపోకలకు తప్పని తిప్పలు



బ్రిడ్జి కింద వరదలో రాకపోకలు

మేడ్చల్ రూరల్, న్యూస్‌టుడే: గౌడవెల్లి రైల్వే గేటు వద్ద ఆర్యూబీ పనులతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిపేశారు. దుండిగల్, గండిమైసమ్మ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు సమీపంలోని చిన్న బ్రిడ్జి కింద నుంచే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇక్కడ ఒకరు వస్తేనే మరొకరు వెళ్లడానికి వీలుంటుంది.

నిర్మించారు.. వదిలివేశారు



ఘట్‌కేసర్ మండలం ప్రతాప్‌సింగారం గ్రామంలో గత ప్రభుత్వం పేదలకు రెండు పడక గదుల ఇళ్లను నిర్మించింది. లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. వాటిని కొందరు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. ఈ ప్రభుత్వం కూడా ఇప్పటి వరకు వాటివైపు కన్నెత్తి చూడటం లేదు.

–న్యూస్‌టుడే,ఘట్‌కేసర్

చెత్తశుద్ధి మాటల్లోనే..!

- దుండిగల్ యార్డు నిర్మించినా మార్పు అంతంతే
- కోట్లు ఖర్చు చేసినా కలుషితం తగ్గలె
- మరో నాలుగింటిని సిద్ధం చేస్తేనే మేలు

న్యూస్‌టుడే, జవహర్‌నగర్

జవహర్‌నగర్‌కు చెత్త పీడ విరగడం లేదు. ఎన్ని కోట్లు ఖర్చు చేసినా కాలుష్యంతో చెరువులు, పరిసరాలు, గ్రామాలు నిండిపోతున్నాయి. ప్రజలు అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

డంపింగ్ యార్డుపై ఒత్తిడిని తగ్గించి కాలుష్య తీవ్రతను అదుపులోకి తీసుకొచ్చేందుకు చేసిన ప్రయత్నాలు ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి పడుతున్నాయి.. ఆరునెలల క్రితం దుండిగల్‌లో డంపింగ్ యార్డు అందుబాటులోకి వచ్చినా... మళ్లీ చెత్తంతా జవహర్‌నగర్‌కే తరలిస్తున్నారు యథావిధిగా టన్నుల కొద్దీ చెత్తకుప్పలు పోగవడంతో కాలుష్యం తీవ్రస్థాయిలో పెరుగుతోంది.



కలుషిత రసాయనాలతో నిండిన చెరువు

ఇలాగేనా ప్రత్యామ్నాయం

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై భారం తగ్గించేందుకు దుండిగల్ ప్యారానగర్‌లో రోజుకి 1000 టన్నుల చెత్తను సేకరించే సామర్థ్యంతో నిర్మించారు. చెత్తను జవహర్‌నగర్‌కు తరలించి ఇక్కడ వ్యర్థాలను ఆరబోసి తిరిగి దుండిగల్‌కు తరలిస్తున్నారు.

● కూకట్‌పల్లి, బాలానగర్, కేపీహెచ్‌బీ, మియాపూర్ ప్రాంతాల చెత్తను జవహర్‌నగర్‌కు తరలించకుండా దుండిగల్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలి.

ఇవి పూర్తయితేనే విరుగుడు

ప్రభుత్వ ముందుచూపు కొరవడడంతో జవహర్‌నగర్ కాలుష్యంతో నిండిపోయింది. దశాబ్దాలుగా సమస్య పెరుగుతున్నా మీనమేషాలు లెక్కించారు. ప్రజల ఆందోళన పెరగడంతో ఇప్పుడు తీరిగ్గా ప్రత్యామ్నాయం వెదుకుతున్నారు. ఇటీవల జీహెచ్‌ఎంసీ ఐదు ప్రాంతాల్లో డంపింగ్ యార్డుల నిర్మాణానికి సిద్ధమయ్యింది.

● మిగిలిన నాలుగు ప్రాంతాల్లో ఇంకా స్థలం గుర్తించాల్సి ఉంది. వీటిని సాధ్యమయినంత తొందరగా అందుబాటులోకి తెస్తే కాలుష్యం నుంచి జవహర్‌నగర్ ప్రాంతాన్ని రక్షించడానికి వీలవుతుంది.



జవహర్‌నగర్ డంపింగ్‌యార్డులో లక్షల టన్నుల్లో గుట్టలుగా పేరుకుపోయిన చెత్తకుప్పలు

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఇలా

▶ కేటాయించిన స్థలం.	338 ఎకరాలు
▶ ప్రారంభించింది	2009
▶ నగరంతో పాటు శివారు నుంచి వస్తున్న చెత్త రోజుకి	9000 టన్నులు
▶ డంపింగ్ యార్డుకు వస్తున్న వాహనాలు రోజుకి..	100కు పైగా
▶ విద్యుత్తు ప్లాంటు నిర్మాణం	2020
▶ ప్లాంటు సామర్థ్యం	19.8 మెగావాట్లు

▶ 1200 నుంచి 1300 టన్నుల చెత్తను మండించి విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

దుండిగల్ నూతన డంపింగ్ యార్డు

◆ కేటాయించిన స్థలం	152 ఎకరాలు
◆ ప్రారంభించింది	2024
◆ డంపింగ్ యార్డు సామర్థ్యం	700-1000 టన్నులు
◆ విద్యుత్తు ప్లాంటు	15 మెగావాట్లు

విముక్తి కల్పించండి



తీవ్రమైన దుర్గంధంతో తట్టుకోలేని పరిస్థితి తలెత్తుతోంది. వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు. డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలిస్తేనే మా ప్రాణాలు దక్కుతాయి.

– కుమారస్వామి, రాజీవ్‌గాంధీనగర్

పరిసర గ్రామాలు ఉక్కిరిబిక్కిరి



డంపింగ్ యార్డు నిర్వహణలో లోపాలున్నాయి. సుమారు రూ.250 కోట్లతో శుద్ధి చేసిన చెరువు, పరిసర కుంటలను డంపింగ్ రసాయనాలతో కలుషితం చేశారు. లక్షల టన్నుల్లో చెత్తను నిల్వ ఉంచడంతో కాలుష్యం ఎక్కువైంది. చర్మ సంబంధిత వ్యాధులు వస్తున్నాయి.

– లక్ష్మారెడ్డి, అద్రాస్‌పల్లి

ఒత్తిడి తగ్గించేలా చర్యలు

జవహర్‌నగర్ డంపింగ్ యార్డుపై ఒత్తిడి తగ్గించడానికి దుండిగల్‌లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ (15 మెగావాట్ల) విద్యుత్తు ఉత్పాదనకు సిద్ధం చేశాం. ఎయిర్‌ఫోర్స్ అథారటీ అనుమతుల్లో ఆలస్యం కారణంగా వ్యర్థాలను వేరు చేసే ప్రక్రియ ఇక్కడ చేపట్టడం లేదు. ప్యారానగర్‌లో 152 ఎకరాల స్థలాన్ని గుర్తించి ప్రభుత్వ పరంగా అన్ని అనుమతుల ప్రక్రియను పూర్తి చేశాం. స్థానికులతో చర్చలు జరుగుతున్నాయి.

- కోటేశ్వరరావు, ఎస్‌డబ్ల్యూఎం చీఫ్ ఇంజినీర్, జీహెచ్‌ఎంసీ

పరిశ్రమల ప్రగతికి సంస్కరణలు



హాజరైన నిర్మలా జగ్గారెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఇతరులు

కాప్రా, న్యూస్‌టుడే: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం కొత్త సంస్కరణలను తెచ్చిందని టీజీఐసీసీ ఛైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి పేర్కొన్నారు. గురువారం కాప్రా చిన్నతరహా పరిశ్రమల యజమానుల సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమె వచ్చారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో కలిసి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ.. పారిశ్రామికవాడలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి, టిఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి, ఐలా కమిషనర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

నిఘా నేత్రాలు పనిచేసేలా చూసుకోవాలి

నాగారం, న్యూస్‌టుడే: నిఘానేత్రాలు నిరంతరం పనిచేసే విధంగా వాటి నిర్వాహణ చూసుకోవాలని కీసర సీఐ వెంకటయ్య పేర్కొన్నారు. గురువారం పుర కార్యాలయంలో ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కమిషనర్ నాగమణితో సమావేశమయ్యారు. పట్టణంలో 135 నిఘా నేత్రాలు ఉన్నాయని. అవి పనిచేసేలా దృష్టి పెట్టాలని కోరారు.

వ్యాపారాలకు అడ్డా



కీసర, న్యూస్‌టుడే: కీసర ప్రధాన చౌరస్తాలోని బస్ షెల్టర్ ఆటోలు, పూలబండికి అడ్డాగా మారింది. బస్సుల కోసం నిరీక్షించే ప్రయాణికులు నిలపడేందుకు చోటు లేకుండా పోతోంది. మున్సిపల్ అధికారులు, పోలీసులు ఎవరూ పట్టించుకోవడం లేదు.

కీసరగుట్టలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



కీసర, న్యూస్‌టుడే: శైవ క్షేత్రం కీసరగుట్టలో గురువారం దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రధాన ఆలయంలో శ్రీరామలింగేశ్వరస్వామికి ఇరువైపులా' కొలువుదీరిన శ్రీభవానీ, శివదుర్గా అమ్మవార్లకు వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య లలిత సహస్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం బాలాత్రిపురసుందరీదేవి ఆధీనంలో ఉంటాయని వేద పండితుడు మార్తి సత్యనారాయణశర్మ తెలిపారు. ఇందులో ఆలయ ఛైర్మన్ టి.నాగలింగంశర్మ, కార్యనిర్వహణాధికారి కె.సుధాకర్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు బలరామశర్మ, ఉప ప్రధాన అర్చకులు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

● చీర్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో గురువారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పూజల్లో ఆలయ ఛైర్మన్ ఎం.లక్ష్మీనారాయణగౌడ్, ధర్మకర్త శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.

బోడుప్పల్: బోడుప్పల్‌లోని మాతా నిమిషాంబికాదేవి అమ్మవారికి బంగారు చీరెతో అలంకరణ చేశారు. అమ్మవారు స్వర్ణ కవచాలంకృత సర్వమంగళ'గా దర్శనమిచ్చారు.



4.5 టన్నుల బియ్యం పట్టివేత

ఉప్పల్, న్యూస్‌టుడే:పేదలకు చేరాల్సిన సబ్సిడీ బియ్యం పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. గుట్టు చప్పుడు కాకుండా సబ్సిడీ బియ్యాన్ని ఓ ముఠా గుజరాత్‌కు తరలిస్తుండగా ఉప్పల్ పోలీసులు పట్టుకున్నారు. ఎండీ ఖలీం, బషీర్, అఫ్జల్, జకారియా, కొడియాకర్ భరత్, యోగేష్, రంజిత్ ముఖియా, బబ్లు ముఖియా, మతర్ ముఖియా వీరంతా ముఠాగా ఏర్పడ్డారు. కొంతకాలంగా రామంతాపూర్ ప్రాంతంలో వివిధ రూపాలలో 100 బస్తాల సబ్సిడీ బియ్యం సేకరించారు. గురువారం లారీలో గుజరాత్ తరలించేందుకు యత్నించారు. 4.5 టన్నుల బియ్యం, మరో నాలుగు ట్రాలీ ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.

10 పరిశ్రమల్లో తనిఖీలకు పీసీబీ సిద్ధం

ఈనాడు, హైదరాబాద్: అక్టోబర్ నెలలో కాలుష్య నియంత్రణ మండలి గ్రేటర్ పరిధిలోని పది పరిశ్రమల్లో తనిఖీలు చేయనుంది. తనిఖీలు చేసి 24గంటల్లో నివేదిక సమర్పించనున్నారు.

పరిశ్రమలివే..

అమృత్ ఐరన్ (క్రాఫ్ట్స్) - మేడ్చల్, అవ్రా లేబొరేటరీస్- నాచారం, కోణార్ ఆర్గానిక్స్ లిమిటెడ్ - మల్లాపూర్, మేడ్చల్ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ - మేడ్చల్, రసుల ఫార్మా అండ్ ఫైన్ కెమికల్స్ - ఐడీఏ కూకట్‌పల్లి, సుందర్ ఇస్పాత్ స్పాంజ్ ఐరన్ లిమిటెడ్ - ఇప్పలపల్లి.

న్యూస్‌టుడే: నాచారం, కాప్రా,మేడ్చల్, నాగారం, జవహర్‌నగర్

? మల్లాపూర్ ఏస్వీనగర్‌లోని కమాన్ వద్ద డ్రైనేజీ పైపులైను పనులు పూర్తి చేయకుండా అలానే వదిలివేశారు. –వీరాస్వామి, మల్లాపూర్

✓ గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకుంటాం. –స్రవంతి–ఏఈ, మల్లాపూర్.

? గుండ్లపోచంపల్లి నుంచి మైసమ్మగూడ వెళ్లే దారి అప్పారెల్ పార్కు సమీపంలో రోడ్డు గుంతలు పడింది. ప్రమాదాలు జరుగుతున్నాయి – నర్సింహ్మ మైసమ్మగూడ.

✓ గుంతలను పూడ్చివేస్తాం.. – స్వామినాయక్, కమిషనర్ గుండ్లపోచంపల్లి.

? దమ్మాయిగూడపుర బండ్లగూడ నుంచి కుందన్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారిపై వర్షాలకు ఇసుక పేరుకు పోవడంతో పాటు కంకర దారిపై పడటంతో వాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాం.– రమేష్, కుందన్‌పల్లి , దమ్మాయిగూడ

✓ సిబ్బందిని పంపి రోడ్డు పక్కలకు చేరిన ఇసుకను తొలగిస్తాం. –ప్రభు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, దమ్మాయిగూడ

? కుషాయిగూడలోని రేడియల్ రోడ్డులో దీపాలు వెలగడం లేదు. – చక్రపాణిగౌడ్, కుషాయిగూడ

✓ పరిశీలించి.. దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. – రవీంద్ర, డీఈ, జీహెచ్‌ఎంసీ

? చక్రీపురం కాలనీలో బతుకమ్మలను వేసేందుకు తాత్కాలిక కొలనులను ఏర్పాటు చేయాలి. – లక్ష్మణ్‌గౌడ్, చక్రీపురం

✓ వివిధ ప్రాంతాల్లో పది కొలనులు ఏర్పాటు చేస్తున్నాం, చక్రీపురంలో పరిశీలిస్తాం. – నాగేందర్, ఈఈ, జీహెచ్‌ఎంసీ

? జవహర్‌నగర్ శ్రీరాంనగర్‌కాలనీ విఘ్నేశ్వర ఆలయం వద్ద విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

– నరేందర్‌యాదవ్, జవహర్‌నగర్

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

–ఎర్రన్న, ఏఈ బాలాజీనగర్

అమ్మకు అలంకారం.. బతుకమ్మ సంబరం



గోఖలేనగర్ ఊరపోచమ్మ ఆలయంలో



రామంతాపూర్ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో..



రామంతాపూర్‌లోని మహాకాళి ఆలయంలో..



హబ్సిగూడలో కుంకుమార్చన



కమలానగర్‌లో..



నాచారం మహంకాళి



గడీ మైసమ్మతల్లి దేవాలయంలో..



హబ్సిగూడ కోదండరామాలయంలో..



మల్లాపూర్‌లో..



భవానీనగర్‌లో..



పోచారం సంస్కృతిటౌన్‌షిప్‌లో..

శిల్పారామంలో అలరించిన కళా ప్రదర్శనలు



ఉప్పల్, న్యూస్‌టుడే: బతుకమ్మ-దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ఉప్పల్‌లోని శిల్పారామంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శ్రీ మానస కూచిపూడి డాన్స్ స్కూల్ గురువు కుమారి ప్రణవి తుమ్మాటి శిష్య బృందం చక్కటి నృత్యాలను ప్రదర్శించింది. మూషిక వాహన, ముద్దుగారే యశోద, వినాయక కౌతం, గణేశా పంచరత్న, గరుడ గమన, తదితర అంశాలపై కళాకారులు శ్రీవిద్య, శాన్వి, పవిత్ర, స్నేహ, దీప్తి, హిమజ, హర్షిత, రోహన్, శ్రీమయి పాల్గొన్నారు.

కోరుకున్న చోటుకే ఆర్టీసీ బస్సు

మేడ్చల్, న్యూస్‌టుడే: దసరా పండుగ సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లే వారికి మేడ్చల్ ఆర్టీసీ డిపో నుంచి కోరుకున్న చోటుకే బస్సులు పంపే ఏర్పాట్లు చేసినట్లు డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. 30 మంది ఉండి, ఒక రోజు ముందుగా బుక్ చేసుకుంటే బస్సు పంపిస్తామని తెలిపారు.

స్వచ్ఛ కాప్రా లక్ష్యం

కాప్రా, న్యూస్‌టుడే: స్వచ్ఛ కాప్రా నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ ప్రాంతీయ సంచాలకురాలు అనురాధ పిలుపునిచ్చారు. గురువారం కాప్రాలో నిర్వహించిన సఫాయి మిత్ర సురక్ష శివిర్ కార్యక్రమానికి ఆమె వచ్చారు. ప్రధాన రహదారులపై కార్మికులతో అవగాహన ప్రదర్శన నిర్వహించారు.

ప్రమాదాలకు ఎదురెళ్లి.. ప్రాణాలపైకి తెచ్చుకొని



ఉప్పల్‌లోని డంపింగ్ యార్డు, మెట్రోస్టేషన్, శిల్పారామం వద్ద ట్రాఫిక్ నియంత్రణ అస్తవ్యస్తంగా తయారయ్యింది. వాహనదారులు అపసవ్యదిశలో వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పోలీసులు వస్తే తప్పా వాహనదారులు పద్ధతిగా వెళ్లడం లేదు.

కాప్రా, న్యూస్‌టుడే

కుటుంబానికి ఒక్కటే..!

- డిజిటల్ కార్డు సర్వే నేటి నుంచి
- మల్లాపూర్ డివిజన్‌లో భవానీనగర్ ఎంపిక

న్యూస్‌టుడే, ఉప్పల్, కాప్రా,శామీర్‌పేట

ప్రజలకు సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ డిజిటల్ కార్డు పద్ధతిని తీసుకొచ్చింది. సరికొత్తగా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డు సర్వే శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. వన్ నేషన్. . వన్ కార్డు విధానాన్ని రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అన్ని రకాల సంక్షేమ పథకాలకు ఈ కార్డుతోనే అందించేలా అవకాశం కల్పించనున్నారు. ఈ కార్డులో కుటుంబ సభ్యులందరీ హెల్త్ ప్రొఫైల్ కూడా పొందుపర్చనున్నారు.



- మున్సిపాలిటీ: తూంకుంట.
- వార్డు పేరు: 4వ వార్డు.
- ఇళ్లు:164
- కుటుంబాల సంఖ్య:328
- మొత్తం జనాభా:1,852.

ఉప్పల్ నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టు కింద కాప్రా సర్కిల్, మల్లాపూర్ డివిజన్‌లోని భవానినగర్‌ను ఎంపిక చేశారు.

కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు..

● కుటుంబ డిజిటల్ కార్డులో మహిళనే కుటుంబ పెద్దగా గుర్తించనున్నారు. ప్రతి కుటుంబంలోని సభ్యులందరి వివరాలను నమోదు చేయనున్నారు. దీంతో పాటు వారి యొక్క హెల్త్ ప్రొఫైల్‌ను కూడా నమోదు చేస్తారు. ● ప్రస్తుతం ఉన్న జాబితాలో కుటుంబాల సంఖ్య పెరిగితే అదనంగా నమోదు చేయనున్నారు. ●కుటుంబంలో కొత్త సభ్యుల వివరాల నమోదుతో పాటు ఎవరైన మృతి చెంది ఉంటే తొలగించనున్నారు. ● గతం కంటే కొత్త కుటుంబాలు ఉన్నా వారి యొక్క పూర్తి వివరాలను నమోదు చేస్తారు. ● ఇల్లు సొంతమా, అద్దెనా వంటి పూర్తి వివరాలను కూడా సేకరించనున్నారు.

ఒక కార్డులోనే 30 శాఖల సమాచారం..

కుటుంబ డిజిటల్ కార్డులో ప్రభుత్వానికి సంబంధించిన 30 శాఖల సమాచారం ఉంటుంది.

- ❖ నియోజకవర్గం:ఉప్పల్
- ❖ సర్కిల్:కాప్రా
- ❖ డివిజన్:మల్లాపూర్
- ❖ కాలనీ:భవానీనగర్
- ❖ కుటుంబాల సంఖ్య: 1031



ఒక్క క్లిక్‌తో 30 సమాచారం అంతా కూడా వచ్చే విధంగా రూపొందించనున్నారు. ఆహార భద్రత కార్డు(రేషన్ కార్డు), ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర సంక్షేమ పథకాలన్నింటికీ ఈ కార్డునే ప్రామాణికంగా తీసుకోనున్నారు.

నాలుగు బృందాలు.. 5 రోజులు

కుటుంబాల వివరాలను సేకరించేందుకు 4 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో ముగ్గురు చొప్పున ఉంటారు. ప్రతి బృందానికి ఏఎంసీ, డీపీఓ, ఎమ్మార్వో స్థాయి అధికారి బాధ్యులుగా వ్యవహరించనున్నారు.



❖ నియోజకవర్గం : మేడ్చల్. ❖ మండలం :మూడు చింతలపల్లి. ఎంపికైన ఊరు: పోతారం ❖ మొత్తం ఇళ్లు:147 ❖ మొత్తం కుటుంబాల సంఖ్య:242 ❖ మొత్తం జనాభా:700

కీసరలో ఆత్మీయ సువార్త మహాసభ

కీసర, న్యూస్‌టుడే: కీసరలోని ది పెంతెకొస్తు మిషన్ కన్వెన్షన్(టిపిఎం) చర్చిలో గురువారం రాష్ట్రస్థాయి వార్షిక ఆత్మీయ రక్షణ సువార్త మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈనెల 6వరకు మహాసభలు జరుగుతాయని పాస్టర్ శ్యాంసుందర్ తెలిపారు.

అల్మాస్‌కుంటను కాపాడాలి

బోడుప్పల్, న్యూస్‌టుడే: బోడుప్పల్ అల్మాస్‌కుంటను కాపాడాలని కోరుతూ ముదిరాజ్,మత్స్యకార సంఘం ప్రతినిధులు గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేశారు.

డీజే వినియోగించారని కేసు

ఘట్‌కేసర్,న్యూస్‌టుడే: పుట్టిన రోజు వేడుకలో డీజే ఉపయోగించి అర్ధరాత్రి వేళ ఇతరులకు ఇబ్బంది కలిగించిన ముగ్గురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం..నిజాంపేట్ ప్రగతినగర్‌కు చెందిన నలమాస అఖిల్‌కుమార్‌గౌడ్(25) ప్రైవేటు ఉపాధ్యాయుడు తన పుట్టిన రోజు వేడుకలను ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో బుధవారం రాత్రి స్నేహితులతో కలిసి మద్యం విందు ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా డీజేను ఉపయోగించారనే ఫిర్యాదుతో ఫామ్‌హౌస్ నిర్వాహకుడు అశోక్, డీజే ఆపరేటర్ పల్లెపాటి చరణ్‌లపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

శ్మశాన వాటికల అభివృద్ధి

ఉప్పల్, న్యూస్‌టుడే:చిలుకానగర్ డివిజన్‌లోని శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లుగా కార్పొరేటర్ బన్నాల గీతాముదిరాజ్ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లుగా చెప్పారు. గురువారం శ్రీనగర్‌కాలనీలోని శ్మశాన వాటికలో బోరుబావి వేయించారు. గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



బాలాత్రిపుర సుందరీదేవిగా..

శక్తి ఆరాధనకు ప్రాధాన్యతమిస్తూ జరుపుకొనే పండుగ దసరా. తొమ్మిది రోజులు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి కొలుస్తారు. తొలిరోజున అమ్మవారు పసుపు రంగు చీరలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అభయహస్త ముద్రతో ఉండే అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎనిమిదేళ్లలోపు బాలికలకు అమ్మవారి స్వరూపంగా భావించి కుమారి పూజలు చేశారు.

భక్తుల పాలిట పెద్దమ్మ

జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి దేవాలయంలో గురువారం నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పూలతో, విద్యుద్దీపకాంతులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈ తొమ్మిది రోజుల్లో అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. – న్యూస్‌టుడే, జూబ్లీహిల్స్



నేడు గజలక్ష్మీదేవిగా..

పెద్దమ్మతల్లి శుక్రవారం అష్టలక్ష్మి రూపాల్లో ఒకటైన గజలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. కమలం మీద పద్మాసన భంగిమలో కూర్చొని ఉండే అమ్మవారికి నాలుగు చేతులు ఉంటాయి. ఓ చేతిలో కమలాలను పట్టుకోగా, అభయహస్తం, వరదముద్ర చేతులు ఉంటాయి. చుట్టూ ఉన్న ఏనుగులు తొండాలతో నీటిని అమ్మవారిపైకి చల్లుతుంటాయి. గులాబీ రంగు చీరలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. శుభాలను కలిగించేందుకు అమ్మవారికి గులాబీ రంగు చీరను అలంకరిస్తారు.

5న అన్నపూర్ణాదేవి..

సకల జీవరాశికి ఆహారం ప్రసాదించే దేవత అన్నపూర్ణాదేవి. ఈ నెల 5న శనివారం ఈ అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. వెన్న రంగు చీర అలంకరిస్తారు. ఈ తల్లిని ధ్యానిస్తే ధనధాన్యవృద్ధి, ఐశ్వర్య సిద్ధి కలుగుతాయని ప్రతీతి. చేతిలో వెండిగిన్నెతో పూల అలంకారంతో నిర్మలమైన, చల్లని మనసుకు ప్రతీకగా అమ్మవారు నిలుస్తుంది.





6న గాయత్రీదేవి..

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మతల్లి 6వ తేదీన గాయత్రీదేవి అలంకారంలో నారింజ(ఆరెంజ్) రంగు చీరతో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పంచముఖాలతో దర్శనమమిచ్చే గాయత్రీదేవి అన్ని మంత్రాలకు మూలశక్తిగా భావిస్తారు. ముక్త, విద్రుమ, హేమ, నీల, దవళ వర్ణాలు కలిగిన అయిదు ముఖాలతో శంకు, చక్రం, గద, అంకుశం ధరించి అమ్మవారు దర్శనమిస్తారు.

రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న కర్నల్ ప్రసూన్‌నాథ్, పక్కన ప్రదర్శనలు, హాజరైన క్యాడెట్లు

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలనే ఆకాంక్షలతో ఎన్‌సీసీ క్యాడెట్లు ముందుకు సాగాలని 1 తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ ప్రసూన్‌నాథ్ పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీ సమీపంలోని రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో 1 తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో గురువారం క్యాడెట్లను ఉద్దేశించి కర్నల్ ప్రసూన్‌నాథ్ ప్రసంగించారు. తమ బెటాలియన్ పరిధిలోని విద్యా సంస్థల్లోనే అత్యుత్తమ సౌకర్యాలు, అనువైన పరిస్థితులతో పాటు సువిశాల క్రీడా ప్రాంగణంతో అన్ని విధాలా అనువుగా ఉన్న రమాదేవి పబ్లిక్ స్కూల్‌లో తొలిసారి వార్షిక శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. రమాదేవి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం అందిస్తున్న తోడ్పాటుతో శిక్షణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రమాదేవి ట్రస్ట్ ట్రస్టీ డా.రావిచంద్రశేఖర్, ప్రిన్సిపల్ ఖమర్‌సుల్తానా, ఎన్‌సీసీ 1 టీ బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు. ఆర్మీ లాన్స్ నాయక్ రోహిత్, సిపాయి రోమిత్ బృందం మిక్స్ మార్షల్ ఆర్ట్స్‌ను ఎలా ఆత్మరక్షణకు వినియోగించుకోవచ్చో ప్రదర్శించారు.

ఉన్నత స్థానాలపై గురిపెట్టాలి.. ఎన్‌సీసీ క్యాడెట్లు అత్యుత్తమ ప్రతిభతో ఏ, బీ, సీ స్థాయి ఉత్తీర్ణులైతే ఉన్నత స్థానాలకు చేరేందుకు మార్గం ఉంటుందని రమాదేవి ట్రస్ట్ ట్రస్టీ డా.రావిచంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆర్మీలో అత్యున్నత స్థానాలకు చేరిన వారిలో అనేకమంది ఎన్‌సీసీ క్యాడెట్లున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.



నగరంలో దసరా ఉత్సవాల సందడి మొదలైంది. చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన 65 అడుగుల దుర్గామాత విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఇల్లు అద్దెకిస్తున్నారా.. జరభద్రం!



- ఉద్యోగులమంటూ చేరి.. అసాంఘిక కార్యకలాపాలు

ఈనాడు, హైదరాబాద్

అద్దె ఎంతైనా పర్వాలేదు.. అడ్వాన్స్ ఎంతైనా ఇస్తాం.. మా సొంతిల్లులా భద్రంగా చూసుకుంటాం. కిరాయికి చేరే ముందు తీయటి మాటలు చెవికి తాకగానే చాలామంది ఇప్పుడే చేరిపోమంటూ బంపర్ ఆఫర్ ఇస్తారు. గేటుకు వేలాడే టులెట్ బోర్డును ఎప్పుడెప్పుడు తీసేయాలా! అనే తొందరలో.. వచ్చిన వారి గురించి పూర్తి వివరాలు తెలుసుకోకుండానే తాళాలు అప్పగిస్తున్నారు. అకస్మాత్తుగా పోలీసుల నుంచి ఫోన్ కాల్ వచ్చినప్పుడు తాము చేసిన పొరపాటు గుర్తిస్తున్నారు. ఠాణా చుట్టూ తిరగలేక తలపట్టుకుంటున్నారు. మరికొందరు ఒక అడుగు ముందుకేసి, యజమానులను బెదిరిస్తూ నెలల తరబడి సొమ్ములు చెల్లించకుండా తిరుగుతున్నారు.

బాబోయ్ ఇప్పుడేం చేద్దాం.. • దిల్లీ, పుణె పోలీసుల కన్నుగప్పిన కరడుగట్టిన ఉగ్రవాది రిజ్వాన్ సైదాబాద్‌లోని అపార్ట్‌మెంట్‌లో ఆరు నెలలు మకాం వేశాడు. ఫ్లాట్ అద్దెకిచ్చే సమయంలో నిర్వాహకులు అతడి నుంచి ఆధారాలు తీసుకోలేదు. కిరాయి కేవలం రూ.5 వేలే కదా అని ఒప్పంద పత్రం రాయించుకోలేదు. • టోలిచౌకిలో ఒక ఇంట్లో అద్దెకు దిగిన ఇద్దరు మహిళలు.. రెండు నెలల కిరాయి అడ్వాన్స్ చెల్లించి ఏడాదిపాటు ఇంటి యజమానికి నరకం చూపారు. ఖాళీ చేయమంటే తమ పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరించారు. • మాదాపూర్‌లో ఒక విశ్రాంత ఉద్యోగి తన ఫ్లాట్‌ను అద్దెకిచ్చారు. కుటుంబంతో ఉన్నట్టు చెబుతూనే అతడు ఆ ఇంటిని వ్యభిచార గృహంగా మార్చాడు. పోలీసుల తనిఖీల్లో బండారం బయటపడటంతో ఇంటి యజమానికి పోలీసులు నోటీసులు జారీ చేశారు.

రూటు మార్చిన కేటుగాళ్లు..

నగరంలో కొందరు యజమానులు జాగ్రత్తలు పాటిస్తే.. మరికొందరు వచ్చే కిరాయి సొమ్ములు లెక్కలేసుకుంటున్నారు. దీన్ని అవకాశం చేసుకున్న కేటుగాళ్లు.. దర్జాగా ఇళ్లలోకి చేరి చీకటి కార్యకలాపాలు సాగిస్తున్నట్టు పోలీసుల దాడుల్లో బయటపడుతున్నాయి. సికింద్రాబాద్‌లో విశ్రాంత ఉద్యోగి ఇంట్లోకి భార్యభర్తలమంటూ జంట అద్దెకు చేరారు. తామిద్దరం పోలీసు శాఖలో పనిచేస్తున్నట్టు నమ్మించారు. కొద్దిరోజుల తరువాత రాత్రివేళల్లో కొత్త వ్యక్తుల రాకపోకలు పెరగటంతో యజమాని నిలదీశాడు. పోలీసుల తనిఖీ సమయంలో అసలు విషయం బయటపడింది. వారి వద్ద స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలో వేలాది మంది యువతుల ఫొటోలు బయటపడ్డాయి. గచ్చిబౌలిలోని ఖరీదైన అపార్ట్‌మెంట్‌కి ఐటీ ఉద్యోగినంటూ చేరాడు. ఉప్పల్‌లో సొంతిల్లున్నా.. కార్యాలయానికి దగ్గర అనే ఉద్దేశంతో ఫ్లాట్ తీసుకున్నట్టు నమ్మించాడు. వారాంతపు సమయంలో మిత్రులను రప్పించి డ్రగ్స్ తీసుకుంటూ రేవ్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్టు గుర్తించి ఖాళీ చేయించినట్లు సమాచారం.

'ధన్వంతరి బాధితులకు న్యాయం చేయాలి'

కాచిగూడ, న్యూస్‌టుడే: ధన్వతరి బాధితులను మోసగించాలని చేసే ప్రయత్నాలను ఇకనైనా మానుకోవాలని ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ హెచ్చరించారు. ఆకర్షణీయమైన పెట్టుబడుల పేరిట అమాయకులను రూ. 1500 కోట్లకు మోసగించిన నిందితులు కోర్టు బయట కేసును పరిష్కరించుకుందామంటూ బాధితుల సెల్‌ఫోన్లకు సంక్షిప్త సందేశాలు పంపుతున్నారని ఆరోపించారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితులతో కలిసి ఆయన మాట్లాడారు. ధన్వంతరి బాధితులు అంబర్‌పేటలోని ఫౌండేషన్ కార్యాలయానికి వెళ్లగా.. సీసీఎస్ పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చారన్నారు. ఫౌండేషన్ ఆస్తులు విక్రయించి బాధితులకు న్యాయం చేయకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కేటీఆర్ క్షమాపణ చెప్పాలి: కాంగ్రెస్

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: మంత్రి కొండా సురేఖపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం బషీర్ బాగ్ బాబూ జగ్జీవన్‌రాం చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో మంత్రి సీతక్కపై నోరుపారేసుకున్న కేటీఆర్ తాజాగా మంత్రి కొండా సురేఖపై సామాజిక మాధ్యమాల్లో అనుచితంగా వ్యవహరించడం.. మహిళలపై ఆయన వైఖరి స్పష్టమవుతుందన్నారు. పార్టీ నేతలు షకీల్, రాహుల్‌సింగ్, షహీద్ ఖాన్, పింకీ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలో చెకోలేకర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నేతలు

ఉస్మానియాలో చిన్నారుల చర్మవ్యాధుల చికిత్స శిక్షణ కేంద్రం

ఉస్మానియా ఆసుపత్రి, సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలో చిన్నారుల చర్మవ్యాధుల చికిత్స శిక్షణ కేంద్రాన్ని ఉస్మానియా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.నరేంద్ర కుమార్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాకేశ్ సహాయ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోనే తొలిసారిగా శిక్షణ కేంద్రాన్ని ఉస్మానియా ఆసుపత్రిలో ఏర్పాటు చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన ఓఎంసీ డెర్మటాలజీ విభాగాధిపతి డా.భూపేష్ కుమార్‌ను అభినందించారు. శిక్షణ కేంద్రం ద్వారా చిన్నారుల్లో వచ్చే చర్మ వ్యాధులను సకాలంలో గుర్తించి.. చికిత్స అందించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉస్మానియా ఆర్ఎంవోలు డా.జయకృష్ణ, డా.రఫీ, డా.కవిత, డా.రాజీవ్‌సింగ్, డా.అరుణ, డా.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న డా.నరేంద్ర కుమార్, రాకేశ్ సహాయ్, డా.భూపేష్ కుమార్

సంపాదనలో కొంత సమాజానికి కేటాయించాలి



డా.జితేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలంగాణ అగర్వాల్ సమాజ్ ప్రతినిధులు

శంషాబాద్, న్యూస్‌టుడే: సంపన్న వర్గాలు తమ సంపాదనలో కొంత సమాజాభివృద్ధి కోసం కేటాయించాలని రాష్ట్ర డీజీపీ డా.జితేందర్ పేర్కొన్నారు. గురువారం రాత్రి శంషాబాద్‌లో తెలంగాణ అగర్వాల్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు మనీష్ అగర్వాల్ అధ్యక్షతన నిర్వహించిన అగ్రసేన్ మహారాజ్ 5148వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ.. 1998 నుంచి లాభాపేక్ష లేకుండా సామాజిక సేవలను విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, మహిళాభద్రతా విభాగం డీజీపీ శిఖాగోయల్ తదితరులు పాల్గొన్నారు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్‌లో కొనుగోలుపై భారీ నజరానా



ఆఫర్ల కార్డులను ప్రదర్శిస్తున్న మాళ్విక శర్మ, సీరత్ కపూర్

సోమాజిగూడ, న్యూస్‌టుడే: బజాజ్ ఎలక్ట్రానిక్స్ కొనుగోళ్లపై భారీ నజరానా ప్రకటించింది. దేశంలోనే అతిపెద్ద ఫెస్టివల్ ఆఫర్‌గా రూ.కోటి నగదు బహుమతులు, 30 ఆల్టో కే10 కార్లు ఇస్తున్నట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన కార్డులను గురువారం పంజాగుట్టలోని బజాజ్ షోరూమ్‌లో నటీమణులు మాళ్విక శర్మ, సీరత్‌కపూర్ ఆవిష్కరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్‌లలో ఈనెల 3 నుంచి జనవరి 8వ తేదీ వరకు ఈ ఆఫర్ వర్తిస్తుందని తెలిపారు.

మెట్రోరైల్ నిర్వహణ భద్రతపై సెమినార్



కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ, ఎమ్ఆర్‌హెచ్ఎల్ సిబ్బంది

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: మెట్రోరైలు ప్రయాణికులు, సిబ్బంది భద్రతపై నిర్వహించిన తొలి సెమినార్ గురువారం విజయవంతంగా ముగిసిందని ఎల్అండ్‌టీ, ఎల్అండ్‌టీ ఎమ్ఆర్‌హెచ్ఎల్ తెలిపింది. 'కార్యక్రమంలో అవలంబించాల్సిన ఉత్తమ పద్ధతులు, రైల్వే పరిశ్రమలో క్లిష్టమైన సంఘటనలపై చర్చించుకున్నాం. హైదరాబాద్ మెట్రో వర్క్‌షాప్ సేఫ్టీ వాక్‌తో ప్రారంభమైంది. అంతర్గతంగా అభివృద్ధి చేసిన భద్రతా పరికరాలు ప్రదర్శించడంతో పాటు ఉద్యోగులకు భద్రతా విధానాలు అనుసరించడంపై మార్గనిర్దేశం చేసేందుకు హ్యాండ్ బుక్ రూపొందించాం. హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణ భద్రత ప్రాముఖ్యతను వివరించారు. సాధించిన అనేక భద్రత అవార్డుల గురించి ప్రస్తావించారు. నిరంతరం అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని నూతన లక్ష్యాలను' వివరించారని తెలిపింది. కార్యక్రమంలో ఎల్అండ్‌టీఎమ్‌హెచ్ఎల్ ఎండీ, సీఈవో కేవీబీ రెడ్డి, సీవోవో సుధీర్ చిప్లుంకర్ తదితరులు పాల్గొన్నట్లు పేర్కొంది.

ఉత్తరాల ప్రాముఖ్యంపై 'ఢై అఖర్' రైటింగ్ క్యాంపెయిన్

అబిడ్స్, న్యూస్‌టుడే: 'డిజిటల్ యుగంలో ఉత్తరాల ప్రాముఖ్యం' అంశంపై తపాలా శాఖ జాతీయ స్థాయిలో 'ఢై అఖర్' లెటర్ రైటింగ్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సర్కిల్ సహాయ డైరెక్టర్ శరత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థులు తమ పేరు, పాఠశాల/కళాశాల, పుట్టిన తేదీ, అభ్యసిస్తున్న తరగతి, చిరునామా, చరవాణి నంబరు తదితర వివరాలతో పాటు పైన పేర్కొన్న అంశంపై తమ అభిప్రాయాలను లేఖ రూపంలో రాసి చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్-500001 పేరిట పోస్టు చేయాలని కోరారు. ఈ నెల 3 నుంచి 14 వరకు వచ్చిన లేఖలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇతర వివరాలు ఇండియన్ పోస్ట్ వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చన్నారు.

ఏఐపీఎమ్ఏ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా అనిల్‌రెడ్డి



ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ఆల్‌ఇండియా ప్లాస్టిక్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఏఐపీఎమ్ఏ) ముంబయి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) అధ్యక్షుడు అనిల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గురువారం ఏఐపీఎమ్ఏ తెలిపింది. ముంబయిలో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఈ విషయాన్ని సంస్థ వివరించింది. సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ పదవికి దక్షిణ భారతీయుడు ఎన్నిక కావడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. ఏఐపీఎమ్ఏ అనేది లెజెండరీ ప్లాస్టిక్స్ అసోసియేషన్, ఎరువుల మంత్రిత్వశాఖ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెట్రోకెమికల్స్, భారత ప్రభుత్వం, వివిధ యూనియన్‌లో ప్రాతినిధ్యం కలిగి ఉందన్నారు. అనిల్‌రెడ్డి ముంబయిలోని ఇండియన్ ప్లాస్టిక్ ఇనిస్టిట్యూట్ జాతీయ అధ్యక్షుడిగా కూడా పనిచేశారని ఏఐపీఎమ్ఏ తెలిపింది.

బోగస్ కంపెనీ.. నకిలీ పీఎఫ్ ఖాతా

ఈనాడు, హైదరాబాద్: ఐటీ ఉద్యోగి ఆధార్, పాన్ ఇతర వ్యక్తిగత డేటా సేకరించిన నేరగాళ్లు.. ఆమె బోగస్ సంస్థలో పనిచేస్తున్నట్లు పీఎఫ్ ఖాతా సృష్టించారు. ఒకే సమయంలో రెండు కంపెనీల్లో పనిచేస్తున్నట్లు రికార్డుల్లో ఉండడంతో సదరు యువతి ఉద్యోగం కోల్పోవాల్సి వచ్చింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువతి(26) నగరంలోని ప్రముఖ ఐటీ సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్నారు. యువతిని ఇటీవల యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించింది. దీనిపై హెచ్ఆర్ విభాగాన్ని సంప్రదించగా పీఎఫ్ ఓవర్‌ల్యాప్ కారణమని చెప్పారు. అంటే ఒకే సమయంలో రెండు సంస్థల్లో పనిచేస్తున్నట్లు. తాను అలా పనిచేయలేదని చెప్పగా ఈపీఎఫ్‌వో రికార్డుల్లో ఉందని చెప్పారు. దీనిపై యువతి కూకట్‌పల్లిలోని ఈపీఎఫ్‌వో ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా.. శేరిలింగంపల్లిలోని కొత్తగూడలో చిరునామాతో రిజిస్టరైన మార్వెల్లా సాఫ్ట్‌ల్యాబ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో 2020 ఏప్రిల్ 1 నుంచి 2022 ఆగస్టు 5 వరకు పని చేస్తున్నట్లు రికార్డులు చూపించారు. బాధితురాలు అక్కడకు వెళ్లగా కార్యాలయమే లేదు. బోగస్ అని తేలింది.

సెలవులో హెచ్‌ఎండీఏ కమిషనర్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ సెలవులో వెళ్లారు. ఈనెల 15 తేదీ వరకు ఆయన విదేశీ పర్యటనలో ఉండనున్నారు. ఈ నేపథ్యంలో పట్టణ, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకున్నారు. లేఅవుట్లు, నిర్మాణ అనుమతులకు సంబంధించి ఫైళ్ల కదలిక కొంతకాలంగా మందగమనంలో ఉంది. కమిషనర్ సెలవుతో మరింత జాప్యం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

మియాపూర్, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో మియాపూర్ ఆర్టీసీ-2 డిపో నుంచి వివిధ దూరప్రాంతాలకు ప్రత్యేక బస్ సర్వీసులు నడుపుతున్నట్లు మేనేజర్ వెంకటేశం తెలిపారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సర్వీసులు 12వ తేదీ వరకు నడుస్తాయని పేర్కొన్నారు. మియాపూర్ క్రాస్ రోడ్ నుంచి ఈ బస్సు సర్వీసులు బయల్దేరి నిజాంపేట చౌరస్తా, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, ఎస్సార్‌నగర్ అమీర్‌పేట, ఎంజీబీఎస్, జేబీఎస్ మీదుగా ఆయా ప్రాంతాలకు నడుస్తాయి. వివరాలకు 99592 26420.

కేఎల్ యూనివర్సిటీకి పురస్కారం



అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

మొయినాబాద్, న్యూస్‌టుడే: నగర శివారు మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని కేఎల్ యూనివర్సిటీకి జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకు వరించింది. 'ఎడ్యుస్కిల్స్ వర్చువల్ ఇంటర్న్ షిప్ ర్యాంకింగ్స్-2024'లో కేఎల్ యూనివర్సిటీ అసాధారణమైన ప్రదర్శన చూపింది. అధునాతన ఇంటర్న్‌షిప్ పర్యావరణ వ్యవస్థను సృష్టించడం ద్వారా డిజిటల్ వర్క్ ఫోర్స్ ఆఫ్ టుమారో నిర్మించడంలో అందించిన తోడ్పాటుకుగాను జాతీయస్థాయిలో 7వ స్థానాన్ని దక్కించుకుంది. ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ అవార్డును అందుకున్నారు.

నగరంలో ఈనాడు

- మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఉదయం 10 గంటలకు డిజైన్ డెమోక్రసీ అండ్ మ్యూజియం ఆఫ్ తెలంగాణ కార్యక్రమం.
- తిలక్ రోడ్ తెలంగాణ సారస్వత పరిషత్‌లో సాయంత్రం 5.30 గంటలకు ధర్మనిధి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం.

మోత మోగుతోందిక్కడే

పారిశ్రామిక ప్రాంతం కంటే జూబ్లీహిల్స్‌లో అధిక శబ్దతీవ్రత నమోదు




జనవరి నుంచి ఆగస్టు వరకు నమోదైన సగటు శబ్ద తీవ్రత (డెసిబుల్లలో..)

ప్రాంతం	ఉదయం	రాత్రి
జేఎన్టీయూ	68	66
సనత్‌నగర్	63	61
జూబ్లీహిల్స్	72	74
జీడిమెట్ల	69	68
తార్నాక	61	57
జూపార్కు	55	54
అబిడ్స్	61	62
హెచ్‌సీయూ	62	61

ఈనాడు, హైదరాబాద్: జూబ్లీహిల్స్‌లో శబ్ద తీవ్రత శ్రుతి మించుతోంది. పీసీబీ నిర్దేశిత అవధికంటే ఎక్కువ డెసిబుల్లలో శబ్ద తీవ్రత రికార్డవుతోంది. పారిశ్రామిక ప్రాంతాలతో పోల్చితే జూబ్లీహిల్స్‌లోనే అధికంగా నమోదవ్వడం గమనార్హం. పీసీబీ జనవరి నుంచి ఆగస్టు వరకు నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. ఉదయం, రాత్రివేళల్లో ఒకే తరహాలో శబ్దకాలుష్యం నమోదవుతోందని పేర్కొంది. జూబ్లీహిల్స్, తార్నాక ప్రాంతాలు నివాస.. అబిడ్స్, కూకట్‌పల్లి ప్రాంతాలు వాణిజ్య.. సనత్‌నగర్, జీడిమెట్ల ప్రాంతాలు పారిశ్రామిక.. జూపార్కు, హెచ్‌సీయూ సున్నిత ప్రాంతాలుగా గుర్తించారు. నిర్మాణ రంగం, ట్రాఫిక్, రాత్రివేళ డీజే, వాహనాల హోరుతో ఈ ప్రాంతంలో అధిక శబ్ద తీవ్రత నమోదవుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

పీసీబీ నిర్దేశిత శబ్ద అవధులు..
(పగలు 6 నుంచి రాత్రి 9గం.లు),
(రాత్రి 9గం.ల నుంచి ఉదయం 6గం.లు)
(డెసిబుల్లలో)



దుష్ప్రభావాలివే..

- శబ్దం మితిమీరితే గుండె కొట్టుకునే వేగం, రక్త పీడనం పెరుగుతుంది.
- 65 డెసిబుల్ల చప్పుడుతో గుండె జబ్బులు, చెవుడు కూడా రావొచ్చు.
- చప్పుడుతో పనిచేసే శక్తిని కోల్పోతారు. నిద్రలేమి, తలనొప్పి, అలసట వస్తుంది.
- మానసికంగా, శారీరకంగానూ కుంగదీస్తుంది.

సీవరేజీపై జలమండలి యుద్ధం!

- గ్రేటర్ వ్యాప్తంగా 90 రోజులపాటు ప్రత్యేక డ్రైవ్
- మురుగు సమస్యను 30 శాతం తగ్గించేందుకు ప్రణాళిక



ఈనాడు, హైదరాబాద్: గ్రేటర్ వ్యాప్తంగా సీవరేజి సమస్యపై జలమండలి యుద్ధం ప్రకటించింది. రాబోయే 90 రోజుల్లో మురుగు సమస్యలను 30 శాతానికి తగ్గించాలనేది కీలకాంశమని ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. ప్రత్యేక కార్యచరణను బాపూఘాట్‌లో బుధవారం కార్యక్రమాన్ని జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ప్రతి ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంత ఉండేలా స్థానికులను చైతన్యం చేయనున్నారు. అందుకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించనున్నారు. చిన్న చినుకుకే రహదారులు, జనవాసాలు నిత్యం మురుగుతో దర్శనం ఇస్తున్నాయి. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన రహదారులు దెబ్బతినగా మురుగుతో జనజీవం అస్తవ్యస్తమవుతోంది. జలమండలి పరిధిలో మురుగు సమస్యకు సంబంధించి నెలకు 30-40వేల ఫిర్యాదులు అందుతున్నాయి. మురుగు గొట్టాల క్లీనింగ్‌కు 225 ఎయిర్‌టెక్ యంత్రాలు పనిచేస్తున్నాయి. వాటికే ఏటా కోట్లలోనే అద్దెలు చెల్లిస్తున్నారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. అంతేకాక 300 చదరపు మీటర్ల ఇంటి విస్తీర్ణం దాటిన ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంత తప్పకుండా నిర్మించుకోవాలని నగర ప్రజలకు పిలుపునిచ్చారు. లేదంటే వచ్చే ఏడాది నుంచి రెండింతలు నీటి బిల్లులు చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ప్రత్యేక డ్రైవ్‌లో చేసే పనులు ఇలా...

- నిత్యం మురుగు పొంగే మ్యాన్‌హోళ్ల గుర్తింపు
- భూగర్భ డ్రైనేజీ పైపులైన్ల స్థితి.. సామర్థ్యం పరిశీలన
- పైపులైన్ సామర్థ్యం పెంపునకు చర్యలు
- కాలం చెల్లిన పైపులైన్ల మార్పులకు ప్రణాళికలు
- ఇక రోజూ రంగంలో ఎయిర్‌టెక్ యంత్రాలు
- ఎయిర్‌టెక్ యంత్రాలను జీపీఎస్ ద్వారా పరిశీలన
- క్షేత్రస్థాయి పనులపై జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా పర్యవేక్షణ
- నిర్ణీత మొత్తం సీవరేజీతోపాటు అదనంగా మురుగు తొలగింపు

నత్తనడకన జీఐఎస్ సర్వే

కమిషనర్ హెచ్చరికను ఖాతరు చేయని ఏజెన్సీ

ఈనాడు, హైదరాబాద్: రాజధానిలో జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) సర్వే నత్తనడకన సాగుతోంది. ఆరు నెలల్లో పూర్తవుతుందని ఆగస్టు 8, 2024న విలేకరుల సమావేశంలో కమిషనర్ ఆమ్రపాలి ధీమా వ్యక్తం చేయగా.. 2 నెలల పురోగతి ఆ స్థాయిలో లేదు. సర్వే చేపట్టిన సంస్థ నిర్లక్ష్యమే అందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అరకొర ఉద్యోగులతో సర్వే చేపడుతోంది. కొత్తగా విధుల్లో చేరుతోన్న కొందరు సర్వేయర్లు.. జీతాలు, ఇతరత్రా సమస్యలతో రోజుల వ్యవధిలోనే ఉద్యోగం వదిలేస్తున్నారు. దాంతో సర్వే నెమ్మదించింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆ సంస్థపై చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ స్పష్టం చేస్తోంది. నగరానికి 3డీ పటం తయారు చేయాలన్న లక్ష్యంతో చేపట్టిన ప్రతిష్ఠాత్మక జీఐఎస్ సర్వే ఆదిలోనే ప్రశ్నార్థకంగా మారింది.

పూర్తయితే బహుళ ప్రయోజనాలు.. జీఐఎస్ సర్వే రెండు దశల్లో జరగనుంది. మొదటిదశలో డ్రోన్లు నగరం మొత్తాన్ని 2డీ రూపంలో చిత్రీకరిస్తాయి. రెండో దశలో ఇంటింటి సర్వే, క్షేత్రస్థాయిలో మౌలిక సౌకర్యాల మ్యాపింగ్ ఉంటుంది. డిజిటల్ ఇంటి నంబర్లు, ప్రతి ఇల్లు, వీధి, పార్కులు, విద్యుత్తు స్తంభాలు, చెరువులు, ప్రభుత్వ భవనాలు, ఖాళీ స్థలాలు, క్రీడా మైదానాలు, ఇతరత్రా వసతుల స్పష్టమైన చిత్రాలతో నగరానికి విస్తృత స్థాయి 3డీ పటం రూపుదిద్దుకుంటుంది. స్విగ్గి, జొమాటో, ఇతర ఈ-కామర్స్ సంస్థలు నగర పటాన్ని ఉపయోగించుకుంటాయని, జీఐఎస్ సర్వే పటాలు భవిష్యత్తు సమస్యలకు పరిష్కారం చూపుతాయి.



ప్రాజెక్టు వ్యయం
రూ.22 కోట్లు
నగరం మొత్తం విస్తీర్ణం..
625 చ.కి.మీ
డ్రోన్ సర్వే పూర్తయిన విస్తీర్ణం..
600 చ.కి.మీ
నగరంలోని మొత్తం ఇళ్లు..
25 లక్షలు
ఇంటింటి సర్వే పూర్తయిన ఇళ్లు..
16 వేలు

సర్వేలో నమోదు చేసుకునే వివరాలు..

నిర్మాణానికి సంబంధించిన ఆస్తిపన్ను వివరాలతోపాటు దానిని వ్యాపారానికా, నివాసానికా అనే వివరాలను సర్వేలో జీహెచ్ఎంసీ సేకరిస్తోంది. నిర్మాణంలోని పచ్చదనం, విద్యుత్తు సదుపాయాలు, సౌర ఫలకలు, ఇంకుడు గుంత, లిఫ్టు, ఎదురుగా ఉన్న రోడ్డు వెడల్పు వంటి వివరాలను.. యజమానికి సమ్మతమైతేనే తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదనపు వివరాలను నగర భవిష్యత్తు ప్రణాళిక కోసం సేకరిస్తున్నామంటున్నారు. భవన నిర్మాణ అనుమతి, నీటి, విద్యుత్తు కనెక్షన్ల వివరాలు ఇవ్వడం తప్పనిసరి కాదంటున్నారు.

రహదారి.. ప్రమాదకారి



హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద పదుల సంఖ్యలో భారీ వాహనాలను రోడ్డు పక్కనే నిలుపుతున్నారు. రాత్రివేళ ఇతర వాహనాలు వాటిని ఢీకొని తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

పట్టుతప్పితే.. అంతే



రోడ్డు ప్రమాదాలపై అధికారులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా కొందరు వాహనదారులు, ప్రయాణికులు చెవికెక్కించుకోవడం లేదు. సచివాలయం రోడ్డులో ఓ ట్రాలీఆటోలో కూరగాయల మూటలపై కూర్చొని ప్రమాదకరంగా వెళ్తున్నారు.

పరిమితికి మించి.. ప్రాణాల మీదకు



ద్విచక్రవాహనాలపై పరిమితికి మించి లోడ్‌తో ప్రయాణిస్తూ కొందరు ప్రాణాలకు మీదకు తెచ్చుకుంటున్నారు. నాంపల్లి స్టేషన్ రోడ్డులో గురువారం ఓ బైక్‌పై యువకుడు భారీ మూటలతో ఇలా వెళ్తూ కనిపించాడు.

బాలుడిపై లైంగికదాడి.. యువకుడికి పదేళ్ల జైలు



నిందితుడు అబ్దుల్ మజీద్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ఉచిత వసతి గృహంలో ఉంటూ ఏడో తరగతి చదువుతున్న బాలుడిపై లైంగికదాడికి పాల్పడ్డ యువకుడికి న్యాయస్థానం పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.16,000 జరిమానా విధించింది. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సునీత బద్ద కథనం ప్రకారం.. ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ అబ్దుల్ మజీద్ (23) సరూర్‌నగర్ పరిధిలోని ఓ వసతిగృహంలో పనిచేసేవాడు. 2018 ఏప్రిల్ 22 రాత్రి వసతి గృహంలో నిద్రిస్తున్న బాలుడి(13)ని బలవంతంగా మరో గదిలోనికి తీసుకెళ్లి భయభ్రాంతులకు గురిచేసి లైంగికదాడికి పాల్పడ్డాడు. సరూర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కేసు విచారించిన రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి సురేఖ తుదితీర్పు వెల్లడించారు. బాధిత బాలుడికి రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. నిందితుడు చెల్లించే జరిమానాను బాలుడి వైద్య ఖర్చులు, పునరావాసానికి కేటాయించాలని న్యాయమూర్తి తీర్పులో పేర్కొన్నారు.

మంత్రి కొండా సురేఖపై భారాస కార్పొరేటర్ల ఫిర్యాదు



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న భారాస కార్పొరేటర్లు కవితారెడ్డి, పద్మావెంకటరెడ్డి, దేదీప్యరావు, సామల హేమ, సునీత

జూబ్లీహిల్స్: మాజీ మంత్రి కేటీఆర్‌పై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేసిన తప్పుడు, నిరాధార వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ పలువురు భారాస మహిళా కార్పొరేటర్లు గురువారం బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ వెంకటరెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్లు కవితారెడ్డి, పద్మావెంకటరెడ్డి, దేదీప్యరావు, సామల హేమ, ఆర్.సునీతలు ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మంత్రి చేసిన వ్యాఖ్యలు నిరాధారమైనవని, కేటీఆర్ ప్రతిష్ఠను భంగం కలిగించే వ్యాఖ్యలని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ, ఇతర సమస్యలను పక్కదారి పట్టించడానికి ముఖ్యమంత్రితో కొండా సురేఖ కుమ్మక్కై ఈ ఆరోపణలు చేశారన్నారు. నాగచైతన్య-సమంత విడిపోవడానికి కేటీఆర్ కారణమంటూ వ్యాఖ్యానించడం ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నమన్నారు. మంత్రిపై కేసు నమోదు చేయాలని, లేదంటే చట్టపరంగా ముందుకెళ్తామని కార్పొరేటర్లు అన్నారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. కోర్టు అనుమతితో కేసు నమోదు చేస్తామని తెలిపారు.

హైడ్రా బాధితులతో కలిసి దీక్ష చేస్తా: ఈటల



కాలనీవాసుల సమావేశంలో పాల్గొన్న ఎంపీ రాజేందర్

నేరేడ్‌మెట్, మౌలాలి, న్యూస్‌టుడే: పేద బతుకుల్లో మట్టి కొడుతున్న దుర్మార్గపు ప్రభుత్వం రేవంత్‌రెడ్డిదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హైడ్రా బాధితులు అత్యధికంగా మల్కాజిగిరిలో ఉన్నారని అన్నారు. బండ చెరువు చుట్టూ 18 కాలనీల్లో 35 ఏళ్ల క్రితం పట్టా భూములు కొనుక్కొని ఇళ్లు కట్టుకున్నారన్నారు. కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, సునీతతో కలిసి ఎంపీ గురువారం బండ చెరువు పరిసర కాలనీలలో పర్యటించారు. కాలనీవాసులతో సమావేశమయ్యారు. కాలనీవాసులు తమ ఇళ్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్నాయని.. ఇప్పుడు హైడ్రా భయం గుప్పిట్లో కొట్టుమిట్టాడుతున్నామని ఆయనకు మొరపెట్టుకున్నారు. అనంతరం ఈటల మాట్లాడారు. హైడ్రా బాధితులందరితో కలిసి త్వరలో దీక్ష చేస్తానని, అందరూ నిశ్చింతగా ఉండాలని హామీ ఇచ్చారు. హైడ్రా చర్యలపై కోర్టు మొట్టికాయలు వేసినా ప్రభుత్వానికి జ్ఞానం రావడం లేదన్నారు. 'ఎవరు చెప్పినా వినసంటే సైకో అంటారంటూ ముఖ్యమంత్రిపై పరుష పదజాలం'తో ధ్వజమెత్తారు. సీఎంకు మంత్రులు వత్తాసు పలుకుతున్నారని ఆయన విమర్శించారు.

మూసీ లోపలున్న నిర్మాణాలనే కూల్చేస్తున్నారు



మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించిన అంజన్‌కుమార్‌యాదవ్, ఫహీమ్ ఖురేషీ, అనిల్‌కుమార్ యాదవ్

నారాయణగూడ: 'కాంగ్రెస్‌లో ప్రజాస్వామిక స్వేచ్ఛ ఎక్కువ. పలు సందర్భాల్లో పరస్పరం విమర్శలు గుప్పించుకున్నా.. సమయం వచ్చినప్పుడు అంతా ఒక్కటై పోరాడతాం' అని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ అండదండలు, కష్టపడేవారికి కచ్చితంగా అవకాశాలు వస్తాయన్నారు. మూసీ కూల్చివేతల విషయంలో ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. కూల్చివేతలు మూసీ లోపలి నిర్మాణాలు మాత్రమేనని.. పరివాహక ప్రాంతంలో ఉన్నవి కాదన్నారు. వందల చెరువులు, కుంటలను భారాస నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. గేటెడ్ కమ్యూనిటీలోకి వరద ఎందుకొస్తుందో ఆలోచన చేయాలన్నారు. ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకులు ఫహీమ్ ఖురేషి, కూన శ్రీశైలం గౌడ్, సీతారామరాజు, శ్రీనివాస్ గుప్తా ఉన్నారు.

మహిళా మంత్రులుంటే ఓర్వలేకపోతున్నారు



మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మహిళా కాంగ్రెస్ నేతలు

అబిడ్స్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలు మంత్రులుగా ఉంటే చూసి ఓర్వలేక పోతున్నారని.. మాజీ మంత్రి కేటీఆర్ సామాజిక మాధ్యమాల వేదికగా ట్రోల్ చేయడాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు తెలిపారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీభవన్ సమీపంలోని నాంపల్లి లత టాకీస్ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఖబడ్దార్ కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్నా.. భారాస పార్టీ మహిళలకు ఏమాత్రం విలువ ఇవ్వలేదని, ప్రతిపక్షంలో ఉండి తాము సచివాలయానికి వెళ్తే అనుమతి నిరాకరించిన విషయం గుర్తు చేశారు. నోరు ఉందని ఇష్టారాజ్యంగా వాగితే సహించేది లేదని, ఇటీవలే మహిళా కమిషన్ సైతం మొట్టికాయలు వేసినా కేటీఆర్ మారడం లేదన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల అధ్యక్షులు ఉషశ్రీ, రాధ, లక్ష్మీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శైలజ, జ్యోతిరెడ్డి, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఆర్ నియంత్రణకు కార్యాచరణ

మంత్రి దామోదర రాజనర్సింహ



యాక్షన్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మాదాపూర్, న్యూస్‌టుడే: యాంటీ బయోటిక్స్ విచ్చలవిడిగా వాడకంతో ప్రమాదకర స్థాయికి చేరుకున్న యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్) నియంత్రణ కోసం రూపొందించిన కార్యాచరణ ప్రణాళికను తెలంగాణలో పక్కాగా అమలుచేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం సాయంత్రం మాదాపూర్‌లోని శిల్పాకళావేదికలో జీ-స్పార్క్ 2024 పేరిట ''ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్, కంట్రోల్ అండ్ యాంటీమైక్రోబియల్ స్టీవార్డ్‌షిప్'' అనే అంశంపై ఏర్పాటు చేసిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏఎంఆర్‌పై ప్రభుత్వ కార్యాచరణ ప్రణాళికను ఆయన ప్రకటించారు. దేశంలో ఆరు రాష్ట్రాలు ఏఎంఆర్ కార్యాచరణ ప్రణాళికను అమలుచేస్తున్నాయని, ఇందులో కేరళ ముందంజలో ఉందని చెప్పారు. జీ-స్పార్క్ సదస్సు ఛైర్ డా.రంగారెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక వైద్యానికి ఏఎంఆర్ పెద్ద సవాల్‌గా మారుతుందని చెప్పారు.

మానవాళికి ప్రమాదకరం.. జీ-స్పార్క్ సదస్సు కోఛైర్, కాంటినెంటల్ ఆసుపత్రి సీఎండీ డా.గురు ఎన్ రెడ్డి మాట్లాడుతూ.. ఏఎంఆర్ కారణంగా మన దేశంలో ఏటా 3 లక్షల మంది మరణిస్తున్నారని తెలిపారు. కేరళ మాజీ మంత్రి శైలజా టీచర్ మాట్లాడుతూ.. ఏఎంఆర్ యాక్షన్ ప్లాన్‌ను అమలుచేయడంలో కేరళ మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇండియా ఆఫీస్ ప్రతినిధి డా.అనూజ్ శర్మ మాట్లాడుతూ.. 2030 నాటికి ఏఎంఆర్ మరణాలను 10 శాతం తగ్గించాలని ఇటీవల యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వ ఏఎంఆర్ యాక్షన్ ప్లాన్‌ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు.

మన్నించాలమ్మా.. నీళ్లు లేవమ్మా



రాష్ట్రం మొత్తం విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు జలకళతో దర్శనమిస్తుంటే.. మంచాల మండలంలో వర్షాలు లేక చెరువులు వెలవెలబోతున్నాయి. జాపాల చెరువులో ఉన్న కొన్ని నీటిలో బతుకమ్మలు నిమజ్జనం చేశారు. రహదారిపై వెళ్లేవారు బతుకమ్మలకు ఎంత కష్టమొచ్చింది.. నీరులేక ఇలాంటి పరిస్థితి వచ్చిందంటూ వాపోతున్నారు.
– న్యూస్‌టుడే, మంచాల

ప్రైవేటు ఉపాధ్యాయుడికి ఐదేళ్ల జైలు



వెంకటరమణ

గౌతంనగర్, న్యూస్‌టుడే: విద్యార్థినిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడికి గురువారం పోక్సో కోర్టు అయిదేళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధించి బాలికకు రూ.25 వేలు చెల్లించాల్సిందిగా తీర్పునిచ్చినట్లు మల్కాజిగిరి ఠాణా సీఐ సత్యనారాయణ తెలిపారు. విజయనగరం జిల్లా కొమరాడ మండలం రావికారవలస గ్రామానికి చెందిన వెంకటరమణ(40) మౌలాలి గౌతమ్ కాన్సెప్ట్ పాఠశాలలో 2016లో ఉపాధ్యాయుడిగా పనిచేసినప్పుడు పదోతరగతి విద్యార్థినిపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు.

నృత్య దర్శకుడు జానీకి నాలుగు రోజుల మధ్యంతర బెయిలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: అత్యాచారం, బెదిరింపులు, పోక్సో కేసులో విచారణ ఖైదీగా చంచల్‌గూడ జైలులో ఉన్న నృత్య దర్శకుడు జానీకి 4 రోజుల మధ్యంతర బెయిలు మంజూరైంది. ఉత్తమ నృత్య దర్శకుడిగా దిల్లీలో అవార్డు అందుకోవాల్సి ఉన్నందున రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టులో బెయిలుకు దరఖాస్తు చేసుకోగా విచారణ జరిపిన న్యాయమూర్తి హరీశ.. ఈనెల 6 నుంచి 9 వరకు బెయిలు మంజూరు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. రూ.2 లక్షల వ్యక్తిగత బాండ్, అంతే మొత్తంతో ఇద్దరి పూచీకత్తు సమర్పించాలన్నారు. కుటుంబసభ్యులను, మీడియాను కలవకూడదు. ఈనెల 10న ఉదయం 10.30కు కోర్టులో హాజరుకావాలి.

పెద్దఅంబర్‌పేట ఛైర్‌పర్సన్‌గా జయశ్రీ



హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్‌గా పండుగల జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఛైర్‌పర్సన్ చెవుల స్వప్నపై కౌన్సిలర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస పరీక్ష నెగ్గిన విషయం తెలిసిందే. గురువారం తట్టిఅన్నారం వార్డు కార్యాలయంలో చేవేళ్ల ఆర్డీవో (ప్రత్యేకాధికారి) పి.సాయిరాం, కమిషనర్ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. 21 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. సీపీఐకి చెందిన 12వ వార్డు కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్.. నూతన ఛైర్మన్‌గా 8వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ పేరు ప్రతిపాదించగా, భారాసకు చెందిన 15వ వార్డు కౌన్సిలర్ అర్చన బలపరిచారు.

పక్కాగా.. కుటుంబ డిజిటల్ కార్డు ప్రాజెక్టు

జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ స్నేహ శబరీష్



మాట్లాడుతున్న బల్దియా అదనపు కమిషనర్ స్నేహ శబరీష్

ఈనాడు, హైదరాబాద్: కుటుంబ డిజిటల్ కార్డుల జారీ కోసం నగరంలో చేపట్టనున్న ప్రయోగాత్మక ప్రాజెక్టును విజయవంతం చేయాలని, వివరాల సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ ఐటీ విభాగం అదనపు కమిషనర్ స్నేహశబరీష్ అధికారులకు స్పష్టం చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతిలో ఆమె అధికారులకు దిశానిర్దేశం చేశారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఎమ్మార్వోలు, ఏఎంసీలు, డీపీఓలు, సీఓలు, తదితరులకు వివరాల సేకరణపై అవగాహన కల్పించారు. ''ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం నియోజకవర్గానికి ఓ కాలనీ ఎంపికైంది. ఆయా కాలనీల్లోని ప్రతి ఇంటికి వెళ్లండి. కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని సర్కారు ఇచ్చిన ఫారాల్లో నింపండి. ఒక్కో బృందం రోజుకు కనీసం 40 ఇళ్లను సర్వే చేయాలి. సర్వేను 8వ తేదీన ముగించి, వివరాలను 9న పరిశీలించి, 10వ తేదీన ప్రభుత్వానికి అందజేయాలి. ప్రాజెక్టులో.. కుటుంబాన్ని ఓ యూనిట్‌గా తీసుకుని, ఒక డిజిటల్ కార్డును అందజేయాల్సి ఉంటుంది' అన్నారు.

తెలంగాణ న్యాయవాదుల క్రికెట్ జట్టు ఎంపిక

రంగారెడ్డి జిల్లా కోర్టులు, న్యూస్‌టుడే: ఈ నెల 6 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే 36వ అఖిల భారత న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌లో తెలంగాణ తరపున పాల్గొనే ఆటగాళ్ల (న్యాయవాదుల) జాబితాను తెలంగాణ అడ్వకేట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజేందర్‌రెడ్డి గురువారం ప్రకటించారు. ఈ జట్టుకు రంగారెడ్డి జిల్లా కోర్టులకు చెందిన న్యాయవాది పి.రాఘవేందర్‌రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ఇతర సభ్యులు.. కె.శశిధర్, డి.సాయిప్రసాద్, షేర్ సింగ్, మహ్మద్ మెస్సుం అబు, ఎ.అన్వేశ్‌రెడ్డి, సుభాశ్ రాథోడ్, రాహుల్, శ్రేయాస్ వల్లా, వంశీ శ్రీవాత్సవ్, గౌతం, చైతన్య మిత్ర, మహ్మద్ హుసామా, వంశీ కరుతురి, ఎ.అంజన్, జగదీశ్వర్‌రెడ్డి.

బీసీ ఉప ప్రణాళికను ప్రకటించాలి

గోల్నాక, న్యూస్‌టుడే: బీసీల సమగ్రాభివృద్ధికి రూ. 5 వేల కోట్లతో ఉప ప్రణాళిక ప్రకటించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ కోరారు. తెలంగాణలోని 120 కులాలలో అధిక శాతం నేటికీ పేదరికంలో మగ్గుతూ అభ్యున్నతికి దూరంగా ఉన్నాయన్నారు. గురువారం నింబోలిఅడ్డాలో.. పులిజాల కృష్ణ, మెట్టు ముత్యాల్‌రావు, డా.ప్రశాంత్ నిమ్కర్, సీహెచ్ ప్రదీప్‌గౌడ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ కులాలవారీగా జనాభా లెక్కలు తీసి అభివృద్ధికి నిధుల కేటాయింపు, సంక్షేమ పథకాల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. అత్యంత వెనుకబడిన బీసీల అభ్యున్నతికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



దృష్టి పడొద్దని దిష్టి తీశారు!

మూసీ పరీవాహక ప్రాంతం చైతన్యపురి డివిజన్ న్యూమారుతీనగర్ నార్త్ కాలనీ, గణేశ్‌నగర్ కాలనీవాసులు బుధవారం రాత్రి తమ ఇళ్లకు కుంకుమ కలిపిన నీళ్లతో దిష్టి తీశారు. నది సుందరీకరణ పేరిట ఇళ్లు కూల్చాలనుకుంటున్న అధికారుల కళ్లు తమ ఇళ్లపై పడొద్దని కోరుకుంటూ నిర్వహించినట్లు తెలిపారు. – న్యూస్‌టుడే, నాగోలు

ఉపాధ్యాయులకు ఆంగ్లభాషపై పట్టుండాలి



మాట్లాడుతున్న రామేశ్వర్‌గౌడ్

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: పోటీ ప్రపంచం నేపథ్యంలో ఉపాధ్యాయులకు ఇంగ్లిష్‌లో తప్పనిసరిగా ప్రావీణ్యం ఉండాలని ఆంగ్ల భాష శిక్షకుడు రామేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం సుందరయ్య కళానిలయంలో 'విల్ టూ కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్' సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో ఆంగ్లంపై శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. 2002 అక్టోబరు నుంచి ఇప్పటివరకు మొత్తం 53 వేల మంది ఉపాధ్యాయులకు ఆంగ్లభాషలో ఉచితంగా శిక్షణనిచ్చినట్లు తెలిపారు. 40 రోజులపాటు ఆన్‌లైన్‌లో ఒకరోజు ప్రత్యక్ష తరగతులు కొనసాగాయన్నారు. సహచట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులందరికీ ఆంగ్లభాషపై పట్టు ఉండడం ముఖ్యమన్నారు. మాతృభాషపై పట్టు ఉంటే ఇంగ్లిష్‌ను సులువుగా నేర్చుకోవచ్చని చెప్పారు.



హాజరైన ఉపాధ్యాయులు

చికెన్ ధరలు

ఫాంరేటు	112-00	డ్రెస్డ్	194-00
రిటైల్	134-00	స్కిన్‌లెస్	221-00

న్యాయవాదులపై పోలీసుల దాడులు దురదృష్టకరం



మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

రంగారెడ్డి జిల్లా కోర్టులు: న్యాయవాదుల రక్షణ చట్టంతో పాటు ఇతర డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా రిలే దీక్షలు చేస్తున్న సమయంలోనే.. న్యాయవాదులపై పోలీసుల దాడులు దురదృష్టకరమని తెలంగాణ న్యాయవాదుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వై.కొండల్‌రెడ్డి అన్నారు. నగర సివిల్ కోర్టులకు చెందిన న్యాయవాది ఖలీంపై మాదన్నపేట పోలీసుల దాడికి నిరసనగా గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు. జిల్లా కోర్టుల ఎదుట చేపట్టిన రిలే నిరహార దీక్షల్లో గురువారం ఆయన మాట్లాడుతూ.. న్యాయవాది ఖలీంపై దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. న్యాయవాదుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని ప్రధాన కార్యదర్శి కృష్ణ అన్నారు. అనంతరం డీజీపీకి వినతిపత్రం ఇవ్వడానికి తరలివెళ్లారు.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

చిరువ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, న్యూస్‌టుడే: రైతు బజార్ ఎదుట ఏళ్లుగా దుకాణాలు నడుపుతూ జీవనం సాగిస్తున్న చిరువ్యాపారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం రైతు బజార్ వద్ద షెడ్లు, దుకాణాలు కోల్పోయిన పలువురు వ్యాపారులు గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. 30 ఏళ్లుగా ఉన్న దుకాణాలను మూడు రోజుల కిందట అధికారులు తొలగించారని ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్, చిరంజీవి, సత్తిరెడ్డి, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడి అమానుషం

ఈనాడు, హైదరాబాద్: సిటీ సివిల్ కోర్టు న్యాయవాది అబ్దుల్ కలీంపై మాదన్నపేట్ పోలీసులు విచక్షణా రహితంగా దాడి చేసినందుకు నిరసనగా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాదిపై దాడికి దిగడం అమానుషమని, దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని కోఆపరేటివ్ ట్రైబ్యునల్ అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ దివాకర్ డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా మాదన్నపేట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన కలీంను దూషించిన పోలీసులు, కొట్టుకుంటూ తీసుకెళ్లారని, విచక్షణా రహితంగా కొట్టడంతో అతను స్పృహ తప్పి పడిపోయాడన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు నిరసనలు చేపడతామని వెల్లడించారు.

విద్యుత్తు కేబుల్ ధ్వంసం

బండ్లగూడ: తవ్వకాల్లో నిర్లక్ష్యం కారణంగా భూగర్భ విద్యుత్తు కేబుల్ ధ్వంసమైంది. ఆనంద్ నగర్ చౌరస్తా విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో మూడు రోజులుగా రాత్రివేళల్లో పనులు సాగుతున్నాయి. బుధవారం అర్ధరాత్రి చౌరస్తా సమీపంలో జేసీబీతో తవ్వకాలు చేపట్టారు. బండ్లగూడ సబ్‌స్టేషన్ నుంచి తట్టిఅన్నారం గ్రామానికి సరఫరా చేసే 33 కేవీ భూగర్భ విద్యుత్తు కేబుల్ ధ్వంసమైంది. సమాచారం అందుకున్న అధికారులు సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఉదయం మరమ్మతులు చేపట్టారు. తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని విద్యుత్తు అధికారులు తెలిపారు. సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

పోగొట్టుకున్నా.. పట్టేస్తారు!

నాగోలు, న్యూస్‌టుడే

ఫోన్ల రికవరీలో రాచకొండ పోలీసుల ముందంజ



ఫోన్లు అందుకున్న వారితో ఎల్బీనగర్ పోలీసులు

ఫోను పోగొట్టుకున్నారా? అయితే భయపడాల్సిన పనేం లేదు. వెంటనే సమీపంలోని ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేయండి. సాధ్యమైనంత త్వరలో ఫోను మీ చేతికందేలా పోలీసులు చర్యలు చేపడతారు. 2022లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా పోలీసులు పోగొట్టుకున్న ఫోన్లను గుర్తించి.. రికవరీ చేస్తున్నారు. ఇలా ఎల్బీనగర్ ఠాణాలో ఏడాది కాలంలో సుమారు 450 ఫోన్లను సంబంధిత యజమానులకు అప్పగించారు. సోమవారం సైతం ఏసీపీ కృష్ణయ్య 90 ఫోన్లను రికవరీ చేసి యజమానుల అందజేశారు. ఇవన్నీ రూ.20 వేల నుంచి రూ.40 వేల ఖరీదు చేసేవే.

ఏం చేస్తారంటే..

మొదటగా సీఈఐఆర్ పోర్టల్‌ను ఆయా ఠాణాలకు అనుసంధానించారు. రాచకొండ కమిషనరేట్‌లో సైబర్‌క్రైమ్ పోలీస్‌స్టేషన్ వీటన్నింటికీ నోడల్ కార్యాలయంగా పనిచేస్తోంది. ఈ పోర్టల్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ (సీఐడీ) ఆధ్వర్యంలో నడుస్తోంది. పోగొట్టుకున్న బాధితులు తమ ఫోను నంబరు, ఐఎంఈఐ నంబరు, ఆధార్ కార్డు లాంటి వివరాలతో స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేయగానే, ఈ వివరాలన్నీ సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తారు. ఫోను మరొకరి చేతికి చేరగానే, కొత్త సిమ్ కార్డు వేయగానే.. ఆ వివరాలు పోర్టల్‌లో ప్రత్యక్షమవుతాయి. అవతలి వ్యక్తి ఎన్ని సిమ్‌లు మార్చినా.. అన్ని వివరాలు కనిపిస్తాయి. సదరు ఫోను ఎవరి చేతిలో.. ఏ రాష్ట్రంలో ఉందనే వివరాలన్నీ తెలిసిపోతాయి. పోలీసులు వాటిని రికవరీ చేసి, కేసు నమోదైన స్టేషన్‌కు రప్పిస్తారు.

రాచకొండ కమిషనరేట్ పరిధిలో.. (2024 జనవరి నుంచి సెప్టెంబరు వరకు)

సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదైన ఫోన్ల వివరాలు: 11,067

రికవరీ చేసి బాధితులకు అందజేసినవి..: 3,771

ఎల్బీనగర్ ఠాణా పరిధిలో అందజేసినవి..: 450

దేశంలోనే ప్రథమస్థానం..

సీఈఐఆర్ పోర్టల్‌ను వినియోగించి ఫోన్లను రికవరీలో తెలంగాణ ముందంజలో ఉంది. ప్రజలు తమ ఫోను పోగొట్టుకోగానే.. ఆన్‌లైన్‌లోనూ ఎవరికివారే పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవచ్చు. కాని తదనంతరం ఆ ఫోనును వినియోగించే వారి వివరాలు.. కేవలం నోడల్ కార్యాలయంలోనే దొరుకుతాయి. అందుకే స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేయాలి. గతంలో ఈ ప్రక్రియంతా పూర్తయ్యేందుకు నెల రోజులకు పైగా పట్టేది. పోర్టల్‌తో 24 గంటల్లోనే అవతలి వ్యక్తుల వివరాలన్నీ తెలుస్తున్నాయి. ఫోను పోతే బాధపడాల్సిన అవసరం లేదని, స్థానిక ఠాణాల్లో ఫిర్యాదు చేస్తే.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి అందజేస్తామని రాచకొండ సైబర్ క్రైమ్ డీసీపీ అరవింద్‌బాబు పేర్కొన్నారు. సీఈఐఆర్ పోర్టల్ ఏర్పాటయ్యాక రికవరీ శాతం గణనీయంగా పెరిగిందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఎల్బీనగర్: 76759 19030

మలక్‌పేట: 80085 73284

హయత్‌నగర్: 98336 64897

కర్మన్‌ఘాట్: 94400 32872

బండ్లగూడ: 96034 78579

మూసారాంబాగ్: 79933 00559

బండ్లగూడ, సైదాబాద్, కర్మన్‌ఘాట్, నాగోలు, న్యూస్‌టుడే:

? ధనలక్ష్మీనగర్ కాలనీ రోడ్డు నంబర్-1లో భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ పూడిక వ్యర్థాలను రోడ్డు మధ్యలోనే పోశారు. దుర్వాసనతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. – అనిల్‌రెడ్డి

✓ వెంటనే తరలించేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. – శ్రీనివాస్‌రెడ్డి, జీఎం, జలమండలి

? సైదాబాద్ హౌసింగ్ బోర్డు కాలనీలోని రామాలయం పరిసరాల్లో నిర్మాణంలోని భవనం నుంచి నీరు ఉదయం, సాయంత్రం రహదారులపైకి చేరుతోంది. అవస్థలు తప్పడం లేదు. – రాంకుమార్

✓ క్షేత్రస్థాయి సిబ్బందిని పంపించి, నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. –జయంత్, డీసీ, మలక్‌పేట

? అక్బర్‌బాగ్ గడ్డిఅన్నారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మలక్‌పేట బీ-బ్లాక్ విద్యుత్తు 33/11కేవీ ఉప కేంద్రానికి వెళ్లే మార్గంలో వీధి దీపాలు పగటిపూటా వెలుగుతున్నాయి. – సుశీల్‌కుమార్

✓ పగటి వేళల్లో వీధి దీపాలు వెలగకుండా మరమ్మతులు చేపడతాం. – రాజు, వీధి దీపాల పర్యవేక్షణాధికారి, మలక్‌పేట

? హస్తినాపురం డివిజన్ నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీ నుంచి ద్వారకాపురి కాలనీ ప్రధాన రోడ్డులో మ్యాన్‌హోళ్ల నుంచి పూడిక తొలగించి, అక్కడే వదిలేశారు. –సి.సుబ్బరామయ్య, హస్తినాపురం

✓ పరిష్కార చర్యలు చేపడతాం. – సుజాతానాయక్, కార్పొరేటర్

? నాగోలు సాయినగర్ రోడ్డు నంబరు-3లో పలు వీధుల్లో మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. అలకాపురి చౌరస్తాలో లక్ష్మీ రెస్టారెంట్ మార్గంలోనూ సమస్య నెలకొంది. – యుగేందర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు

✓ అక్కడ కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి అనుమతి లభించింది. పది రోజుల్లో పనులు ప్రారంభిస్తాం. – ప్రేమ్‌కుమార్, మేనేజర్, జలమండలి

? నాగోలు డివిజన్ అనంతుల జంగారెడ్డి కాలనీలో మొత్తం 30 వీధి దీపాలకు 10 మాత్రమే వెలుగుతున్నాయి. స్థానికంగా వెలిగే దీపాలను విద్యుత్తు సిబ్బంది తొలగించి మరెక్కడో ఏర్పాటు చేస్తున్నారు. – పారునంది భాస్కర్, కాలనీ అధ్యక్షుడు

✓ సిబ్బందిని పంపి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం. – జగన్నాథం, వీధి దీపాల ఇన్‌ఛార్జి, జీహెచ్ఎంసీ

? నాగోలు రాజ్యలక్ష్మీ కాలనీ రోడ్డు నంబరు-3లో వరద కాల్వ నిర్మాణం పేరిట తవ్వకాలు చేపట్టి వదిలేశారు. – మహేందర్‌రెడ్డి

✓ వరద కాల్వ నిర్మాణ పనులు ఇప్పటికే 70 శాతం పూర్తయ్యాయి. వర్షాల కారణంగా నిలిచిపోయాయి. దసరా పండగ పూర్తయ్యాక పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తాం. –దీపక్, ఏఈ, జీహెచ్ఎంసీ

తాత్కాలిక మరమ్మతులు



నల్గొండ చౌరస్తాలో తాత్కాలిక మరమ్మతుల్లో భాగంగా జీహెచ్ఎంసీ సిబ్బంది రహదారి గుంతల్లో డస్ట్ నింపుతున్నారిలా.. డస్ట్ తడి ఆరిన తర్వాత తారు వేస్తామని చెబుతున్నారు.

పకడ్బందీగా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే: కలెక్టర్




పెద్దతూప్ర తండాలో పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

శంషాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డ్స్ సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలం పెద్ద తూప్ర తండాలో గురువారం ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ సర్వే కార్యక్రమాన్ని ఆర్డీవో కె.వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. తండాలో మొత్తం ఎన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయో పక్కాగా వివరాలు సేకరించి ఈ నెల 7లోపు ప్రభుత్వానికి నివేదిక అందజేయాలన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో సర్వేలో పాల్గొనాలని సూచించారు. పెద్దతూప్ర తండాలో ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ సర్వే విజయవంతంగా పూర్తయ్యాక, అన్నికుటుంబాలకు డిజిటల్ కార్డ్స్ అందజేయడానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. తహసీల్దార్ రవీందర్ దత్తు, ఎండీవో మున్నీ, ఎంపీవో ఉష పాల్గొన్నారు.

అటుకులు పంచి.. అమ్మను కొలిచి



వనస్థలిపురం త్రిశక్తి ఆలయంలో వైష్ణవీదేవిగా..



బాలాత్రిపురసుందరిగా ప్రసన్న మహాకాళి ..

మూసారాంబాగ్, కర్మన్‌ఘాట్, వనస్థలిపురం, నాగోలు: ఎల్బీనగర్, మలక్‌పేట పరిధిలో భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. పలు కాలనీల్లో రెండో రోజు అటుకుల బతుకమ్మ ఆడారు. రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి.. అటుకులు, పప్పు, బెల్లంతో చేసిన నైవేద్యాన్ని నివేదించారు. పలు డిగ్రీ కళాశాలల్లో యువతులు బతుకమ్మలను పేర్చి, ఆడారు.

ప్రత్యేక అలంకరణలో..: వనస్థలిపురం త్రిశక్తి ఆలయంలో అమ్మవారు వైష్ణవీదేవిగా, కొత్తపేట శ్రీప్రసన్న మహాకాళి అమ్మవారి బాలాత్రిపురసుందరి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ ఆలయ ఆవరణలో వేదపండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. బైరామల్‌గూడ శక్తిహనుమాన్ ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన అమ్మవారి విగ్రహం వద్ద భక్తులు సామూహిక హోమాలు నిర్వహించారు. శ్రీకృష్ణనగర్ కాలనీలోని జైమాతాదీ అసోసియేషన్ ఆధ్వర్యంలో భూపేశ్ గుప్తా కాలనీ టీకేఆర్ రోడ్డులో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.



హస్తినాపురం రేస్ మహిళా కళాశాలలో..



దిల్‌సుఖ్‌నగర్ నోబుల్ కళాశాలలో..



ధ్యానాంజనేయ ఆలయంలో..



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బుధవారం సాయంత్రం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి కుంట్లూర్‌లో కుండలిని యోగి శేషభట్టార్ సుదర్శనాచార్యులను ఆయన నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. –న్యూస్‌టుడే, హయత్‌నగర్

వసతిగృహాల బిల్లులు విడుదల చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న మహేశ్ తదితరులు

మూసారాంబాగ్, న్యూస్‌టుడే: ప్రభుత్వ వసతిగృహాల అద్దెలు, సిబ్బంది జీతాలు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే వాటిని విడుదల చేయాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కూరెళ్ల మహేశ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. సభ్యులు మేడి నాగరాజు, నిమ్మల సతీశ్, యోగేశ్ పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజల్లో జీఎస్ఐ సంస్థ అధికారులు, ఉద్యోగులు

బండ్లగూడ, న్యూస్‌టుడే: బండ్లగూడ జీఎస్ఐ సంస్థలో అమ్మవారి ఆలయంలో నూతనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధికారులు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు, యజ్ఞాలు, హోమాలు చేపట్టారు. సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎస్.డి.పట్నాయక్ మాట్లాడుతూ.. ఉద్యోగులను తల్లి చల్లగా చూడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. ఉద్యోగసంఘాల నేతలు మహేశ్, మధిర సత్యనారాయణ, పీసీ మాథ్యూ, చక్రేశ్వర్, స్వామి, చంద్రయ్య, సురేశ్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాల అమలు తగదు

ఎల్బీనగర్: నూతన పారిశ్రామిక విధానాలతో ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గంపై దోపిడీ అధికమైందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి అన్నారు. వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ వ్యవస్థాపక దినోత్సవ సందర్భంగా గురువారం ఆటో నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని విమర్శించారు. నేతలు ఎల్లయ్య, వీరయ్య వెంకన్న, మెట్టు లింగం, చంద్రశేఖర్, లింగస్వామి పాల్గొన్నారు.

'బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే'

ఖైరతాబాద్: లంబాడీలకు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం కల్పించాలని పలు గిరిజన సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటులో లంబాడీలు కీలక పాత్ర పోషించారని, ఇదే విషయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సభల్లో ప్రస్తావించారని గుర్తు చేశారు. దాదాపు 20 గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రత్యేకంగా టేబుల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి పనిచేసిన బంజారాలకు మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విభజించి, ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. తండా, గూడెం గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించాలని కోరారు. బంజారా భాష 'గోర్‌బోలి'ని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తిచేశారు. గిరిజన హక్కుల సాధనకు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తామన్నారు. మాజీ మంత్రి రవీంద్రనాయక్, గిరిజన శక్తి జాతీయ అధ్యక్షుడు డా.వెంకటేశ్‌చౌహాన్, రాష్ట్ర అధ్యక్షులు శరత్ పాల్గొన్నారు.

మాలమహానాడు సమావేశం 27న

హిమాయత్‌నగర్: నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 27న జరిగే మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని కార్యాలయంలో గురువారం పదాధికారుల సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ భవన్ పటిష్ఠ నిర్మాణంతో పాటు మాల భవన్ సాధన, ఎస్సీ ఎస్టీ చట్టం అమలు, హైడ్రా ఆధ్వర్యంలో దళితుల ఇళ్ల కూల్చివేత అంశాలపై చర్చిస్తామన్నారు. సంఘం రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జె.ఎన్.రావు, మాలమహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు భాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

నాగోలు, న్యూస్‌టుడే: కొత్తపేట డివిజన్ పరిధిలోని న్యూమారుతీనగర్, గౌడ్స్ కాలనీల్లో నూతనంగా చేపట్టిన సీసీ రహదారి నిర్మాణ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారిని పొడిగించాలని స్థానికులు కోరగా, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నేతలు రాజేశ్, వెంకట్‌రెడ్డి, ఉదయ్, స్థానికులు రాజు, సురేశ్, అంజయ్య పాల్గొన్నారు.

చెత్త పేరుకుపోయి ఇబ్బందులు

హయత్‌నగర్, న్యూస్‌టుడే: రాంకీ సంస్థ సిబ్బంది డంపింగ్ యార్డ్‌ల వద్ద చెత్తను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో స్థానికుల ఇబ్బందులను గురువారం డిప్యూటీ కమిషనర్ యాదయ్య దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులు, స్వచ్ఛ ఆటోల సంఖ్య పెంచి సమస్యను పరిష్కరించాలని కోరారు.

దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి

హయత్‌నగర్ న్యూస్‌టుడే: తట్టి అన్నారం పరిధిలోని కాలనీల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. తట్టి అన్నారంలోని 12 కాలనీలతో కూడిన సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పండుగల జయశ్రీ, వైస్ ఛైర్‌పర్సన్ చామ సంపూర్ణ రెడ్డి, కమిషనర్ రవీందర్‌రెడ్డి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో పూర్వవిద్యార్థుల ఆందోళన



నిరసనలో విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పది ఎకరాల స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జెఎన్ఏఎఫ్ఏయూ) కేటాయించొద్దని అంబేడ్కర్ వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు పరిపాలన భవనం ముందు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పూర్వ విద్యార్థుల సమాఖ్య అధ్యక్షుడు సాక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. భూ కేటాయింపు ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినదించారు. నిరసనకు యూనివర్సిటీ జేఏసీ, ఉద్యోగులు మద్దతు తెలిపారు. అంబేడ్కర్ యూనివర్సిటీ భూమిని వేరే వాళ్లకు కేటాయించడం అంటే ఉన్నత విద్యా వ్యాప్తిని, దూర విద్య విస్తరణను అడ్డుకోవడమేనని జాయింట్ యాక్షన్ కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, ఛైర్‌పర్సన్ ప్రొ.పల్లవి కాబ్డే, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.ఎల్వీకే రెడ్డి తదితరులు పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సమాఖ్య సెక్రటరీ డా.ఉదయిని, కార్యవర్గ సభ్యులు, అధ్యాపకేతర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల కోసం తవ్వి.. పునర్నిర్మాణం మరిచి..



సైదాబాద్ కాంతినగర్ కాలనీ రోడ్డు అధ్వానంగా మారింది. ఆనంద్ బిస్కెట్ ఫ్యాక్టరీ నుంచి మాతృశ్రీ ఇంజినీరింగ్ కళాశాల వైపు వెళ్లే మార్గంలో భూగర్భ పైపులైను పనుల కోసం తవ్వకాలు చేపట్టారు. పనులు పూర్తయినా.. రహదారి పునర్నిర్మాణ పనులు చేపట్టలేదు. ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, సైదాబాద్

పరిశుభ్రతే లక్ష్యం.. అవగాహనే ముఖ్యం

ముగిసిన 'స్వచ్ఛతా హీ సేవ'



మలక్‌పేటలో స్వచ్ఛ సంబురాల్లో బల్దియా అధికారులు, స్థానికులు

సైదాబాద్, న్యూస్‌టుడే: ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత సాధించేందుకు మలక్‌పేటలో విస్తృతంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2 వరకు బల్దియా కమిషనర్ ఆమ్రపాలి ఆదేశానుసారం పారిశుద్ధ్య అధికారులు నిత్యం ప్రత్యేక కార్యక్రమాల ద్వారా కాలనీ సంక్షేమ సంఘాలు, స్థానికులకు స్వచ్ఛత ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పక్షం రోజుల పాటు గతంలో చేపట్టిన అవగాహన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

కనిపించిన మార్పు..

కాలనీ, బస్తీ సంఘాల ప్రతినిధుల ద్వారా చేపట్టిన అవగాహన కార్యక్రమాలు కొంత మేరకు సత్ఫలితాలు ఇచ్చాయి. బల్దియా సర్కిల్-6 పరిధిలోని దాదాపు 200కుపైగా ప్రదేశాల్లో పరిశుభ్రత డ్రైవ్‌తో పాటు చెత్తను శుభ్రం చేశారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కామాటీలు ట్రైసైకిళ్లు, చక్రాల చెత్త డబ్బాల ద్వారా ఒక్క చోటుకు చేర్చారు. అనంతరం ప్రత్యేక వాహనం ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. చెత్త పడేయకుండా బహిరంగ ప్రదేశాల్లో ముగ్గులు వేసి పరిశుభ్రత ప్రాధాన్యం తెలియజేశారు. కాలనీ, బస్తీ సంఘాలకు చెందిన ప్రతినిధులు, విద్యార్థులతో స్వచ్ఛ ప్రతిజ్ఞలు చేయించారు. పాఠశాలల నుంచి కళాశాలల స్థాయిలో విద్యార్థులకు స్వచ్ఛత ఆవశ్యకతపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు సైతం ప్రదానం చేశారు. ఇంటింటికి తిరుగుతూ తడి, పొడి చెత్తను స్వచ్ఛ ఆటో రిక్షాలకు అందజేయాలని కోరారు.

సత్కారాలతో ప్రోత్సాహం..

అక్టోబరు 2న మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛ భారత్ దివస్ నిర్వహించారు. మెరుగైన సేవలందించిన పారిశుద్ధ్య సిబ్బందిని సన్మానించారు. డివిజన్ల వారీగీ ఉత్తమ శానిటేషన్ ఆటో డ్రైవర్లు, ఉత్తమ ఎస్ఎఫ్ఏ, ఉత్తమ కామాటీ, ఉత్తమ కార్మికులుగా ఎంపిక చేసి సత్కరించినట్లు మలక్‌పేట ఏఎంవోహెచ్ డాక్టర్ పిల్లి అనురాధ పేర్కొన్నారు. స్వచ్ఛత నిరంతరం ప్రక్రియ అని, అందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని అధికారులు పేర్కొన్నారు.

రోడ్డుపై గుంత.. ప్రయాణికుల చింత



నానల్‌నగర్-రేతిబౌలి ప్రధాన రహదారిలో విద్యుత్ కార్యాలయానికి ఎదురుగా(మిలటరీ వైపు) రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత వాహనదారుల సహనాన్ని పరీక్షిస్తోంది. దానికితోడు పై ప్రాంతాల నుంచి వచ్చే వరదతో గుంత నిండిపోయింది. ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మెహిదీపట్నం

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం అభినందనీయం



ప్రొ.విజ్ఞులతకు చెక్కు అందజేస్తున్న విశ్రాంత ఆచార్యులు ప్రొ.ఎల్.నలంద శారద, చిత్రంలో ప్రత్యేక అధికారి సరస్వతమ్మ

సుల్తాన్‌బజార్: ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకు రావడం అభినందనీయమని కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం (టీఎంవీ) ఇన్‌ఛార్జి వీసీ ప్రొ.విజ్ఞులత పేర్కొన్నారు. విశ్రాంత ఆచార్యురాలు ప్రొ.ఎల్.నలంద శారద రసాయనశాస్త్ర విభాగానికి చెందిన మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏటా బంగారు పతకం అందజేసేందుకు ముందుకొచ్చారు. ప్రొ.నలంద శారద దంపతులు ప్రొ.విజ్ఞులతను కలిసి చెక్కు అందజేశారు. ప్రత్యేక అధికారి ప్రొ.సరస్వతమ్మ పాల్గొన్నారు.

కార్పొరేటుకు దీటుగా ఉస్మానియాలో వైద్య సేవలు



డా.రాకేశ్ సహాయ్, సూపరింటెండెంట్, ఉస్మానియా ఆసుపత్రి

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: కార్పొరేటుకు దీటుగా ఉస్మానియాలో పేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రాకేశ్ సహాయ్ పేర్కొన్నారు. గురువారం దవాఖానాలో విలేకరులతో మాట్లాడారు. రెండు నెలలుగా ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించి దస్త్రాలను పరిష్కరించామన్నారు. ఓపీ(అవుట్ పేషంట్), ఇన్‌పేషెంట్ల రద్దీ ఇటీవల పెరిగిందన్నారు. స్థలాభావ సమస్య ఉన్నా.. ఎక్కువ మంది రోగులకు సేవలు అందజేస్తున్నట్లు చెప్పారు. గోషామహల్ పోలీసు స్టేడియంలో నూతన భవనం నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు. కొత్త విభాగాలు అందుబాటులోకి వస్తుంటడంతో ఉస్మానియా కొత్త భవనంలో సుమారు 2000 మంది ఇన్‌పేషెంట్లకు చికిత్స చేసే అవకాశం ఉంటుందన్నారు. ఎమర్జెన్సీ మెడిసిన్, ట్రామాకేర్ కేంద్రాలను అందుబాటులోకి తేవడం వల్ల జాప్యానికి తావులేకుండా అన్ని విభాగాల సమన్వయంతో శస్త్ర చికిత్స చేసే అవకాశం ఉంటుందన్నారు. ఓపీ భవనం 100 నంబరు గదిలో పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కులీకుతుబ్‌షా భవనం వద్ద శాశ్వత నిర్మాణానికి అనువైన స్థలం గుర్తించామన్నారు. కులీకుతుబ్‌షా భవనంలోని లిఫ్టు అడుగు భాగంలో నీరు వచ్చి చేరుతున్నట్లు గుర్తించామని.. మరమ్మతులు చేయాలని టీఎస్ఎంఐడీసీ అధికారులకు లేఖ రాస్తామన్నారు. వివిధ పరీక్షల నివేదికల్లో జాప్యాన్ని అధిగమించేందుకు కృషి చేస్తున్నామన్నారు. తొమ్మిది కౌంటర్లలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.

దంత వైద్యశాల కిటకిట

న్యూస్‌టుడే, ఉస్మానియా ఆసుపత్రి



చికిత్స పొందుతున్న రోగులు

రాష్ట్రంలోనే ఏకైక ఉస్మానియా ప్రభుత్వ దంత వైద్యశాలకు రోగుల తాకిడి అధికమైంది. చిన్నారులు, వృద్ధులు, మధుమేహ రోగులతో రద్దీ నెలకొంది. సాధారణ రోగులతో పాటు ప్రభుత్వ, విశ్రాంత ఉద్యోగులు, పింఛనుదారులతో నిత్యం కిక్కిరిసిపోతోంది. ఉస్మానియా దంత వైద్యశాల, బోధనాసుపత్రికి అనుబంధంగా ఇది కొనసాగుతోంది. పుచ్చిపోయిన పళ్లు, పుట్టుకతో వచ్చే వంకర దంతాలు, వృద్ధాప్యం, మధుమేహం కారణంగా ఊడిపోయిన దంత రోగులు ఈ ధర్మాసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. ఈ దంత వైద్య కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఎంతో మంది ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో స్థిరపడ్డారు. ఈ కళాశాలలో ఎక్కువ శాతం మంది యువతులే దంత వైద్య విద్య అభ్యసించడం విశేషం. పురుషులు కేవలం 20 శాతం మాత్రమే ఉండగా 80 శాతానికి పైగా యువతులు ఉన్నారు. ఇక్కడ చదువుకున్న పూర్వ విద్యార్థులే ప్రస్తుతం ఆయా విగాల అధిపతులుగా సేవలందిస్తున్నారు. దంత రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రిన్సిపల్ డా.ఎస్.ఎస్.యాదవ్ తెలిపారు.



డా.ఎస్.ఎస్.యాదవ్, ప్రిన్సిపల్, ఉస్మానియా దంతవైద్య కళాశాల

విరిగిపోయిన దంతాల స్థానంలో..

రోడ్డు ప్రమాదాల్లో దవడ ఎముకలు, దంతాలు విరిగిపోయిన రోగులకు ఉస్మానియాలోని జనరల్ సర్జరీ విభాగం వైద్యుల సమన్వయంతో డెంటల్ సర్జరీ వైద్యులు సేవలందిస్తున్నారు. విరిగిపోయిన దంతాలను తొలగించి వాటి స్థానంలో కృత్రిమ దంతాలు అమర్చుతున్నారు. కార్పొరేటు ఆసుపత్రుల్లో ఎంతో ఖర్చుతో కూడుకున్న దంత వైద్యం ఇక్కడ పేద రోగులకు పూర్తి ఉచితం. 50 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన

- ఆసుపత్రిలో రూ.80 లక్షల విలువైన కృత్రిమ దంతాలు తయారు చేసి అమర్చే సిరామిక్ ల్యాబ్ అందుబాటులోకి వచ్చింది.
- ఓపీ సమయం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు..
- అవుట్ పేషంట్లు నిత్యం సుమారు 800 మంది
- 8 విభాగాల్లో నిష్ణాతులైన ప్రొఫెసర్లు దంత రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.



చేమంతి పూలు... చెత్తపాలు

గత 15 రోజులుగా గిరాకీ లేక వెలవెలబోయిన గుడిమల్కాపూర్ పూల మార్కెట్ ఎంగిలిపూల బతుకమ్మ, శరన్నవరాత్రుల నేపథ్యంలో రెండు రోజులుగా కిక్కిరిసి పోయింది. నగర శివారు ప్రాంతాలు, రంగారెడ్డి జిల్లాతో పాటు, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 700-800 టన్నుల బంతి, చేమంతి పూలు దిగుమతి అయ్యాయి. రైతులు విక్రయించగా మిగిలిపోయిన పూలను పారబోసి పోయారని కమీషన్ ఏజెంట్లు చెప్పారు. అవి 100 టన్నుల కంటే ఎక్కువగానే ఉంటాయని తెలిపారు. – న్యూస్‌టుడే, మెహిదీపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

సుల్తాన్‌బజార్, ఉస్మానియా ఆసుపత్రి, కంచన్‌బాగ్, న్యూస్‌టుడే

? నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే కోఠి ఉమెన్స్ కళాశాల బస్టాప్ ఆవరణలో రోడ్డు గుంతలమయంగా మారి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరమ్మతులు చేపట్టాలి.
– గణేశ్‌కుమార్, ప్రైవేటు ఉద్యోగి, దిల్‌సుఖ్‌నగర్

✓ సమస్యను జీఎంహెచ్‌సీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మరమ్మతులు చేయిస్తాం. – విజయ్‌కుమార్, మేనేజర్, మిధాని డిపో

? ఉస్మానియా మార్చురీలో నుంచి విపరీతమైన దుర్వాసన వ్యాపిస్తోంది. మార్చురీ వెనక వైపు బేగంబజార్ నుంచి అఫ్జల్‌గంజ్ వైపు వెళ్లే వాహనదారులు, పాదచారులు దుర్వాసన భరించలేక ముక్కుమూసుకొని వెళ్తున్నారు. – వీజీ పురుశోత్తం, మాజీ వార్డు కమిటీ సభ్యుడు, బేగంబజార్

✓ మార్చురీ ఆధునికీకరణ పనులు సాగుతున్నాయి. శవాలను భద్రపర్చేందుకు ఇటీవలే కొత్తగా పది డీఫ్రిజ్ బాక్సులు అందుబాటులోకి వచ్చాయి. దుర్వాసన వ్యాప్తి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.– డా.రాకేశ్ సహాయ్, సూపరింటెండెంట్, ఉస్మానియా ఆసుపత్రి

? మిధాని-బాలాపూర్ మార్గంలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. అంధకారం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
– గుణశేఖర్, బాలాపూర్

✓ క్షేత్రస్థాయిలో పరిశీలించి వెలిగేందుకు చర్యలు తీసుకుంటాం.
– సత్తిరెడ్డి, వీధి దీపాల విభాగం అధికారి, చాంద్రాయణగుట్ట

హైకోర్టులో వైద్య శిబిరం నేడు

ఉస్మానియా ఆసుపత్రి, న్యూస్‌టుడే: నిర్మాణ్ సంస్థ, తెలంగాణ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హైకోర్టులో మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఉస్మానియా సూపరింటెండెంట్ డా.రాకేశ్ సహాయ్ తెలిపారు. గురువారం ఆసుపత్రిలోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి సన్మానం



అబిడ్స్, న్యూస్‌టుడే: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో గురువారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ (టిల్లూ యాదవ్)తో కలిసి గ్రేటర్ దళిత గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ధన్‌రాజ్ మాదిగ సత్కరించారు. టి.సతీశ్, బండ అశోక్ తదితరులు ఉన్నారు.

న్యాయవాదిపై దాడి అమానుషం

కో-ఆపరేటివ్ ట్రైబ్యునల్ అడ్వొకేట్స్ అసోసియేషన్

ఈనాడు, హైదరాబాద్: సిటీ సివిల్ కోర్టు న్యాయవాది అబ్దుల్ కలీంపై మాదన్నపేట్ పోలీసులు విచక్షణా రహితంగా దాడి చేసినందుకు నిరసనగా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాదిపై దాడికి దిగడం అమానుషమని, దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని కోఆపరేటివ్ ట్రైబ్యునల్ అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ దివాకర్ డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా మాదన్నపేట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన కలీంను దూషించిన పోలీసులు, కొట్టుకుంటూ తీసుకెళ్లారని, విచక్షణా రహితంగా కొట్టడంతో అతను స్పృహ తప్పి పడిపోయాడన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

మంత్రి పొంగులేటి ఇంట్లో ఏం దొరికిందో ఈడీ బహిర్గతం చేయాలి: దాసోజు

ఫిల్మ్‌నగర్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఏం దొరికిందో ఈడీ ప్రజలకు చెప్పాలని భారాస నాయకుడు దాసోజు శ్రవన్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నంబర్-2గా చెలామణి అవుతున్న మంత్రి ఇంట్లో రూ.1600కోట్లు, పెద్దఎత్తున బంగారం దొరికినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగిందన్నారు. హైడ్రా విషయంలో హైకోర్టు హెచ్చరించినా సీఎం రేవంత్‌రెడ్డి ఆర్డినెన్స్ తెచ్చారన్నారు.

ఎనిమల్ కీపర్లు అప్రమత్తంగా ఉండాలి

చార్మినార్, న్యూస్‌టుడే: జంతువుల ఎన్‌క్లోజర్ల వద్ద ఎనిమల్ కీపర్లు అప్రమత్తంగా ఉండాలని నెహ్రూ జూపార్కు విశ్రాంత క్యూరేటర్ కె.శేఖర్‌రెడ్డి సూచించారు. గురువారం జూపార్కులో ఏర్పాటు చేసిన వన్యప్రాణి సప్తాహలో ఆయన పాల్గొన్నారు. డిప్యూటీ క్యూరేటర్ ఎం.బర్నోబా, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ డా.ఎం.ఎ.హకీం, అసిస్టెంట్ క్యూరేటర్ అమృత, జూ ఎడ్యుకేషన్ అధికారులు హెచ్.ఎం.హనీపుల్లా, దీపక్‌తరుణ్ పాల్గొన్నారు.

గూగుల్ రేటింగ్ టాస్కులని.. రూ.1.90 లక్షల మోసం

నారాయణగూడ, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో టాస్కులను పూర్తి చేస్తూ సంపాదించుకోండి అని నమ్మించి నగదు స్వాహా చేశారంటూ బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ విద్యార్థికి 'ఆన్‌లైన్ గూగుల్ రేటింగ్ టాస్కు'కు సంబంధించిన సందేశం వచ్చింది. రోజువారీగా గూగుల్‌లో తాము సూచించే అంశాలకు రేటింగ్ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి, బాధితుడికి నేరస్థుడు టెలిగ్రామ్ గ్రూప్‌లో సభ్యత్వం ఇప్పించాడు. కొంత పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు ఇస్తామని నమ్మించారు. మరీ ఎక్కువ సంపాదించాలంటే బిట్‌కాయిన్ కోసం ప్రత్యేక ఖాతా సృష్టించాలన్నాడు. అలా బాధితుడు విడతల వారీగా రూ.1.90 లక్షలు చెల్లించేశారు. ఆ తర్వాత నేరస్థుడు అందుబాటులో లేకుండా పోయాడు.

పార్సిల్ డెలివరీకి.. చిరునామా కావాలని..

నారాయణగూడ: పార్సిల్ డెలివరీకి సరైన చిరునామా కావాలని నమ్మించి నగదు దోచేశారని బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ ఠాణాలో గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మహిళకు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. మీకు సంబంధించిన ఒక ప్యాకేజీ (పార్సిల్) హోల్డ్‌లో ఉందని, అది మీకు అందించడానికి కొత్త చిరునామా అవసరమని ఎస్ఎంఎస్ వచ్చింది. డెలివరీ చిరునామా అందించడానికి ఎస్ఎంఎస్ ద్వారా యూఆర్ఎల్ లింక్ పంపించాడు. బాధితురాలు దానిపై క్లిక్ చేసి, తన ప్రస్తుత చిరునామాతో పాటు క్రెడిట్ కార్డు వివరాలను నమోదు చేశారు. నేరస్థుడు రీ డెలివరీకి రూ.25 చెల్లించాలన్నాడు. కొద్దిసేపటి తర్వాత ఆమె క్రెడిట్ కార్డు ద్వారా రూ.2.43 లక్షలు లావాదేవీ జరిగినట్లు సందేశం వచ్చింది. బాధితురాలు వెంటనే తన క్రెడిట్ కార్డును బ్లాక్ చేసి, జరిగిన మోసంపై పోలీసులను ఆశ్రయించారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

బేగంబజార్: గుర్తు తెలియని వృద్ధుడి(60) మృతదేహాన్ని అఫ్జల్‌గంజ్ పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీలో భద్రపర్చారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి ఒంటిపై గాయాలు లేవు. సంబంధీకులు ఉంటే సంప్రదించాలని సూచించారు.

ఇద్దరి అదృశ్యం



రామ్‌నారాయణ్



శ్రీనాథ్‌వ్యాస్

ధూల్‌పేట: ఇద్దరు అదృశ్యమైన ఘటనలు మంగళ్‌హాట్ ఠాణా పరిధిలో జరిగాయి. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అప్పర్ ధూల్‌పేట శివలాల్‌నగర్‌కు చెందిన రామ్‌నారాయణ్(60) గత నెల 22న రాత్రి 10 గంటలకు ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. సీఐ మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీతారాంపేటకు చెందిన శ్రీనాథ్‌వ్యాస్(39) గత నెల 26న అదృశ్యమయ్యారు.



పద్మనాభనగర్‌కాలనీ గణపతి దేవాలయంలో..



మెహిదీపట్నం పుష్పగిరి మహా సంస్థానంలో..



న్యూగంగానగర్ కనకదుర్గమ్మ గుడిలో..



రాంకోఠి మహాకాళి ఆలయంలో..



లాల్‌దర్వాజా మహంకాళి మాత



ఉప్పుగూడ మహంకాళి



సుల్తాన్‌షాహి జగదాంబిక



చార్మినార్ భాగ్యలక్ష్మీ మాత



లలితాబాగ్ జమ్మిచెట్టు దుర్గామాత

దుర్గామాత.. అభయ ప్రదాత

పాతనగరంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలను వేద మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దేవాలయాల్లో సైతం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.
– న్యూస్‌టుడే, బృందం

వైభవంగా 'మహాకుంభాభిషేక మహోత్సవం'

కేశవగిరి, న్యూస్‌టుడే: చాంద్రాయణగుట్టపై కొలువుదీరిన భ్రమరాంబదేవి సమేత చెన్నమల్లికార్జునస్వామి దేవస్థానంలో 'మహాకుంభాభిషేక మహోత్సవం' వైభవంగా ప్రారంభమైంది. 35 మంది బ్రాహ్మణులతో శైవాగమ మోక్తముగా, నవాహ్నిక దీక్షతో, శాస్త్రోక్తంగా పూజలకు అంకురార్పణ చేశారు. ఆలయ అర్చకులు కోటి హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో గోపూజ, కలశస్థాపనలు, అభిషేకం, గణపతిహోమం, నవగ్రహ హోమం, సుబ్రహ్మణ్యహోమం, రుద్రహోమం చండీహోమం భక్తిప్రపత్తులతో చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.



ఆలయంలో పూజలకు అంకురార్పణ చేస్తున్న పండితులు

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

మెహిదీపట్నం: (గురువారం నాటి ధరలు కిలో రూ.లో) టమాటా 63, వంకాయ 35, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, కాకరకాయ 45, , బీరకాయ 38, క్యాబేజీ 19, బీన్స్ 95, క్యారట్ 43, దొండ 45, చిక్కుడుకాయ 50, గోకరకాయ 40, బీట్‌రూట్ 25, క్యాప్సికం 70, ఆలుగడ్డ 38, కీర 21, దోసకాయ 28, సొరకాయ 17, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 50, చామగడ్డ 35.

మురుగు సమస్యకు పరిష్కారం



కేశవస్వామినగర్‌లో కార్పొరేటర్ దర్శన్, జలమండలి మేనేజర్ సత్యనారాయణ

జియాగూడ, న్యూస్‌టుడే: అడుగంటిపోతున్న భూగర్భ జలాల శాతాన్ని పెంచడంతో పాటు మురుగు సమస్య పరిష్కారానికి జలమండలి, సీవరేజీ విభాగం అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టడం శుభపరిణామమని కార్పొరేటర్ బోహిని దర్శన్ పేర్కొన్నారు. జలమండలి సీవరేజి విభాగం జియాగూడ సెక్షన్ మేనేజర్ సత్యనారాయణ నేతృత్వంలో కేశవస్వామి నగర్‌లో సీవరేజీ ఓవర్‌ఫ్లో ఫ్రీసిటీ- భూగర్భజలాలు పెంచడమే లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. మురుగునీటి లీకేజీలు, పూడిక వ్యర్థాల తొలగింపు కోసం 90 రోజుల పాటు జలమండలి అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లనున్నారని వివరించారు. భాజపా నేతలు నర్సింహులు, రాజేందర్, తెదేపా నేత నర్సింగ్‌రావు, జలమండలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

27న మాలమహానాడు కార్యవర్గ సమావేశం

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 27న జరిగే మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు పిలుపునిచ్చారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని సంస్థ కేంద్ర కార్యాలయంలో పదాధికారుల సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్, ఉప ప్రణాళిక నిధులు, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ భవన్ పటిష్ఠ నిర్మాణంతో పాటు మాల భవన్ సాధన, ఎస్సీ ఎస్టీ చట్టం అమలు, హైడ్రా ఆధ్వర్యంలో దళితుల ఇళ్ల కూల్చివేత అంశాలపై సమావేశంలో చర్చిస్తామన్నారు.

అక్రమంగా మద్యం విక్రయం.. ఇద్దరి అరెస్టు

గోషామహల్, న్యూస్‌టుడే: గాంధీ జయంతి రోజున మద్యం అమ్మకాలపై నిషేధం ఉండగా.. అక్రమంగా విక్రయించిన ఇద్దరిని షాయినాయత్‌గంజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఐ బాలుచౌహాన్ ఆధ్వర్యంలో ఎస్సై లక్ష్మయ్య, బృందం కలిసి నిర్వహించిన దాడుల్లో సాయినగర్‌లో సుర్యవంశీ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. రూ.13300, రూ.8,170 విలువ చేసే 54 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై గతంలోనూ మద్యం అక్రమ విక్రయాలకు సంబంధించి రెండు కేసులు ఉండగా.. ఇది మూడోది కావడంతో రిమాండ్‌కు తరలించారు. మంగళ్‌హాట్ దిలావర్‌గంజ్‌కు చెందిన వీర్‌సింగ్ అక్రమంగా మద్యం తరలిస్తుండగా జుమ్మేరాత్‌బజార్ రహదారిపై పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.6,675 విలువైన 45 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

న్యాయవాదుల విధుల బహిష్కరణ



ఉప్పర్‌పల్లి కోర్టు ముందు న్యాయవాదుల నిరసన

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: న్యాయవాదిపై పోలీసుల దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. మూసీ నిర్వాసితులకు కేటాయించిన ఇళ్లను గత ప్రభుత్వం ఇతరులకు కేటాయించిందని న్యాయవాది కలీం కోర్టుకెళ్లారు. ఈ నేపథ్యంలో మాదన్నపేట పోలీసులు ఆయనపై దాడికి పాల్పడ్డారని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఇటీవల న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయన్నారు. సంబంధిత పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు ఎల్.శ్రీధర్‌రెడ్డి, వెంకటేశ్, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మరో ఇద్దరికి డబుల్ ఇళ్లు

రాజేంద్రనగర్: మూసీ రివర్‌బెడ్‌లో ఇళ్లు ఖాళీ చేయడానికి మరో రెండు కుటుంబాలు ముందుకు వచ్చాయని రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ రాములు తెలిపారు. ఆ కుటుంబాలకు గురువారం రెండు పడకగదుల ఇళ్లను కేటాయించినట్లు చెప్పారు. మూసీ నిర్వాసితులకు కేటాయించే రెండు పడక గదుల ఇళ్లను కేటాయించనున్న నేపథ్యంలో అక్కడ మౌలిక వసతుల కల్పనకు ఆర్డీవో వెంకట్‌రెడ్డి దృష్టి సారించారు.

మూసీ రివర్ బెడ్‌లోని నిర్మాణదారులకు అవగాహన



నిర్వాసితులతో మాట్లాడుతున్న అధికారులు

అత్తాపూర్, న్యూస్‌టుడే: మూసీ రివర్‌బెడ్‌లో గుర్తించిన నిర్మాణాలను స్వచ్ఛందంగా ఖాళీ చేయించడానికి రాజేంద్రనగర్ రెవెన్యూ అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. గురువారం తహసీల్దార్ రాములు రాజేంద్రనగర్ పరిధిలోకి వచ్చే మూసీ పరివాహక ప్రాంతంలో జియాగూడ దగ్గర పలు ఇళ్లలోని యజమానులకు పరిస్థితిని వివరించారు. ఇళ్లు ఖాళీ చేసి వెళ్తే రెండుపడక గదుల ఇంటితో పాటు రూ.25 వేల సాయం చేస్తున్నామన్నారు. మూసీలో ఉండే అసౌకర్యాలను వారికి వివరించారు. చాలామంది ఇళ్లు ఖాళీ చేయడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నారని తహసీల్దార్ తెలిపారు. దసరా నేపథ్యంలో కొంతమంది అమ్మవారిని ప్రతిష్ఠించారని, నవరాత్రులు ముగిశాక ఖాళీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాంటి వారి వివరాలను అధికారులు సేకరించారు.

కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే పకడ్బందీగా చేయాలి: కలెక్టర్



పెద్దతూప్ర తండాలో పరిశీలిస్తున్న శశాంక

శంషాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డుల సర్వేను క్షేత్ర స్థాయిలో పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలం పెద్ద తూప్ర తండాలో గురువారం ప్రయోగాత్మకంగా ప్రారంభించిన ఈ సర్వే కార్యక్రమాన్ని ఆర్డీవో కె.వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. తండాలో మొత్తం ఎన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయో పక్కాగా వివరాలు సేకరించి ఈ నెల 7లోపు ప్రభుత్వానికి నివేదిక అందజేయాలన్నారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో సర్వేలో పాల్గొనాలని సూచించారు. పెద్దతూప్ర తండాలో కుటుంబ డిజిటల్ కార్డుల సర్వే విజయవంతంగా పూర్తయ్యాక జిల్లా పరిధిలో అన్ని కుటుంబాలకు డిజిటల్ కార్డులు అందజేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ దత్తు, ఎండీవో మున్ని, ఎంపీవో ఉష తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్:	8008573330
శంకర్‌పల్లి:	8008573266
షాద్‌నగర్:	8008573907
శంషాబాద్:	9963096353

షాద్‌నగర్, కొందుర్గు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని చటాన్‌పల్లి రాంనగర్‌లో చైతన్య పాఠశాల ముందు రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. వర్షానికి బురదమయమై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. -ఎం.ఎ.పాషా, రాంనగర్, షాద్‌నగర్

✓ రహదారి సమస్యను వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి పరిష్కరిస్తాం. త్వరలో కాలువ, రహదారి నిర్మాణం చేసి శాశ్వతంగా పరిష్కరిస్తాం. - కొందూటి నరేందర్, పురపాలిక ఛైర్మన్

? మండల కేంద్రంలోని కుమ్మరి కాలనీలో చెత్త రోజురోజుకూ పేరుకుపోతోంది. దీంతో దోమల బెడద అధికమై రోగాలు సోకే అవకాశం ఉంది. –నరేశ్, కొందుర్గు

✓ కాలనీలో పేరుకుపోయిన చెత్తను త్వరలోనే తొలగిస్తాం. –ఎంపీవో లాలయ్య కొందుర్గు

మూసీ గర్భంలో నిర్మాణాలు 354

● లెక్కతేల్చిన రాజేంద్రనగర్ అధికారులు ● నివాసితులను ఒప్పించి తరలించేందుకు యత్నం

నివాసాలు	176
వ్యాపార సంబంధమున్నవి	118
ప్రభుత్వ నిర్మాణాలు	13
ప్రార్థన మందిరాలు	30
శ్మశాన వాటికలు	17
ఇప్పటి వరకు ఖాళీ చేసిన నివాసితులు	25
రెండు పడకల గదులు కేటాయించింది	(జియాగూడ-17), (నార్సింగి-8)

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని గండిపేట, రాజేంద్రనగర్ మండలాల పరిధిలో మూసీ నదిలో నిర్మించిన నిర్మాణాల లెక్కను అధికారులు తేల్చారు. ప్రస్తుతానికి నది గర్భంలో నిర్మించిన వాటినే లెక్కించారు. వాటిని తొలగించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. బలవంతంగా కాకుండా ఇళ్లు నిర్మించుకొని ఉన్న వారికి రెండు పడకగదుల ఇళ్లను కేటాయించడంతో పాటు రూ.25 వేల ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు 25 మంది స్వచ్ఛందంగా ఖాళీ చేసి జియాగూడ, నార్సింగిలోని రెండు పడకగదుల ఇళ్లలోకి వెళ్లిపోయారు.

స్పష్టత లేకే ఆందోళన.. మూసీ నిర్వాసితుల విషయంలో అధికారులు బాధితులకు సరైన అవగాహన కల్పించడంలో విఫలమయ్యారు. మందీమార్బలంతో వెళ్లి బఫర్‌జోన్ సర్వే చేపట్టడంతో అసలు గందరగోళం ప్రారంభమైంది. నగరంలో ఇప్పటికే చెరువుల్లో నిర్మించిన ఇళ్లను హైడ్రా కూలుస్తున్న తరుణంలో బఫర్‌జోన్‌లో ఉన్న తమ ఇళ్లను కూడా అలాగే కూల్చుతారనే ఆందోళనలో మూసీ బాధితులు పడిపోయారు. వాస్తవానికి హైడ్రాకు, మూసీ సర్వేకు ఎలాంటి సంబంధం లేదని చెబుతున్నా సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు, కొన్ని ప్రతిపక్ష పార్టీల నాయకుల వైఖరితో ఈ పరిస్థితి తలెత్తిందని, ఈ నిర్మాణాలపై నిర్లక్ష్యం వహిస్తే ఏదో ఒకరోజు భారీ వరదలు వచ్చి అవన్నీ మునిగిపోయే ప్రమాదం ఉంది. అప్పుడే ప్రభుత్వం ఉన్నా చెడ్డపేరు వస్తుందని ఓ ఉన్నతాధికారి 'న్యూస్‌టుడే'తో అన్నారు. వాటి పట్ల నిర్లక్ష్యం వహించి ప్రాణాలు పోయాక ప్రభుత్వాలను, అధికారులను నిందించడం సబబు కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



సర్వే నిర్వహిస్తున్న అధికారులు (పాత చిత్రం)

బఫర్‌జోన్‌పై నిర్ణయం తీసుకోలేదు.. మూసీ బఫర్ జోన్‌లో నిర్మాణాలపై ఎలాంటి ఆదేశాలు అందలేదని ఓ అధికారి తెలిపారు. అది ఎంతవరకు వస్తుందనే విషయం తేల్చడానికే సర్వే నిర్వహించారన్నారు. బఫర్‌జోన్‌లో చేపట్టిన నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు ఉన్నాయని, అలాంటి వాటిని తొలగించడానికి ముందే ప్రభుత్వం వారికి న్యాయంజరిగేలా నిర్ణయం తీసుకొటుందని ఆ అధికారి వివరించారు. అప్పటివరకు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వదంతులను నమ్మకుండా ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలని సూచించారు.

మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం అండ: ప్రకాష్‌గౌడ్



ఎమ్మెల్యే చేతుల మీదుగా బంగారు నగ అందజేస్తూ..

బండ్లగూడజాగీర్: మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ స్పష్టం చేశారు. నిర్వాసితులను కొంతమంది రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, వారి మాటలను నమ్మొద్దని సూచించారు. గురువారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ 'న్యూస్‌టుడే'తో ప్రత్యేకంగా మాట్లాడారు. మూసీ నిర్వాసితులకు పునరావసం కల్పించాకే తరలిస్తామని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదన్నారు. రాజకీయాల కోసం మూసీ నిర్వాసితులను పావులుగా వాడుకుంటున్నారని, కానీ వారి మాటలను ఎవరూ నమ్మే స్థితిలో లేరని చెప్పారు. బాధితులకు ఇంటి స్థలాలు, రెండు పడకగదుల ఇళ్లు, ఇందిరమ్మ పథకంలో ఇంటి నిర్మాణం చేసి ఇవ్వనుందని చెప్పారు. నియోజకవర్గం పరిధిలోకి వచ్చే మూసీ నిర్వాసితుల సమస్యలను ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో ప్రత్యేకంగా చర్చించానన్నారు. బాధిత నివాసితులు ఏళ్లుగా మూసీ ఒడ్డున జీవిస్తూ అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, వారికి మంచి జీవితం ఇవ్వాలనే తలంపుతోనే ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించిందన్నారు. పునరావాస బాధితులకు అండగా నిలవాల్సిన రాజకీయ పార్టీలు నీచానికి దిగజారాయాని మండిపడ్డారు.

బంగారు మైసమ్మకు ఆభరణం బహూకరణ

కాటేదాన్: కాటేదాన్ గణేష్‌నగర్‌లో కొలువైన మైసమ్మకు బంగారు మైసమ్మ వైన్స్ వ్యాపారులు 4 తులాలతో స్వర్ణాభరణం చేయించారు. గురువారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ చేతుల మీదుగా నగను ఆలయంలో అందజేశారు. కార్యక్రమంలో జయప్రకాష్, తిరుమల వెంకటేష్‌గౌడ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెండు పడకగదుల ఇళ్ల రోడ్డుపై మురుగు



నార్సింగి, న్యూస్‌టుడే: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రెండు పడకగదుల ఇళ్ల పరిసరాల్లో డ్రైనేజి సమస్య తీవ్రంగా ఉంది. ఇక్కడ నిర్మించిన సుమారు 180 రెండు పడకగదుల గృహసముదాయానికి సంబంధించి ఇళ్లను లబ్ధిదారులకు ఎనిమిది నెలల క్రితమే అప్పగించారు. ఇళ్లలో చిన్నచిన్న పనులు మిగిలి ఉండటంతో అవి చేయించుకుని ఇటీవల ఇళ్లలోకి చేరుతున్నారు. గృహసముదాయంలోకి వెళ్లే రహదారిలో మురుగు ఓవర్‌ఫ్లో అవుతుండడంతో నివాసితులకు ఇబ్బందికరంగా మారింది. మురుగు కారణంగా దోమలు సమస్య ఏర్పడుతోందని, ఇళ్లలోకి వెళ్లాలన్నా, బయటికి వెళ్లాలన్నా మురుగులోంచే వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ క్రిష్ణమోహన్‌రెడ్డిని వివరణ కోరగా.. శుక్రవారం పరిశీలించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

హైడ్రాను అడ్డుకునేందుకు భారాస కుట్ర: కాంగ్రెస్

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ఆక్రమణలను నిర్మూలించి హైదరాబాద్‌ను సుందరీకరించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను భారాస నాయకులు అడ్డుకునేందుకు కుట్ర పన్నుతున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. షాద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ పి.రఘు, పీసీసీ సభ్యుడు బాబర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంద్రాతి బాలరాజుగౌడ్‌లు మాట్లాడుతూ.. గతంలో చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చింది భారాస సర్కారేనని ఆరోపించారు. ఆ తర్వాత ప్రజల్లో వ్యతిరేకత వచ్చేసరికి కూలుస్తామని సీఎం హోదాలో కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పుడు అదేపనిని కాంగ్రెస్ చేస్తుంటే తమ నేతలు, కార్యకర్తలతో కలిసి నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. హైడ్రా విషయంలో నష్టపోయిన పేద, మధ్య తరగతి వర్గాలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

చేవెళ్లలో విద్యా సదస్సు రేపు

చేవెళ్ల, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం చేవెళ్లలోని పద్మావతి కన్వెన్షన్‌లో 'తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలనలో ఉపాధ్యాయుల పాత్ర' అంశంపై విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలె యాదయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయులందరూ హాజరు కావాలని కోరారు. సదస్సు అనంతరం ఉపాధ్యాయులకు సన్మానం ఉంటుందని చెప్పారు. గురువారం సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లను పార్టీ నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి ఆయన పరిశీలించారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

నందిగామ, న్యూస్‌టుడే: పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పీహెచ్‌సీ వైద్యురాలు స్రవంతి అన్నారు. నందిగామ మండలం మోత్కులగూడలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యురాలు స్రవంతి గ్రామస్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

దానగుణం గొప్ప వరం: అంజయ్యయాదవ్




చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

కేశంపేట, న్యూస్‌టుడే: సంపద ఎంత ఉన్నా దానగుణం ఉండటం మనిషికి గొప్ప వరమని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మనం చేసే సహాయం ద్వారా పేదల కళ్లల్లో కనిపించే ఆనందం మనసుకు సంతృప్తి ఇస్తుందన్నారు. కొండారెడ్డిపల్లిలో యువనాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ దసరా కానుకగా మహిళకు గురువారం ఉచితంగా చీరల పంపిణీ చేపట్టారు. దీనికి ముఖ్య అతిథిగా వచ్చిన అంజయ్యయాదవ్‌తో కలిసి ఆయన ఆడపడచులకు స్వయంగా చీరలు అందజేశారు. కార్యక్రమంలో భారాస నాయకులు పల్లె నర్సింగ్‌రావు, జగన్మోహన్ రెడ్డి, దశరథ, ఈట గణేశ్, మురళీధర్‌రెడ్డి, లక్ష్మీనారాయణగౌడ్, జగదీశ్వర్‌గౌడ్, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని వినతి

మణికొండ, న్యూస్‌టుడే: నిబంధనలు ఉల్లంఘించి అక్రమంగా చేపట్టిన అపార్ట్‌మెంట్ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని మణికొండ పుప్పాలగూడలోని స్కైలా రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు సి.వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఆర్.మహేష్‌చందర్‌రెడ్డిలు గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. స్కైలా గేటెడ్ కమ్యూనిటీ పక్కన 20 అడుగుల రోడ్డును ఆక్రమించి మరీ ఓ బిల్డర్ అపార్ట్‌మెంట్‌ను నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జితేందర్ తదితరులున్నారు.



అడ్డు తొలగించరు.. సమస్య తీర్చరు

కేశంపేట మండల కేంద్రంలో విద్యుత్తు సబ్‌స్టేషన్ పక్కనే ఉన్న కాలనీలోని దారిది. ఆ దారి మధ్యలో విద్యుత్తు స్తంభాలతో పాటు వైర్లున్నాయి. కొన్నాళ్ల క్రితం దారిని సీసీగా అభివృద్ధి చేశారు. అప్పట్లో స్తంభాన్ని, దానికి అనుసరించి ఉన్న వైర్లను తొలగించలేదు. ఫలితంగా ఆ దారిలో ప్రయాణించేవారు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితి. ఇక రాత్రి వేళల్లో కొత్తగా వచ్చేవారికి ప్రాణాపాయం కూడా పొంచి ఉంది.

–న్యూస్‌టుడే, కేశంపేట

'రైతు డిక్లరేషన్ అమలు చేయాలి'

షాబాద్: ఎన్నికల ప్రచారంలో భాగంగా రాహుల్ గాంధీ వరంగల్‌లో ప్రకటించిన విధంగా కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్ను అమలు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా మాజీ అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ డిమాండు చేశారు. గురువారం షాబాద్‌ల ఆయన మాట్లాడుతూ... రుణమాఫీ అమలులో ప్రభుత్వం రకరకాల నిబంధనలను పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సమావేశంలో యాదిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, చంద్రబాబు, వీరేశం పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం





శంషాబాద్ ఆదర్శనగర్, షాబాద్‌లలో బాలాత్రిపుర సుందరిగా..



రాధానగర్‌లోని హనుమాన్ ఆలయంలో..

చేవెళ్ల, శంషాబాద్, బండ్లగూడజాగీర్, షాబాద్, నార్సింగి, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవాలయాలతో పాటు ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.



నార్సింగిలోని ఖానాపూర్ దుర్గామాత మండపంలో..



చేవెళ్లలో కొలువుదీరిన అమ్మవారు

హజ్ యాత్రికులకు సన్మానం

షాద్‌నగర్, న్యూస్‌టుడే: షాద్‌నగర్ నుంచి మక్కాకు బయలుదేరుతున్న యాత్రికులను స్థానిక ముస్లిం నాయకులు గురువారం సత్కరించారు. షాద్‌నగర్ కాంగ్రెస్ నేత బాబర్ అలీఖాన్‌తో పాటు బహద్దుర్ అలీ, ఎండీ నజీర్‌లు గురువారం మక్కాకు బయల్దేరారు. ఈ సందర్భంగా షబ్బీర్ హఫీజ్, సలీం, జాఫర్ తదితరులు వారిని సత్కరించారు.

అమ్మవారి ఉత్సవాలకు డీజే బాక్సుల వితరణ

నందిగామ: అప్పారెడ్డిగూడకు చెందిన బండి మాణిక్యం గ్రామంలో నిర్వహించే దుర్గమాత ఉత్సవాలకు రూ.75 వేలతో డీజే బాక్సులు కొనుగోలు చేసి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దుర్గమాత మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు దాతను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీతారాములు, భగవాన్‌దాస్, సత్యనారాయణ, మల్లేష్ పాల్గొన్నారు.

బాయిలర్ నీరు మీద పడి ఇద్దరికి గాయాలు

పటాన్‌చెరు: ప్రైవేట్ పరిశ్రమలో బాయిలర్ తెరుస్తుండగా వేడి నీరు శరీరంపై పడి ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం శేరిగూడేనికి చెందిన శంకర్, కృష్ణంరాజు పాశమైలారం పారిశ్రామికవాడ సింథోకెమ్ ల్యాబ్స్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. గురువారం తెల్లవారుజామున రెండు గంటలకు బాయిలర్ తలుపు తెరిచిన సమయంలో వేడి నీరు వారిపై పడ్డాయి. వారిని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి కంచనబాగ్‌లోని డీఆర్‌డీవో అపోలో ఆసుపత్రిలో చేర్పించారు.

క్రైమ్ కార్నర్

ఈత కొలనులో పడి బాలుడి మృతి!

షాద్‌నగర్, న్యూస్‌టుడే: ఈత కొలనులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఓ గ్రామంలో రెండు రోజుల క్రితం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆధ్యాత్మిక సేవా కమిటీ ఛైర్‌పర్సన్ ఒకరు ఇటీవల ఓ ఇంటి నిర్మాణం చేపట్టారు. ఇందులో ఏర్పాటు చేసిన ఈత కొలనులో అక్కడే పని చేస్తున్న కూలీల కుటుంబానికి చెందిన 8 ఏళ్ల బాలుడు పడి చనిపోయాడు. కాగా ఈ ఘటనపై బాలుడి కుటుంబీకులు ఎవరూ ఫిర్యాదు చేయక పోవడంతో విషయం వెలుగులోకి రాలేదు. పోలీసులు సైతం తమకెలాంటి సమాచారం లేదని తెలిపారు.

మహిళ బలవన్మరణం

మొయినాబాద్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఓ మహిళ బలవన్మరణానికి పాల్పడింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన సున్నం జగ్గమ్మ(28) మూడేళ్లుగా నజీబ్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటోంది. చిన్నపిల్లల మనస్తత్వం కలిగిన ఆమె కొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధ పడుతోంది. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో బుధవారం గుర్తు తెలియని పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబీకులు ఉస్మానియా దవాఖానాకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.

దంపతులను బెదిరించి బంగారం దోపిడీ

చేవెళ్ల గ్రామీణం, న్యూస్‌టుడే: భోజనం చేద్దామని రోడ్డు పక్కన సేద తీరుతున్న దంపతులను ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు బెదిరించి ఐదున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ భూపాల్ శ్రీధర్ వివరాల ప్రకారం.. ఫరూక్‌నగర్ మండలం దేవునిపల్లికి చెందిన మంగలి బసప్ప, లక్ష్మమ్మలు దంపతులు. లక్ష్మమ్మ అనారోగ్యంబారిన పడడంతో గురువారం చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి వైద్యకళాశాలకు కారులో వచ్చారు. స్కానింగ్ పూర్తయ్యాక రిపోర్టు మూడు గంటల తర్వాత వస్తుందని చెప్పడంతో వారు చిలుకూరు బాలాజీని దర్శించుకునేందుకు వెళ్లారు. దర్శనమయ్యాక తిరిగి వస్తుండగా హైదరాబాద్-బీజాపూర్ రహదారికి కొద్ది దూరంలో కారు ఆపి భోజనం చేసేందుకు చెట్టు కింద కూర్చున్నారు. అదే సమయంలో ముఖానికి మాస్కులు ధరించిన ఇద్దరు బైక్‌పై వచ్చి వారిని కత్తితో బెదిరించారు. లక్ష్మమ్మ మెడలోని మంగళసూత్రంతో పాటు కమ్మలు, బసప్ప మెడలోని బంగారం గొలుసు తీసుకొని వెళ్లిపోయారు. బాధితులు వెంటనే చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు.

మహేశ్వరం

•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి

రాష్ట్ర ప్రజల చూపు.. భాజపా వైపు: ఎంపీ


నాదర్‌గుల్‌లో భాజపా సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

బాలాపూర్, న్యూస్‌టుడే: ప్రతి భాజపా కార్యకర్త క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి అత్యధికంగా సభ్యత్వాలను నమోదు చేయించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని 8వ వార్డు నాదర్‌గుల్‌లో గురువారం జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు భాజపా వైపు చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ భాజపా బాధ్యుడు అందెల శ్రీరాములు యాదవ్, నియోజకవర్గ భాజపా కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు జి.ఇంద్రసేనా, తోట శ్రీధర్‌రెడ్డి, ఎన్.సునీత, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదం అంచున.. చేపల వేట



కందుకూరు మండల పరిధిలోని కొత్తగూడ - జైత్వారం మార్గంలో సున్నం చెరువు కల్వర్టు వద్ద ప్రమాదకర పరిస్థితుల్లో పలువురు చేపల పడుతున్నారు. కల్వర్టు పైనుంచి కొందరు, కాల్వ అంచున ఇంకొందరు చేపలు పడుతున్నారు. ఏమాత్రం జారినా ప్రాణాలకే ప్రమాదం అని హెచ్చరిస్తున్నా.. వేట మాత్రం మానట్లేదని స్థానికులు పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, కందుకూరు

కార్మికులకు దుస్తుల అందజేత

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం రాంపూర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గురువారం హనుమాన్ దేవాలయం మాజీ ఛైర్మన్ ముక్కాల నర్సింహులు దుస్తులు అందించారు. పారిశుధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బంది సేవలు గొప్పవని తెలిపారు. మాజీ సర్పంచి శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీనివాసచారి, రాములు, కృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నంలో మరమ్మతుల కారణంగా అక్టోపస్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రావు చెప్పారు.

'మతమార్పిళ్లకు పాల్పడట్లేదు'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నంలో క్రైస్తవులు.. హిందూ యువకులను మతం మారమని ఎక్కడా చెప్పలేదని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు ముత్తయ్య అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవులపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆయన డిమాండ్ చేశారు.

రైతులకు అండగా సహకార సంఘం

అబ్దుల్లాపూర్ మెట్, న్యూస్‌టుడే: రైతన్నలకు అండగా నిలుస్తున్నట్లు బాటసింగారం రైతు సేవ సహకార సంఘం అధ్యక్షుడు చేగూరి భరత్ కుమార్ పేర్కొన్నారు. సంఘ సభ్యుల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని తెలిపారు. డైరెక్టర్లు మహేందర్ రెడ్డి, రాములు, యాదిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

సత్కారాలతో మరింత బాధ్యత

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురానికి చెందిన సామాజిక వేత్త, కళాకారుడు ఎస్.ఎస్.ఆర్ ట్రస్టు ఛైర్మన్ డా.రామచంద్రరావును గురువారం చిత్రాలేఅవుట్ కాలనీలో ఘనంగా సత్కరించారు. ఆయనకు గాంధీ స్మారక అవార్డు లభించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, గాంధీ అభిమానులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ డొల్ల.. నాణ్యత కల్ల


రాగన్నగూడ సూరజ్‌నగర్‌లో శిథిలమైన సీసీ రోడ్డు


మన్నెగూడలో ధ్వంసమైన మ్యాన్‌హోల్

తుర్కయాంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: తుర్కయాంజాల్ పురపాలికలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలిస్తున్నారు. రూ.కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులు అనతికాలంలోనే శిథిలావస్థకు చేరుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గుత్తేదార్లు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏళ్ల తరబడి మన్నికగా ఉండాల్సిన సిమెంట్ రహదారులు, అంతర్గత మురుగునీటి కాల్వలు బీటలిస్తున్నాయి. ముఖ్యంగా మున్సిపాలిటీలోని అభివృద్ధి పనులకు సంబంధించి నిర్ణీత అంచనా వ్యయం కన్నా 35శాతం తక్కువకు గుత్తేదార్లు టెండర్లు దక్కించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పనులు నాసిరకంగా చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

◆ తుర్కయంజాల్ మున్సిపాలిటీగా ఏర్పడి దాదాపు నాలుగున్నరేళ్లు కావస్తోంది. ఒకసారి రూ.160 కోట్లు, ఆ తర్వాత రూ.176 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు.

◆ తుర్కయంజాల్ 11వ వార్డులో మూడేళ్ల క్రితం సుమారు రూ.16 లక్షలతో తారురోడ్డు నిర్మించారు. అది ప్రస్తుతం మట్టిరోడ్డుగా మారిపోయింది. రూ.5 లక్షలతో మరమ్మతులు చేసినా ఫలితం లేదు. ప్రస్తుతం ఇక్కడ సీసీ రోడ్డు ప్రతిపాదిస్తున్నారు.

◆ 11వ వార్డు రఘువీర్ కాలనీ నుంచి ఏవీనగర్ ఫేజ్ -2 కాలనీకి వెళ్లే రోడ్డులో సుమారు 16 లక్షలతో చేపట్టిన మురుగునీటి కాల్వ పనులు బీటలిచ్చాయి.

◆ రాగన్నగూడ 20వ వార్డు సూరజ్‌నగర్‌లో రెండేళ్ల క్రితం రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నెర్రలిచ్చింది.

◆ 7వ వార్డు బ్రాహ్మణపల్లి రోడ్డు నుంచి ఓంగణేష్ కాలనీకి వెళ్లే దారిలో వేసిన సీసీ రోడ్డు కంకర తేలుతోంది.

◆ ఎనిమిదో వార్డు మన్నెగూడ ఎర్రకుంట వద్ద 6 నెలల క్రితం రూ.10 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ధ్వంసమయ్యాయి.

◆ ఇంజాపూర్ సాయిదయా కాలనీలో ఏడాదిన్నర క్రితం సుమారు రూ.20 లక్షలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు శిథిలావస్థకు చేరాయి.

ప్రత్యేకంగా పర్యవేక్షిస్తాం..

– కె.అమరేందర్‌రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్



మున్సిపాలిటీలో చేపట్టే ప్రగతి పనులపై ప్రత్యేకంగా పర్యవేక్షిస్తాం. నాణ్యత ప్రమాణాలు పాటించేలా జాగ్రత్తలు తీసుకుంటాం. నాసిరకంగా పనులు చేపట్టే గుత్తేదార్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం 80085 73290
ఇబ్రహీంపట్నం 80085 73295
ఆమన్‌గల్, కడ్తాల్ 98481 98888
ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

ఆదిభట్ల, ఆర్కేపురం, కందుకూరు, మహేశ్వరం, న్యూస్‌టుడే:

? ఆదిభట్ల పురపాలిక పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో దోమల బెడద ఎక్కువగా ఉంది.– ప్రణీత్, రాఘవేంద్రనగర్ కాలనీ

✓ ఫాగింగ్ నిర్వహించి దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. –బాలకృష్ణ, కమిషనర్, ఆదిభట్ల

? అల్కాపురి కాలనీలోని వీ.డీ ప్రసాద్ మెమోరియల్ పాఠశాల ముందు పాదబాటపై వ్యర్థాలు పేరుకున్నాయి. – శ్యామల, అల్కాపురి కాలనీ

✓ వెంటనే తొలగిస్తాం. – సుజాత, డీసీ, జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్,

? కందుకూరు మండల కేంద్రంలో హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి పక్కన రైస్ మిల్లు సమీపంలో దుకాణదారులు వ్యర్థాలు వేస్తున్నారు. దుర్వాసన భరించలేక పోతున్నాం. – జి.రవీందర్, స్థానికుడు

✓ దుకాణదారులకు తాఖీదులు జారీ చేస్తాం. సమస్య పరిష్కరిస్తాం. – సరిత, ఎంపీడీఓ, కందుకూరు

? అమీర్‌పేటలో మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులు చేసిన తర్వాత గొయ్యి సరిగ్గా పూడ్చలేదు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. –మల్లికార్జున్, అమీర్‌పేట

✓ గుత్తేదారుకు చెప్పి గొయ్యి పూడ్పిస్తాం.– కార్తీక్, ఏఈ, మిషన్ భగీరథ

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష

ఆదిభట్ల, మహేశ్వరం, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక.. సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సంబంధిత అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు సచివాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, డీఎస్సీ సర్టిఫికేషన్ వెరిఫికేషన్లపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పాల్గొన్నారు. ◆ పెద్దమ్మ తండాలో గురువారం డిజిటల్ కార్డుల సర్వేను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రారంభించారు. సర్వే బృందానికి ఆమె పలు సూచనలు చేశారు.

అర్హులందరికీ డిజిటల్ రేషన్ కార్డులు


ఆదిభట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆదిభట్ల, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి కుటుంబానికి డిజిటల్ రేషన్‌కార్డులు ఇస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ సర్వేను బుధవారం ఆదిభట్ల పురపాలికలో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. సంబంధిత అధికారులు ఇంటింటికి తిరిగి సర్వే చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, కమిషనర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి


ఆమనగల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, న్యూస్‌టుడే: ఫ్యామిలీ డిజిటల్ కార్డులతో పేద ప్రజలకు మేలు జరుగుతుందని.. అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆమనగల్లులో గురువారం ఈ సర్వే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గోపీరామ్, తహసీల్దార్ లలిత, కమిషనర్ వసంత, ఛైర్మన్ రాంపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. ◆ తాగనీరు సక్రమంగా సరఫరా చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. రాంనుంత రైతు వేదిక భవనంలో మంచి నీటి సరఫరా సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీఈఈలు మోహన్‌రెడ్డి, రామకృష్ణ, ఎంపీవో వినోద, ఏఈఈలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పరిహారం


తుక్కుగూడలో కేఎల్‌ఆర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మహేశ్వరం, కందుకూరు, న్యూస్‌టుడే: ఔషధనగరి భూసేకరణలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ భరోసా ఇచ్చారు. గురువారం మీర్‌ఖాన్‌పేట, జెన్నాయిగూడ గ్రామస్థులు, భూసేకరణ బాధితులు తుక్కుగూడలో పార్టీ కార్యాలయంలో కేఎల్‌ఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.


ఆర్కేపురంలోని కుర్తాళం పీఠంలో కుంకుమార్చన

ఘనంగా ప్రత్యంగిరా దేవి శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

తొలిరోజు పోటెత్తిన భక్తులు

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురంలోని కుర్తాళం పీఠానికి చెందిన వారాహీ సమేత ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఉదయం అమ్మవారికి 18 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అర్చనలతోపాటు ప్రత్యేక హోమాలు చేశారు. కుంకుమార్చన సేవలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ సెక్రెటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ యువజన నేత చిలుక ఉపేందర్ రెడ్డి, విఠల్ శర్మ, సువర్ణలత, హేమంత్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా సుధారాణి

కందుకూరు, న్యూస్‌టుడే: కందుకూరు మండల ప్రత్యేక అధికారిగా మహేశ్వరం ఏడీఏ సుధారాణి నియమితులయ్యారు. గురువారం మండల కార్యాలయంలో సుధారాణి బాధ్యతలు స్వీకరించారు.

శ్రమ దోపిడీపై సీఐటీయూ ఆందోళన

తలకొండపల్లి: తలకొండపల్లి మండల కేంద్రంలో గురువారం కార్మికుల శ్రమ దోపిడీని కేంద్ర ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ జె. పెంటయ్య, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: మహారాష్ట్రకు చెందిన రోమీ భారత్ కల్యాణ్ గురువారం బొంగుళూరు సర్వీస్ రోడ్డులో కేజీన్నర గంజాయి, 50 గ్రాముల బ్యాంకాక్ గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.


తలకొండపల్లిలో విస్తృత తనిఖీలు


తలకొండపల్లి: తలకొండపల్లిలో 70 మంది పోలీసులు పాన్, కిరాణా, గొలుసు దుకాణాలు, వాహనాలను తనిఖీ చేశారు. 3 కేసులు నమోదు చేశారు. సీఐలు సత్యనారాయణ, ప్రశాంత్, ఎస్సైలు శ్రీకాంత్, వెంకటేశ్, రాజ్‌కుమార్, సుశీల, విజయ్, శరత్ పాల్గొన్నారు.


మీర్‌పేటలో కాశీ నర్మదేశ్వరస్వామి ఆలయంలో..


నందివనపర్తి జ్ఞాన సరస్వతి


ఆమనగల్లులో కన్యకాపరమేశ్వరి


మైసిగండి శివాలయంలో..


ఇబ్రహీంపట్నంలో దుర్గాదేవిగా..


రావిర్యాలలో ఎల్లమ్మ తల్లి


మహేశ్వరంలో కాత్యాయినీ దేవిగా..


రాచులూరులో..

అమ్మవారికి ప్రత్యేక పూజలు


ఆమనగల్లులో హోమం చేస్తున్న ఆర్యవైశ్యులు

మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, మీర్‌పేట, యాచారం, ఆమనగల్లు, కడ్తాల్, కందుకూరు, ఆర్కేపురం, అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేశారు. కుంకుమార్చన, కలశపూజలు నిర్వహించారు. తొలిరోజు బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కొన్నిచోట్ల అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదానం చేశారు. ఆయా ప్రాంతాల్లోని అమ్మవార్లను వివిధ పార్టీలకు చెందిన నేతలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.


మహేశ్వరం శివగంగరాజరాజేశ్వర స్వామి ఆలయంలో..


అగర్‌మియాగూడలో..


గ్రీన్‌హిల్స్ కాలనీలో కేఎల్‌ఆర్


మైసిగండిలో భక్తులు


గౌరెల్లిలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో..

దాడి చేసిన పోలీసులపై చర్యలకు డిమాండ్


నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: గత నెల 29న నాంపల్లి కోర్టులో న్యాయవాది మొహమ్మద్ అబ్దుల్ ఖలీమ్‌పై దాడి చేసిన మాదన్నపేట పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. న్యాయవాదుల రక్షణ చట్టం కావాలని కోరారు. ఇబ్రహీంపట్నంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి కోర్టు గేట్ ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు నారెడ్ల అంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జె.పి మహేందర్ పాల్గొన్నారు.

హెచ్‌డీసీసీబీ డైరెక్టర్‌గా ఆనంద్


సబితారెడ్డి నుంచి నియామక పత్రం అందుకుంటున్న ఆనంద్

కందుకూరు, న్యూస్‌టుడే: హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు డైరెక్టర్‌గా కందుకూరు పీఏసీఎస్ డైరెక్టర్ పొట్టి ఆనంద్ నియమితులయ్యారు. నియామక పత్రాన్ని ఆనంద్‌కు ఎమ్మెల్యే సబితారెడ్డి అందించారు.

కాలనీ కార్యవర్గం ఎన్నిక

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ పరిధి లక్ష్మీ మెగా టౌన్‌షిప్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా నక్కనబోయిన ఆంజనేయులు, పెద్దపల్లి శ్రీనివాసులు, సలహాదారులుగా మేరెడ్డి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి, జీఆర్ కరుణాకర్, ఉపాధ్యక్షుడిగా మెండి కొండల్, సంయుక్త కార్యదర్శిగా వెంకటేశ్వరరావు, కోశాధికారిగా శివ శంకర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

డీజే వాడితే కఠిన చర్యలు

మంచాల: డీజేసౌండ్ సిస్టమ్ మండలంలో ఎవరైనా వినియోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మంచాల సీఐ బాబ్యానాయక్ హెచ్చరించారు.

బతుకమ్మల సందడి


ఆరుట్ల శ్రీరాం యూత్ ఆధ్వర్యంలో..


అబ్దుల్లాపూర్‌మెట్ సుజాతనగర్ కాలనీలో..


టీఎస్‌ఆర్‌నగర్‌లో కార్పొరేటర్ అరుణ, కాలనీవాసులు

మహేశ్వరం, అబ్దుల్లాపూర్‌మెట్, తలకొండపల్లి, మీర్‌పేట, మంచాల, న్యూస్‌టుడే: మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో రంగురంగుల పూలతో మహిళలు బతుకమ్మలు తయారు చేశారు. ఆటపాటలతో సందడి చేశారు.


వెల్జాల్‌లో బతుకమ్మలతో మహిళలు


మీర్‌పేట సర్వోదయనగర్‌కాలనీలో..

'బ్యాంకు రుణాలు పొందినవి హైడ్రాకు ప్రభావితం కాలేదు'

సోమాజిగూడ, న్యూస్‌టుడే: హైడ్రా కూల్చివేతల్లో బ్యాంకుల నుంచి రుణాలు పొందినవేవీ ప్రభావితం కాలేదని ఎస్‌బీఐ హెచ్‌ఎల్‌ఎస్‌టీ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బి.రాములు అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాల్యుయర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం ప్లాజా హోటల్‌లో 55వ వాల్యుయర్స్ డే సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాల్యుయర్స్ ఛైర్మన్ మధు ఏడాది తీసుకున్న థీమ్ విలువలు యువత, నారీ శక్తి సాధికారత అనే అంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో వాల్యుయర్స్ కార్యదర్శి కె.చిరంజీవి, మాజీ ఛైర్మన్లు దేశ్‌పాండే, ఎన్‌ఆర్‌రావు, జీవీ అప్పారావు, ఎ.కాశీరాం, వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన వాల్యుయర్లు పాల్గొన్నారు.



బి.రాములును సత్కరిస్తున్న అప్పారావు, దేశ్‌పాండే, మధు, ఎన్ఆర్‌రావు, చిరంజీవి

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

'బంజారాలకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే'

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో లంబాడాలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని పలు గిరిజన సంఘాల నేతలు ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ప్రభుత్వ ఏర్పాటులో లంబాడీలు కీలక పాత్ర పోషించారని, ఇదే విషయం సీఎం రేవంత్‌రెడ్డి అనేక సభలలో ప్రస్తావించారని గుర్తుచేశారు. దాదాపు 20 గిరిజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పార్టీ విజయానికి పనిచేసిన బంజారాలకు మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో మాజీ మంత్రి రవీంద్ర నాయక్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న పలు బంజారా సంఘాల నేతలు

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

న్యూస్‌టుడే, బంజారాహిల్స్

సమస్య: బంజారాహిల్స్ రోడ్డు నం.7లోని మీసేవ కార్యాలయం ప్రాంతంలో పలు వీధి దీపాలు పగటి సమయంలో వెలుగుతున్నాయి. వీటిలో హైమాస్ట్ దీపాలు సైతం ఉన్నాయి. **- శ్రీనివాస్, ప్రైవేటు ఉద్యోగి, బంజారాహిల్స్**

సమాధానం: సిబ్బందిని పంపి సమస్య పరిష్కరిస్తాం. **- సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్-18**

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: ఉ.10.30-11.30: కేర్ ఆస్పత్రి, సంఘీ అపార్ట్‌మెంట్స్, శాలిని మార్కెట్, పంజాగుట్ట ప్రాంతాలు. ఉ.11.30-మ.1: మధురానగర్ ఏ, సీ, డీ, హెచ్ బ్లాక్స్. మ.2-3: వెంకటగిరి పెద్ద మసీదు ప్రాంతం, సీ-బ్లాక్ ప్రాంతాలు. మ.3-సా.4.30: బంగారు మైసమ్మ గుడి, చంద్రమ్మ గల్లీ, రహ్మత్ నగర్ ప్రాంతాలు

పట్టాలు దాటనివ్వరు.. ఆర్‌యూబీ తెరవరు

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ఖైరతాబాద్ వాసులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: నగరంలో చాలా ప్రాంతాలకు ఎంఎంటీఎస్ లేదు. ఖైరతాబాద్ ప్రాంతంలో ఉన్నా వినియోగించుకునేందుకు ప్రజలు నానా తంటాలు పడాల్సి వస్తోంది. స్థానిక బస్తీలకు ఆనుకుని ఉంటే రైల్వే స్టేషన్‌కు అక్కడికి చేరుకునేందుకు దారులన్నీ మూతపడ్డాయి. దీంతో రైల్వే గేటు మీదుగా అరకిలోమీటరు దూరం తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది.



ఏటవాలు గోడ మీదుగా రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న మహిళ

మూతపడిన ఆర్‌యూబీ

అన్ని సౌకర్యాలకు దగ్గరి దారి కావడంతో గతంలో రైల్వే స్టేషన్ పక్కనే రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మించారు. పరిశుభ్రత పాటించకపోవడంతో ఇరవై ఏళ్ల కిందట ఆ దారి మూత పడింది. దీంతో స్థానికులు పట్టాలు దాటి వెళ్లేవారు. ప్రమాదాలు జరుగుతుండటంతో రైల్వే అధికారులు ఇనప రాడ్లతో అడ్డుకట్ట వేశారు. అయినప్పటికీ రాడ్ల కింద నుంచి దాటుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల గణేష్ ఉత్సవాలు పూర్తవ్వగానే రైల్వే అధికారులు రాడ్ల కింద చెట్ల కొమ్మలు అడ్డుగా వేశారు. దాంతో ప్రజలు ఆర్‌యూబీకోసం ఏటవాలుగా నిర్మించిన రక్షణ గోడ మీదుగా ప్రమాదకరంగా దాటుతున్నారు. ఈ క్రమంలో చాలా మంది కిందపడి గాయాలపాలవుతున్నారు.



రాకపోకలు లేకుండా ఏర్పాటు చేసిన రాడ్లు

ప్రయత్నాలు చేసినా..

ఆర్‌యూబీని అందుబాటులోకి తేవాలని ఎనిమిదేళ్ల కిందట అప్పటి ప్రజాప్రతినిధి విశ్వ ప్రయత్నం చేశారు. కేంద్ర మంత్రి సహకారంతో రైల్వే జీఎంను తీసుకొచ్చి సమస్యను వివరించడంతో తిరిగి తెరచేందుకు అనుమతి ఇచ్చారు. జీహెచ్‌ఎంసీ అధికారులు పనులు చేపట్టి దారిలోని వ్యర్థాలన్నీ తొలగించారు. దీంతో దారి అందుబాటులోకి వస్తుందని స్థానికులు సంబరపడ్డారు. అయితే, మార్గంలో విద్యుత్తు తీగల తొలగింపు ప్రక్రియ జాప్యం కావడం, ఎన్నికలు రావడం, ప్రజాప్రతినిధులు మారడంతో పట్టించుకోలేదు. ఆర్‌యూబీ అందబాబులోకి వస్తే ఓ ప్రజాప్రతినిధి అనుచరుల ఇళ్లకు ఇబ్బంది అవుతుందని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం మళ్లీ ఈ దారి పూర్తిగా మూతపడి, మురుగు కుంటగా మారింది.

జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చిస్తాం

– స్వామి, రైల్వే సీఐ

స్థానికులు రైలు పట్టాల మీదుగా దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టాల మీదుగా దారి మూసివేస్తే జీహెచ్‌ఎంసీపై ఒత్తిడి తెచ్చి ఆర్‌యూబీ సరిచేయించుకుంటారని భావించాం. మరీ ఇబ్బందిగా ఉంటే చెట్ల కొమ్మలు తొలగించి వాడుకోవచ్చు. అయితే, సమస్య జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

రాష్ట్రానికి మరిన్ని జాతీయ విద్యా సంస్థలు అవసరం

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మరిన్ని జాతీయ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఇండియన్ స్టూడెంట్స్ యూనియన్ (ఐఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు అన్నారు. గురువారం బంజారాహిల్స్‌లో భారాస ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కాంగ్రెస్ ఎంపీ మల్లురవిలను వారి నివాసాల్లో కలిసి ఈ మేరకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐఐఎం, ఐఐటీ, ట్రిబుల్ ఐటీ సంస్థలను మరిన్ని ఏర్పాటు చేసినట్లయితే ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఎంపీలను కలిసిన వారిలో ఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, రాష్ట్ర నేతలు సతీష్, వినయ్ కుమార్ ఉన్నారు.



ఎంపీ వద్దిరాజు రవిచంద్రన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐఎస్‌యూ నేతలు పాపని నాగరాజు, సతీష్, వెంకటేశ్‌గౌడ్

న్యాయవాదిపై దాడి అమానుషం

కోఆపరేటివ్ ట్రైబ్యునల్ అడ్వొకేట్స్ అసోసియేషన్

ఈనాడు, హైదరాబాద్: సిటీ సివిల్ కోర్టు న్యాయవాది అబ్దుల్ కలీంపై మాదన్నపేట పోలీసులు విచక్షణా రహితంగా దాడి చేసినందుకు నిరసనగా న్యాయవాదులు విధులు బహిష్కరించారు. న్యాయవాదిపై దాడికి దిగడం అమానుషమని, దాడికి పాల్పడిన వారిని శిక్షించాలని కోఆపరేటివ్ ట్రైబ్యునల్ అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ దివాకర్ డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా మాదన్నపేట్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన కలీంను దూషించిన పోలీసులు, కొట్టుకుంటూ తీసుకెళ్లారని, విచక్షణా రహితంగా కొట్టడంతో అతను స్పృహ తప్పి పడిపోయాడన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.



సత్యసాయి నిగమాగమంలో వస్త్ర ప్రదర్శన

సత్యసాయి నిగమాగమంలో వస్త్ర ప్రదర్శన

యూసుఫ్‌గూడ: భారతీయ సంస్కృతిలో పట్టు, చేనేత వస్త్రాలకు ప్రత్యేకత ఉందని టాలీవుడ్ నటి వాణ్య అగర్వాల్ అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను ఆమె గురువారం ప్రారంభించారు. దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేత కళాకారులు, చేతి పని బృందాలు వారి ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. ఈనెల 8 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు జయేష్ గుప్తా తెలిపారు.

27న మాలమహానాడు కార్యవర్గ సమావేశం

హిమాయత్‌నగర్: నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 27న జరిగే మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు పిలుపునిచ్చారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని సంస్థ కేంద్ర కార్యాలయంలో పదాధికారుల సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు.

పోలింగ్ స్టేషన్ల మార్పునకు ప్రతిపాదనలు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఖైరతాబాద్ నియోజకవర్గంలో ప్రజల నుంచి, పార్టీల నుంచి వచ్చిన అభ్యంతరాల నేపథ్యంలో పలు పోలింగ్ స్టేషన్లను మారుస్తున్నారు. ఈ మేరకు నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో ఖైరతాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ సర్కిల్ 18 ఉప కమిషనర్, ఖైరతాబాద్ నియోజకవర్గ ఈఆర్‌ఓ ప్రశాంతి సమావేశం నిర్వహించారు. సోమాజిగూడలోని ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్‌లో కొనసాగుతున్న 83, 89 పోలింగ్ కేంద్రాలను డివిజన్‌లోని వార్డు కార్యాలయానికి మారుస్తూ ప్రతిపాదించారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు 11లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉన్న 204, 221 పీఎస్‌లను అక్కడి సరస్వతి విద్యామందిర్ పాఠశాలకు తరలించనున్నారు. సోమాజిగూడలోని రాజ్‌భవన్ ప్రభుత్వ పాఠశాలలో 117 నుంచి 222 ఆరు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మూడు రాజ్‌భవన్ ప్రాథమిక పాఠశాల పేరుతో, మరో మూడు రాజ్‌భవన్ ఉన్నత పాఠశాల పేరుతో ఉన్నాయి. అవన్నీ ఒకే భవనంలో ఉన్నా పేర్లు తేడాగా ఉండటంతో ఇబ్బందులు తలెత్తున్నాయని గుర్తించి అన్ని పోలింగ్ కేంద్రాలకు రాజ్‌భవన్ ఉన్నత పాఠశాలగా మార్చాలని నిర్ణయించారు. ప్రతిపాదనలను ఉన్నతాధికారులు ఆమోదిస్తే వచ్చే ఎన్నికల్లో మార్పులకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు మారనున్నాయి.



రాజకీయ పార్టీల నాయకులతో ఈఆర్ఓ ప్రశాంతి

నేషనల్ మెగా టీపీఓ సమిట్ 4, 5తేదీల్లో

ఖైరతాబాద్: తెలంగాణ ట్రెయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేషనల్ టీపీఓ సమిట్ -2024 నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.జయరాం తెలిపారు. ఈనెల 4, 5 తేదీల్లో 'తెలంగాణ గ్లోబల్ ఆల్ ఇన్నోవబుల్ అండ్ అపార్చునిటీస్' అనే అంశంపై సమిట్ టీ-హబ్‌లో జరగనుందని వివరించారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఇందుకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సదస్సుకు దేశంలోని ప్రముఖ సంస్థల హెచ్ఆర్‌లు పాల్గొంటారన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ప్రొ.శ్రీకాంత్ తదితరులున్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కిరణ్, ప్రొ.ప్రశాంత్, డా.జయరాం, సంతోష్, ఇందిర

కులగణన తర్వాతే ఎస్సీ వర్గీకరణ చేయాలి

ఖైరతాబాద్: రాష్ట్రంలో కుల గణన తర్వాతనే ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు బైరి వెంకటేశం మోచి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అది రాజకీయాలకు అతీతంగా ఉండాలన్నారు. ఉపకులాలకు 7శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. డిమాండపై స్పందించకుంటే 21న చలో హైదరాబాద్ పేరుతో ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు.

మంత్రి పొంగులేటి ఇంట్లో ఏం దొరికిందో ఈడీ బహిర్గతం చేయాలి: దాసోజు

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఏం దొరికిందో ఈడీ ప్రజలకు చెప్పాలని భారాస నాయకుడు దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నంబర్-2గా చెలామణి అవుతున్న మంత్రి ఇంట్లో రూ.1600 కోట్లు, పెద్దఎత్తున బంగారం దొరికినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరిగిందన్నారు. హైడ్రా విషయంలో హైకోర్టు హెచ్చరించినా సీఎం రేవంత్‌రెడ్డి ఆర్డినెన్స్ తెచ్చారన్నారు. కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలన్నారు.



మాట్లాడుతున్న దాసోజు శ్రవణ్

20న ఇండియన్ నేషనల్ మెమరీ ఛాంపియన్‌షిప్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఇండియన్ నేషనల్ మెమరీ ఛాంపియన్‌షిప్ 2024 పోటీలు బేగంపేటలో ఈనెల 20న జరుగనున్నాయని ఇండియన్ మెమరీ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధి, ఛాంపియన్‌షిప్ చీఫ్ ఇన్‌ఛార్జి డాక్టర్ పి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఇందులో 3 దేశాలు, 13 రాష్ట్రాలు, 59 పట్టణాలు, 74 పాఠశాలల నుంచి 180 మంది పాల్గొంటున్నట్లు వివరించారు. గురువారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఛాంపియన్‌షిప్ బ్రోచర్‌ను ఆవిష్కరించి వివరాలు వెల్లడించారు.

బాలా త్రిపుర సుందరీదేవిగా పెద్దమ్మ తల్లి



షేక్‌పేట ఓయూ కాలనీ కనకదుర్గాలయంలో



విద్యుద్దీపకాంతుల్లో జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయం



అమ్మవారికి పూజలు చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, శృతిరెడ్డి, జనశ్రీరెడ్డి, జనవర్ధన్‌రెడ్డి

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి ఉత్సవాలు జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి ఆలయంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు గురువారం అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. 9 గంటలకు నవరాత్రోత్సవాలను వీజేఆర్ కుటుంబ సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రారంభించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస రాజు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయంలో కుంకుమార్చనలు సైతం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రవీంద్రభారతి: రవీంద్రభారతి ప్రాంగణం పూలవనమైంది. రంగురంగుల పూలతో తీర్చిదిద్దిన బతుకమ్మలతో మహిళలు ఆడిపాడి ఆకట్టుకున్నారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు హరికృష్ణ పర్యవేక్షించారు.



రవీంద్రభారతిలో బతుకమ్మ వేడుకలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వ్యభిచార నిర్వాహకుడి రిమాండ్

పంజాగుట్ట, న్యూస్‌టుడే: వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న వ్యక్తిని పంజాగుట్ట పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన శంకర్ పంజాగుట్ట శబరీనాథ్ గల్లీలో వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఇంటిపై దాడిచేసి నిర్వాహకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ బంగారు శోభన్ సూచించారు.

చరవాణి దొంగల అరెస్టు

పంజాగుట్ట, న్యూస్‌టుడే: పాల వ్యాన్ నుంచి చరవాణి దొంగిలించిన ఇద్దరు వ్యక్తులను పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబరు 16న ఎర్రమంజిల్ మెట్రోస్టేషన్ సమీపంలో పాల వ్యాన్ నుంచి సయ్యద్ హాజీబాబా, డి.సచిన్ చరవాణి చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేశారు. గురువారం నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యూట్యూబ్ ఛానల్ విలేకరిపై దాడి

పంజాగుట్ట: ఓ యూట్యూబ్ ఛానల్ రిపోర్టర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సోమాజిగూడ మోనఫా సెంటర్‌లోని ఓ హోటల్ వద్దకు అల్పాహారం తీసుకునేందుకు చిలకా ప్రవీణ్, అతడి స్నేహితుడు అజయ్ వెళ్తున్నారు. అదే సమయంలో కారులో వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు ప్రవీణ్‌పై దాడి చేశారు. ప్రవీణ్‌ను మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి పరామర్శించారు.

సీఎం రియల్ ఎస్టేట్ ఏజెంటుగా పనిచేస్తున్నారు: ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్



ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు వ్యక్తిగత శ్రేయస్సు కోసం పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ ఏజెంటుగా పనిచేస్తున్నారని, ఫోర్త్‌సిటీ సీఎం రేవంత్‌రెడ్డి ఊహల, కల్పిత నగరమన్నారు. భారాస ప్రభుత్వం 69 కిలోమీటర్ల మేర మెట్రోను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని, రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌ఫోర్ట్ వరకు తీసుకెళ్లాలని కేసీఆరే నిర్ణయం తీసుకున్నారన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి మెట్రో అవసరం ఉందని ఎన్నికల ప్రచారంలో చెప్పి, అధికారంలోకి రాగానే మోసం చేశారన్నారు. మేడ్చల్ మెట్రో సాధన సమితి పేరుతో మెట్రో రైలు కావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ నగరం నుంచి ఒక్క మంత్రి లేరని శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దే ఉండటం వల్ల అభివృద్ధి పనులు అరకొరగా జరుగుతున్నాయన్నారు.

ప్రైవేట్ పాఠశాల అకౌంటెంట్ చేతివాటం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఫీజులు వసూలు చేసి విద్యార్థుల తల్లిదండ్రులకు నకిలీ రసీదులిచ్చిన పాఠశాల అకౌంటెంట్‌పై కేసు నమోదైంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. రాజీవ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పవిత్రారెడ్డి అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఫీజులు కడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ఆమె నకిలీ రసీదులు ఇచ్చేది. వసూలైన డబ్బు బ్యాంకు ఖాతాలో జమ చేయకపోవడంతో అనుమానంతో రూ.25 లక్షల వరకు మోసం జరిగి ఉంటుందని, మరికొందరి పాత్ర ఉందని పాఠశాల సీఈఓ మురళీశంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



నినాదాలు చేస్తున్న పూర్వ విద్యార్థులు

అంబేడ్కర్ వర్సిటీలో పూర్వ విద్యార్థుల సంఘం ఆందోళన

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పది ఎకరాల స్థలాన్ని జవహర్ లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్ఏఎఫ్ఏయూ) కేటాయించొద్దని అంబేడ్కర్ వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు పరిపాలన భవనం ముందు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో పూర్వ విద్యార్థుల సమాఖ్య అధ్యక్షుడు సాక వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. భూ కేటాయింపు ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినదించారు. నిరసనకు యూనివర్సిటీ జేఏసీ, ఉద్యోగులు మద్దతు తెలిపారు. జాయింట్ యాక్షన్ కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, ఛైర్‌పర్సన్ ప్రొ.పల్లవి కాబ్డే, విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా.ఎల్వీకే రెడ్డి, పూర్వ విద్యార్థుల సమాఖ్య సెక్రటరీ డా.ఉదయిని, కార్యవర్గ సభ్యులు, అధ్యాపకేతర ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు ప్రారంభం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: పార్ట్‌టైం పీహెచ్‌డీ అర్హులైన అభ్యర్థులకు గురువారం జేఎన్‌టీయూహెచ్ ప్రవేశాల విభాగంలో ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. జులైలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా ఆగస్టులో ప్రవేశాల ఫలితాలు విడుదలయ్యాయి. 310మంది పరీక్ష రాయగా.. ప్రవేశాల తనిఖీ తర్వాత ఇంటర్వ్యూలకు 253మంది అర్హత సాధించారు. పరీక్ష నిర్వహణ, ప్రవేశాల పరిశీలనలో కొంత ఒత్తిడి వచ్చినప్పటికీ.. వాటిని కాదని అర్హుల జాబితా సిద్ధం చేశారు. మొదటిరోజు 85మందిని ఇంటర్వ్యూలకు పిలవగా 83మంది హాజరయ్యారు. పీహెచ్‌డీ ప్రవేశాల బోర్డు ఛైర్మన్ డాక్టర్ కె.విజయకుమార్‌రెడ్డి నేతృత్వంలో రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ప్రవేశాల విభాగం డైరెక్టర్ డాక్టర్ జి.కృష్ణమోహన్‌రావు పర్యవేక్షించారు. ఇంటర్వ్యూలు శుక్ర, శని, సోమవారాల్లో కొనసాగుతాయని చెప్పారు.

కూకట్‌పల్లి

పోలీసుల తీరుపై న్యాయవాదుల నిరసన


విధులు బహిష్కరించి కోర్టు గేటు వద్ద బైఠాయింపు

మూసాపేట: నాంపల్లి కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న అబ్దుల్ కలీం అనే న్యాయవాదిపై మాదన్నపేట పోలీసులు దాడికి దిగారని ఆరోపిస్తూ కూకట్‌పల్లి కోర్టు న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. కోర్టు గేటు వద్ద బైఠాయించిన న్యాయవాదులు పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. జరిగిన ఘటనపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పి.నటరాజు, సంయుక్త కార్యదర్శి బి.యాదయ్య, మహిళా ప్రతినిధి ఎ.సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవీశరన్నవరాత్రి ఉత్సవం.. అమ్మవారి వైభవం

కూకట్‌పల్లి, మూసాపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో గురువారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, అభిషేకం, హోమం జరిపారు.


బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ తల్లి


ఫతేనగర్ జవహర్‌కాలనీలోని కనకదుర్గాదేవి


సాయినగర్‌లోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో..


ప్రశాంత్‌నగర్ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయంలో..


మూసాపేట జాతీయ రహదారిలో నల్లపోచమ్మదేవిగా..


వనబాల దేవిగా మూసాపేట రేణుకా ఎల్లమ్మదేవి

ప్రమాదకర విద్యుత్ స్తంభం తొలగింపు



బాలానగర్, న్యూస్‌టుడే: ఇటీవల వర్షాలకు ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్ సమతానగర్ రోడ్డు నంబర్-1లో పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న సిమెంట్ విద్యుత్ స్తంభాన్ని గురువారం సిబ్బంది తొలగించారు. కింది భాగంలో పగిలిపోవడంతో ఒరిగి కేవలం తీగలపై వేలాడుతూ కనిపించడంతో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కార్పొరేటర్ నర్సింహయాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన విద్యుత్ అధికారులతో పాత స్తంభాన్ని తీయించి కొత్తది పునరుద్ధరించారు.

మురుగు రహితం.. ఇంకుడుగుంతలు లక్ష్యం

జలమండలి 90రోజుల ప్రణాళిక

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రజలను మురుగు వేధిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నుంచి బయటికి రాలేని దుస్థితి. ఫిర్యాదు చేసినప్పుడు తాత్కాలిక ఉపశమనం లభిస్తున్నప్పటికీ.. శాశ్వత పరిష్కారం దొరకడం లేదు. ఫలితంగా రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు మురుగు.. మరోవైపు వేసవిలో తాగునీటి ఇబ్బంది.. వెరసి అధికారులకు తలనొప్పిగా మారింది. ఈ రెండు సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా జలమండలి అడుగులు ప్రారంభించింది. కూకట్‌పల్లి జలమండలి డివిజన్ పరిధిలో మొదలైన కసరత్తు గురించి తెలుసుకుందాం..


బాలానగర్ సెక్షన్‌లో ఎయిర్‌టెక్ యంత్రాలు, సిబ్బంది, పనిముట్లతో సిద్ధం


ఓల్డ్‌బోయిన్‌పల్లి హరిజనబస్తీలో పూడిక తీస్తున్న సిబ్బంది

పూడిక తీస్తారు.. తీసింది తొలగిస్తారు

కూకట్‌పల్లి జలమండలి డివిజన్ పరిధిలో మొత్తం 12 సెక్షన్లు ఉన్నాయి. 576కిలోమీటర్ల మేర భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటై ఉంది. నిత్యం ఫిర్యాదులు(ఆన్‌లైన్/ఆఫ్‌లైన్) ఒక్కో సెక్షన్ పరిధిలో 5నుంచి 10వరకు వస్తుంటాయి. రెండు రోజులకోసారి పునరావృతమయ్యేవి కూడా సెక్షన్‌లో 5కు తక్కువ కాకుండా ఉంటున్నాయి. మొత్తంగా సమస్యాత్మకంగా మారిన ప్రాంతాలు 60కి పైగా ఉన్నాయి. మరమ్మతులు చేస్తున్నా ప్రయోజనం లేకపోతుండడం.. అధికారులు ప్రేక్షకపాత్రకు పరిమితం అవుతుండడంతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇటువంటి ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మరమ్మతులు చేయడమే కాకుండా.. పూర్తిస్థాయిలో పూడిక తీసేలా జలమండలి నిర్ణయం తీసుకుంది. 2వ తేదీ నుంచి ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని డిసెంబర్ 31వ తేదీ వరకు 90రోజుల పాటు నిర్వహించేలా షెడ్యూల్ సిద్ధం చేశారు. సమస్యాత్మక ప్రాంతాలకు ప్రాధాన్యమిస్తూ.. మిగతా అన్నిచోట్ల పైప్‌లైన్ మొత్తం పూడిక తీయనున్నట్లు జీఎం ప్రభాకర్‌రావు చెప్పారు. తీసిన పూడికను తరలించే ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు. ఏ రోజుకారోజు ఎక్కడ, ఎంతదూరం, పూడిక తీశారు..? కాలనీ పేరుతో సహా అన్ని వివరాలను యాప్‌లో సెక్షన్ల మేనేజర్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ధ్వంసమైన పైపుల మార్పుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం, మ్యాన్‌హోల్ మూతలు ఎప్పటికప్పుడు మార్చడం చేయనున్నారు.

ఇంకుడుగుంతలు తప్పనిసరి

300చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏ నిర్మాణమైనా ఇంకుడుగుంత ఉండాల్సిందే. దీన్ని తప్పనిసరి చేస్తూ సిబ్బంది అవగాహన కల్పిస్తారు. వచ్చే వేసవి నాటికి ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోని వారికి ట్యాంకర్ల బుకింగ్‌పై అదనంగా వసూలు చేయాలని నిర్ణయించారు. గతేడాది ట్యాంకర్లు అధికంగా బుకింగ్ అయిన ప్రాంతాలైన మోతీనగర్ గాయత్రీనగర్, కేపీహెచ్‌బీకాలనీ 1, 2, 3, 6వ ఫేజ్‌లతోపాటు గోపాల్‌నగర్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించనున్నారు. ఇప్పటికే నోటీసులు కూడా పంపిణీ చేస్తున్నట్లు జీఎం వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

చెట్లకొమ్మల తరలింపు



బాలానగర్, న్యూస్‌టుడే: బాలానగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడలో ఇటీవల కరెంటు సిబ్బంది చెట్లకొమ్మలను కొట్టేసి రోడ్డుపై, ఇళ్ల ముందు గుట్టలుగా వదిలేశారు. స్థానికంగా అపరిశుభ్రత చోటుచేసుకొని ప్రజలు ఇబ్బంది పడుతూ వస్తున్నారు. ఈ విషయాన్ని కూకట్‌పల్లి సర్కిల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డీఈ శ్రీనివాసరావు దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా ఆయన సత్వరమే స్పందించి సిబ్బందితో చెట్లకొమ్మలను తొలగింపజేసి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించి సమస్యను పరిష్కరించారు.

మురుగు కుప్పల తొలగింపు



కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ పరిధి ధర్మారెడ్డికాలనీ ఫేజ్-1లో రహదారిలోని మురుగు కుప్పలను జలమండలి సిబ్బంది తొలగించారు. ఎల్‌ఐజీ నివాసాల సముదాయాల్లో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసి వ్యర్థాలను నడి రోడ్డుపై వదిలేశారు. నివాసితులకు దుర్వాసనతోపాటు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని 'ఈనాడు' జలమండలి మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి కుప్పలను ఎత్తివేయించారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



మూసాపేట, న్యూస్‌టుడే: అల్లాపూర్ పరిధి రామారావునగర్‌లో భూగర్భ మ్యాన్‌హోల్ వ్యవస్థ ధ్వంసమైంది. రోడ్డు మలుపులో ఈ సమస్య నెలకొనడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. వారం రోజులుగా కొనసాగుతున్న దీని గురించి 'ఈనాడు' జలమండలి ప్రాంతీయ మేనేజర్ విలియమ్స్ ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లింది. స్పందించిన ఆయన గురువారం మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు.

విభాగిని పునరుద్ధరణ

స్పందనకు వందనం

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ రోడ్డులో ధ్వంసమైన విభాగినిని జీహెచ్‌ఎంసీ అధికారులు పునరుద్ధరించారు. రైతుబజార్‌కు ముందు ట్రాఫిక్ పోలీసులు కొత్త యూటర్న్ ఏర్పాటుచేశారు. ఇందుకు విభాగినిని తవ్వించారు. ఒకవైపు విభాగిని వ్యర్థాలు రహదారిపై పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. విభాగినిపై రెయిలింగ్ పట్టుకోల్పోయి ధ్వంసమయ్యేలా ఉంది. విభాగినిని సరిచేయాలని 'ఈనాడు'లో 'విభాగిని ధ్వంసం.. పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన వార్త ప్రచురించింది. ఏఈ సాయిప్రసాద్ స్పందించి విభాగినిని పునరుద్ధరించారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్మించండి: ఎమ్మెల్యే


విజ్ఞాన్‌పురికాలనీలో అధికారులతో పర్యవేక్షిస్తున్న కృష్ణారావు

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. గురువారం కూకట్‌పల్లి డివిజన్ విజ్ఞాన్‌పురికాలనీలో వివాదాస్పదమైన రోడ్డు నిర్మాణాన్ని ఆయన కాలనీవాసులు, అధికారులతో కలిసి పర్యవేక్షించారు. వరద కాలువలోకి నీరెళ్లే ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, కూకట్‌పల్లి సర్కిల్ ఈఈ గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కుల పంపిణీ

కూకట్‌పల్లి శేషాద్రినగర్‌లో గురువారం నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన 39మందికి రూ.16,94,500 విలువైన సీఎం సహాయనిధి చెక్కులు ఎమ్మెల్యే కృష్ణారావు పంపిణీ చేశారు.

చెరువుల విస్తీర్ణం, ఆక్రమణల వివరాలివ్వండి

కూకట్‌పల్లి: నియోజకవర్గం పరిధిలోని 8చెరువుల విస్తీర్ణం, ఆక్రమణల వివరాలతో కూడిన సమాచారాన్ని ఇవ్వాలని ఎమ్మెల్యే కృష్ణారావు కలెక్టర్, తహసీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులను కోరారు. గురువారం ఈ మేరకు ఆయా కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. చెరువుల విస్తీర్ణం, ఆక్రమణల విషయంలో ఒక్కో ప్రభుత్వ విభాగం ఒక్కోరకంగా చెబుతున్నారన్నారు. కొందరు రాజకీయ లబ్ధి కోసం ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

సీఎం అవగాహనతో మాట్లాడాలి

సీఎం రేవంత్‌రెడ్డి చెరువులపై పూర్తి అవగాహనతో మాట్లాడాలని ఎమ్మెల్యే ఒక ప్రకటనలో హితవు పలికారు. సున్నం, నల్లచెరువు విషయాలను ఆయన గురువారం ఓ సమావేశంలో ప్రస్తావిస్తూ కూకట్‌పల్లిలోని ఈ రెండింటిలో భారాస నాయకులు ఆక్రమించారనడాన్ని ఖండించారు. వాస్తవాలు తెలుసుకొని అవగాహనతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు.

ఇళ్లల్లోని మురుగును రోడ్ల మీదకు వదిలేస్తే చర్యలు


జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహ సముదాయం వద్ద పర్యటిస్తున్న అశోక్‌రెడ్డి

మూసాపేట, కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: ఇళ్లలోని మురుగును రోడ్ల మీదకు వదిలేస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి అన్నారు. జలమండలి చేపట్టిన 90 రోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా బాలాజీనగర్ డివిజన్‌లోని 15వ ఫేజ్(వెంకటరమణ కాలనీ), కేపీహెచ్‌బీ డివిజన్‌లోని నాలుగో ఫేజ్‌లో ఆయన గురువారం పర్యటించారు. బాలాజీనగర్‌లో అనేక బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించిన మురుగు వీధుల్లో ప్రవహిస్తుండటంపై యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఇళ్ల యజమానులకు తాఖీదులు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు సైతం చేయాలని సూచించారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రెండు పడకల ఇళ్ల ప్రాజెక్టును సందర్శించి మురుగు కనెక్షన్‌ను అనుసంధానం చేయాలన్నారు. జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహసముదాయాలను సందర్శించారు. నాలుగో ఫేజ్‌లో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసే పనులను పరిశీలించారు. కలుషిత జలాల సమస్యపై ఎల్‌ఐజీ బ్లాక్‌ల్లో ఆరా తీశారు. జీఎం ప్రభాకర్‌రావు, డీజీఎంలు శంషీర్, శిరీష, మేనేజర్లు శ్రీకాంత్‌రెడ్డి, సలోమి తదితరులున్నారు.

అన్నదాన పథకానికి విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన పి.వంశీధర్‌రెడ్డి రూ.లక్ష మొత్తాన్ని ఆలయ ఏఈవో రవీంద్రబాబుకు గురువారం అందించారు. దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి, తీర్థప్రసాదాలను అందించారు. సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు ఉన్నారు.

గంజాయి రవాణా.. ఇద్దరి అరెస్టు



బాలానగర్, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ డి.వేణుకుమార్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం మంగెల గ్రామానికి చెందిన పి.వెంకటేశ్(24), ఎం.తరుణ్(24) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందింది. ఎస్సై రఘు నేతృత్వంలోని బృందం ఇందిరాగాంధీపురం వద్ద వాహనాల తనిఖీల్లో వీరిని పట్టుకున్నారు. 4.962కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి గురువారం కోర్టులో హాజరుపరిచారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు


ఫతేనగర్ గౌతంనగర్ వద్ద దాండియా ఆడుతున్న ఎమ్మెల్యే కృష్ణారావు


కూకట్‌పల్లి పాపారాయుడునగర్ ఎన్‌ఎస్‌కే ఎక్సోటికా అపార్ట్‌మెంట్స్‌లో..

కూకట్‌పల్లి, మూసాపేట, న్యూస్‌టుడే: నియోజకవర్గం పరిధిలో బతుకమ్మ సంబరాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం నాలుగో రోజు కూకట్‌పల్లి గ్రామంలోని హనుమాన్ దేవాలయం మైదానంలో సంబరాల్లో మహిళలు పాల్గొని ఆడి.. పాడారు. అనంతరం ఊరేగింపుగా పీఎన్‌ఎం ఉన్నత పాఠశాలకు చేరుకొని అక్కడ కొద్దిసేపు ఆట, పాటలతో అలరించి రంగధాముని చెరువులో నిమజ్జనం చేశారు.


మూసాపేట పరిధి ప్రగతినగర్‌లోని శ్రీసాయి విద్యానికేతన్ హైస్కూల్‌లో..


విద్యార్థినుల నృత్యాలు

హత్యకు గురైన మహిళ ఆచూకీ లభ్యం

మూసాపేట: లోధా టవర్స్ సమీపంలోని ఉదాసీన్ మఠానికి చెందిన ప్రదేశంలో హత్యకు గురైన మహిళ ఆచూకీని కూకట్‌పల్లి పోలీసులు కనుగొన్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలానికి చెందిన ప్రియాంక(30)గా నిర్ధారించారు. రెండేళ్లుగా భర్తతో విడిపోయి సొంతూరులోనే ఉంటున్న ఆమెకు కుమార్తె సంతానంగా తెలుస్తోంది. ఉపాధి కోసం 2నెలల క్రితం నగరానికి వచ్చిన ఆమె కేపీహెచ్‌బీకాలనీ మెట్రో స్టేషన్ కింద ఉన్న పాదచారుల మార్గంపైనే నిద్రపోయేదని సమాచారం. గుర్తు తెలియని వ్యక్తి ఆమెను ఉదాసీన్ మఠం స్థలానికి తీసుకెళ్లి హత్య చేశాడు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. రెండు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశాలున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

అత్యాచార కేసు బాధితురాలిపై తప్పుడు ప్రచారం.. కేసు

ఈనాడు, హైదరాబాద్: తనపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ యూట్యూబర్ హర్షసాయిపై నమోదైన అత్యాచార కేసులో బాధితురాలు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పుడు ఆడియోకాల్ రికార్డింగ్స్, అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న విజ్ఞాన్, మహిధర్, శేఖర్‌భాషాపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అడ్డంకులు తొలగిస్తేనే సాఫీగా రాకపోకలు

పాదచారుల వంతెన వ్యర్థాలు తొలగించినా పునరుద్ధరించని రహదారి

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ-హైటెక్ సిటీ రద్దీ మార్గంలో రాకపోకలకు నిత్యం ఒక అడ్డంకి ఉంటుంది. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులకు ప్రణాళిక లేకపోవడమే ఇందుకు కారణం. జేఎన్‌టీయూ చౌరస్తా దాటితే నాలుగు, ఏడో ఫేజ్ మధ్య ఉన్న పైవంతెన వరకు ప్రధాన రహదారి, పైవంతెనలు అందుబాటులో ఉన్నా సరైన సర్వీస్ రహదారుల్లేక ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఇన్ని రోజులు రైతుబజారు దాటి నిరుపయోగంగా పాదచారుల వంతెన సామగ్రి ఉండటంతో రాకపోకలకు ఇబ్బంది కలిగిన సంగతి తెలిసిందే. అవి తొలగినా ప్లాట్‌ఫామ్‌ల మాదిరి అడ్డంకులు అలానే ఉండిపోయాయి.


రైతుబజారు దాటిన తర్వాత ధ్వంసమైన కాలిబాట

రైతుబజారు దాటాక..

రైతుబజారు దాటిన తర్వాత పైవంతెన, సర్వీస్ రహదారి మొదలవుతాయి. పూర్తిస్థాయి సర్వీస్ రోడ్డు అందుబాటులో లేక వంతెన ఎక్కాలన్నా, సర్వీస్ రహదారిలోకి వెళ్లాలన్నా అయోమయమే. మరోవైపు పాదచారుల వంతెన సామగ్రి తొలగించిన చోట భారీగా వరద నిలుస్తోంది. అధికారులకు ఫిర్యాదులు అందినా ఫలితం లేదు. అక్రమంగా వాహనాలు నిలుపుతున్నారు. కాలిబాటలు సైతం ధ్వంసమై వరద నిలుస్తోంది.

వంతెన దిగే చోట ఇరుకు

జేఎన్‌టీయూ చౌరస్తా వైపు వంతెన దిగే చోట ఇరుకుగానే ఉంటోంది. బాక్స్ డ్రెయిన్ పనులు సగంలోనే ఆగిపోయాయి. పాదచారుల వంతెన సామగ్రి తొలగినా బాక్స్‌డ్రెయిన్ అడ్డుగా ఉంది. సర్వీస్ రహదారి సరిగా లేకపోవడంతో వంతెన దిగే వాహనాలకు సర్వీస్ రోడ్డులో నుంచి వచ్చే వాహనాలతో విఘాతం కలుగుతోంది. అధికారులు కేవలం పాదచారుల వంతెన సామగ్రి తొలగించిన ప్రదేశాన్నే చదును చేస్తే సరిపోదు. పూర్తిస్థాయి సర్వీస్ రహదారిని తయారుచేస్తేనే వాహనదారుల ప్రయాణానికి సాఫీగా ఉంటుంది. నీరు నిలవకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. అడ్డదిడ్డంగా ఉన్న కాలిబాటనూ సరిచేయాల్సి ఉంది.


రహదారి అభివృద్ధి చేయాల్సిన ప్రదేశం

జీహెచ్‌ఎంసీకి లేఖ రాశాం: వెంకట్, కేపీహెచ్‌బీ ట్రాఫిక్ సీఐ

రహదారులను అభివృద్ధి చేయాలని జీహెచ్‌ఎంసీకి లేఖ రాశాం. రహదారులు పూర్తయ్యాక చర్యలు చేపడతాం.

తొందర్లోనే పునరుద్ధరిస్తాం: సాయిప్రసాద్, ఏఈ

వంతెన సామగ్రి తరలించడంతో రహదారులను పునరుద్ధరిస్తాం. సర్వీస్‌రోడ్డుకు అనుసంధానం చేసి ప్రయాణం సాఫీగా ఉండేలా తీర్చిదిద్దుతాం. కాలిబాటలు సరిచేస్తాం.

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

పార్కింగ్ ప్రాంతం కాదు.. సర్వీసు రోడ్డే



ఇది పార్కింగ్ ప్రాంతమనుకుంటే మీరు పప్పులో కాలేసినట్టే. ఇది పటాన్‌చెరు పట్టణం నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లే దారి పక్కన ఉన్న సర్వీసు రోడ్డు. హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ద్విచక్రవాహనాలు ఈ సర్వీసు రహదారిపై నిలిపి.. సమీపంలోని బస్టాండ్‌కు వెళ్లి బస్సుల్లో తమ గమ్యస్థానాలకు వెళ్తుంటారు. సాయంత్రం వచ్చి తమ వాహనాలు తీసుకెళ్తుంటారు. ఇలా సర్వీస్ రోడ్డును మొత్తం ఆక్రమించి వాహనాలు నిలపడంతో ఆ దారిలో రాకపోకలకు స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. - న్యూస్‌టుడే, పటాన్‌చెరు అర్బన్

నయన మనోహరం... నాట్యనవదుర్గామృతం



మాదాపూర్, న్యూస్‌టుడే: శిల్పారామంలో గురువారం శాస్త్రీయ, జానపద కళారూపాలు ఆకట్టుకున్నాయి. ఎస్వీజీ కళావర్షిణి డ్యాన్స్ అకాడమి గురువు సంధ్యారాణి శిష్యబృందం ప్రదర్శించిన భరతనాట్యం నయనమనోహరంగా సాగింది. నాట్యనవదుర్గామృతం పేరిట చిన్నారులు అమ్మవారి విభిన్న రూపాలు ప్రదర్శించి చూపరులను కట్టిపడేశారు. జిల్లాల నుంచి వచ్చేసిన కళాకారులు థింసా, కొమ్ముకోయ, గుస్సాడి నృత్యాలతో అలరించారు.

సిబ్బంది లేక ఇబ్బంది

శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని సర్కిళ్లలో మైక్రో శానిటేషన్ విధానానికి శ్రీకారం చుట్టారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ ప్రక్రియని పలు విధానాలుగా ముందుకు తీసుకెళ్లి పారిశుద్ధ్య ప్రక్రియలో తిరుగులేని విధంగా చేయాలని ఆలోచన చేస్తున్నారు. -న్యూస్‌టుడే, శేరిలింగంపల్లి,

వినాయక చవితి ముందు వరకు మైక్రో శానిటేషన్ విధానాన్ని ముందుకు తీసుకెళ్లారు. ప్రధాన రహదారుల్లో సిబ్బందికి బాధ్యత ఇచ్చి కొంత దూరాన్ని వారికి కేటాయించి చెత్తాచెదారం కనపడకుండా

మైక్రో శానిటేషన్‌కు అడ్డంకులు



రాఘవేంద్ర కాలనీలో పేరుకున్న చెత్త

చేయడం, వ్యాపార సముదాయాల నుంచి రోడ్డుపై చెత్త పడకుండా చేయడం, రోడ్ల పక్కన పిచ్చి మొక్కలు తొలగింపు దగ్గర నుంచి పూర్తిస్థాయిలో ప్రధాన రహదారులు అద్దంలా ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ ప్రక్రియతో ప్రధాన రహదారుల్లో అత్యధిక శాతం ఆశించిన ఫలితాలు సాధించగలిగారు.

మరో అడుగు ఇబ్బందిగా మారి

మరో ప్రక్రియలో కాలనీలు బస్తీల సంక్షేమ సంఘాలకు కార్మికులను అప్పగించి వారి ఆధ్వర్యంలోనే వారివారి ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా పర్యవేక్షణ బాధ్యత అందించాలని భావించారు. ఈ ప్రక్రియ ముందుకు అడుగు పడలేదు. ప్రధానంగా కార్మికుల కొరత ఇబ్బందిగా మారింది.

పేరుకుపోతున్న చెత్త కుప్పలు

కాలనీలు, బస్తీ ప్రాంతాల్లో పెద్దఎత్తున చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ఎప్పటికప్పుడు చెత్త కుప్పలు తరలించాల్సిన రాంకీ వాహనాలు సక్రమంగా రాకపోవడం, అధికారులు, సిబ్బందికి వారిపై పట్టు తప్పిపోవడంతో పారిశుద్ధ్యం అదుపు తప్పింది.

ఆటోల పరిస్థితి అంతంతే

ప్రధానంగా వీధుల పక్కన చెత్తకుప్పలు ఏర్పడకుండా ఉండాలంటే ఇంటింటి నుంచి చెత్త సేకరణ సక్రమంగా సాగితే కొలికి వస్తుందని భావించారు. స్వచ్ఛ ఆటోలపై పర్యవేక్షణ లోపించడం, పలు కాలనీలు, బస్తీవాసులకు సరైన అవగాహన కల్పించకపోవడంతో మార్పు రావడం లేదు.

లోపాలు కఠినంగా సవరిస్తేనే ఫలితం

జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పారిశుద్ధ్యం ప్రణాళిక ప్రకారం గాడిన పెట్టాలని దృఢ సంకల్పంతో ఉన్నారు. క్షేత్రస్థాయిలో సవాళ్లు అన్ని ఇన్ని కాకుండా మారాయి. ముఖ్యంగా స్వచ్ఛ ఆటోలపై పట్టు సాధించాలి. చెత్త కుప్పలు రోజూ తరలిపోయేలా వాహనాలు క్రమబద్ధీకరించాలి. చెట్ల కొమ్మల తరలింపు ఎక్కడ సక్రమంగా సాగని దుస్థితి. ఇలా ప్రతి అంశం దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తేనే సత్ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

సంఖ్య పెరిగినా..

☛ పటాన్‌చెరు జడ్పీ ఉన్నత పాఠశాలలో వసతుల లేమి

సౌకర్యాలు మెరుగుపడలే

పటాన్‌చెరు అర్బన్, న్యూస్‌టుడే: కార్పొరేట్ స్థాయిలో ఆంగ్లంలో విద్యాబోధన అమలుచేయడంతో పటాన్‌చెరులోని జడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. పేద, మధ్య తరగతి కార్మికుల కుటుంబాల పిల్లలు చదువుతున్న పాఠశాలలో ఉపాధ్యాయులు, తరగతి గదులు, సౌకర్యాలు కొరత ఇబ్బందిగా మారింది.



గేటు ముందే నిర్వహిస్తున్న కూరగాయల దుకాణాలు

పెరిగిన విద్యార్థులు

గతంలో నిర్వహించిన పాఠశాల స్థలం, భవనం కోర్టు కేసులో ఉండటం, శిథిలావస్థకు చేరుకోవడంతో అప్పటినుంచి ప్రాథమిక పాఠశాల కోసం ఏర్పాటుచేసిన భవనంలో నిర్వహిస్తున్నారు. జడ్పీఉన్నత పాఠశాలకు అనువుగా భవనం, గదులు నిర్మించినా విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతుంది.

- 19 మంది ఉపాధ్యాయులు ఉండగా విద్యార్థులు నిష్పత్తి దృష్ట్యా తెలుగు, హిందీ, ఆంగ్లం, ఫిజికల్‌సైన్స్, బయాలజికల్ సైన్సు బోధించేందుకు అదనపు ఉపాధ్యాయులు అవసరమన్నారు.
- 11 తరగతి గదులు ఉన్నాయి. నిర్వహణకు మరో నాలుగు అవసరం. ఫర్నిచర్ కొరత కూడా ఉంది.
- పెరుగుతున్న విద్యాప్రమాణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా కంప్యూటర్ ల్యాబ్ అవసరం కూడా ఉంది. కంప్యూటర్ ఆపరేటర్ లేక ఉపాధ్యాయులే దాని నిర్వహణ చూస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు కూడా లేదు.

వాచ్‌మెన్ లేక..

పటాన్‌చెరు మార్కెట్ ప్రాంతానికి ఆనుకుని జడ్పీఉన్నత పాఠశాల ఉండటం, ప్రత్యేకంగా వాచ్‌మెన్ లేక పాఠశాల ముందున్న చిరువ్యాపారులు పాఠశాల మూత్రశాలలను వినియోగిస్తున్నారు. నీటిని కూడా వాడేందుకు వచ్చి కుళాయిలు విరగగొట్టడంతో మళ్లీ మరమ్మతులకు సమయం పడుతుంది. దీంతో ఇబ్బందులు పడాల్సివస్తోంది.

అదనపు సౌకర్యాలు అవసరం

- లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు

జడ్పీ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్ అవసరం దృష్ట్యా సీఎస్‌ఆర్ నిధులతో త్వరలో ఏర్పాటు చేయనున్నారు. సైన్సు ల్యాబ్ ఏర్పాటుచేయాల్సి ఉంది. 4 తరగతి గదులు, ఉపాధ్యాయులు అవసరం ఉన్నారు. పాఠశాలలో 15 సెక్షన్లు నిర్వహించాల్సి ఉండగా, తరగతి గదులు లేక 13 మాత్రమే నిర్వహిస్తున్నాం.

గతేడాది విద్యార్థుల సంఖ్య	ఈ ఏడాది
653	729

మేమున్నాం.. మీకు తోడుగా

శేరిలింగంపల్లి: 8008573411 మాదాపూర్: 8008573414
మియాపూర్- 7569067467 ఆల్విన్‌కాలనీ -9154945201
రాయదుర్గం - 9848990352,
పటాన్‌చెరు(రూ) - 8008573228
చందానగర్ - 8008555322

రామచంద్రాపురం రూరల్, చందానగర్, శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే:

? తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో రేడియల్ రోడ్డు నుంచి ఈదులనాగులపల్లి వద్ద రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. - కృష్ణకుమార్, ఘన్‌పూర్

✓ రేడియల్ రోడ్డు నుంచి కిందికి దిగడానికి పూర్తి అనుమతి ఇంకా రాలేదు. విధి విధానాలు ఖరారు అయిన తర్వాత సిగ్నల్స్ ఏర్పాటు చేస్తాం. - సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ తెల్లాపూర్

? చందానగర్ మంజీరారోడ్డు చిరు వ్యాపారుల ఆక్రమణలతో వీధిలో నడిచేందుకు వీల్లేకుండా ఉంది. - సరోజ, చందానగర్

✓ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.- పవన్, సీఐ ట్రాఫిక్ రాణా ఖేల్

? శేరిలింగంపల్లి పాపిరెడ్డి కాలనీ ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. - రాజు యాదవ్, పాపిరెడ్డి కాలనీ

✓ ఇప్పటికే ఆ ప్రాంతంపై దృష్టి సారించి చర్యలు తీసుకుంటున్నాం. అన్ని ప్రాంతాలు పరిశీలించి పూర్తిస్థాయిలో చెత్తకుప్పలు తొలగించేలా సిబ్బందిని ఆదేశిస్తాం. -శ్రీకాంత్‌రెడ్డి, సహాయ వైద్యాధికారి, శేరిలింగంపల్లి

? చందానగర్ హుడా కాలనీ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ వైపు అనేక చోట్ల చెత్త పేరుకుపోయింది. -వెంకటరెడ్డి, చందానగర్ హుడా కాలనీ

✓ సిబ్బందికి ఆదేశాలిచ్చి చెత్తకుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం. -కేఎస్ రవి, సహాయ వైద్యాధికారి, చందానగర్ సర్కిల్

స్పందనకు వందనం

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని బీహెచ్ఈఎల్ పాత ఎంఐజీ కాలనీ రామాలయం దగ్గర పేరుకుపోయిన చెత్త తరలించి శుభ్రం చేసే ప్రక్రియ మొదలుపెట్టారు. స్థానికులు సమస్యను 'ఈనాడు' దృష్టికి తీసుకురావడంతో శేరిలింగంపల్లి సహాయ వైద్యాధికారి శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది చెత్త తరలించారు.

వీధుల్లో రూపం.. కాన్వాస్‌పై ప్రతిబింబం



వీధుల్లో భవనాలు చూస్తూ డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: ఊహల్లో ఉన్న భవనాన్ని బొమ్మగా చిత్రీకరించి చూపించడంలో నైపుణ్యం సాధించాలని ఆర్కిటెక్చర్ శిక్షకురాలు సానియా షర్ఫున్నీసా అన్నారు. గురువారం రుద్రారం గ్రామం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆర్కిటెక్చర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఊహించిన చిత్రాన్ని స్కెచ్చింగ్ చేయడంలో అవలంబించాల్సిన మెలకువలపై పట్టు సాధించాలని సూచించారు.

లయన్స్ క్లబ్ సేవల్లో భాగస్వామ్యం పెంచాలి

చందానగర్, న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్ సేవలు మరింత విస్తృతం చేసి అందరినీ భాగస్వామ్యం చేయాలని క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబూరావు పేర్కొన్నారు. గురువారం చందానగర్ ఇంజినీర్స్ ఎన్‌క్లేవ్‌లో లయన్స్‌క్లబ్ రీజియన్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. లయన్ బాబూరావు ముఖ్యఅతిథిగా పాల్గొని క్లబ్ సేవా కార్యక్రమాలు అడిగి తెలుసుకొని, సభ్యుల సంఖ్య పెంచాలని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులకు సూచించారు. లయన్స్ రీజియన్ ఛైర్మన్ కరుణాకర్‌గౌడ్, కార్యదర్శి సుధీర్, ప్రతినిధులు కొండా విజయ్‌కుమార్, శేఖర్‌గౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, యాదగిరిగౌడ్, అశోక్‌గౌడ్, జనార్దన్‌రెడ్డి, మధుసూధన్‌రెడ్డి, శాంతిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలని వినతి



ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

వివేకానందనగర్‌కాలనీ, న్యూస్‌టుడే: గచ్చిబౌలి డివిజన్ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని కోరారు. గురువారం వివేకానందనగర్‌కాలనీలో ఆయన్ని కలిసి వినతిపత్రం సమర్పించారు. అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్లు పూర్తిచేయాలని, పెండింగు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రపంచస్థాయిలో పోటీపడేలా పర్యాటకాభివృద్ధి: జూపల్లి

రాయదుర్గం, న్యూస్‌టుడే: ప్రపంచ స్థాయిలో పోటీపడేలా రాష్ట్ర పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తున్నామని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అనేక అత్యంత ఆకర్షణీయ సందర్శనీయ స్థలాలున్నా రాష్ట్ర పర్యాటక రంగం దశాబ్దాలుగా ర్లక్ష్యానికి గురైందని చెప్పారు. వసతులు కల్పించి.. మార్కెటింగ్ చేసి పర్యాటకులను ఆకర్షించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. మాదాపూర్ హెచ్ఐసీసీలో నాగాలాండ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హార్న్‌బిల్ మ్యూజిక్ ఫెస్టివల్ ప్రచార కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జూపల్లి మాట్లాడుతూ.. 'నాగాలాండ్ టూరిజాన్ని ప్రమోట్ చేసుకునేందుకు ఆ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి టెమ్‌జెన్ ఇమ్నా అలాంగ్, బృందం ఇక్కడికి వచ్చారు. తెలంగాణ పర్యాటక ప్రదేశాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలిపేందుకు దుబాయి, అమెరికాల్లో అంతర్జాతీయ టూరిజం సదస్సులకు వెళ్తున్నాం. రూ.వందల కోట్ల విలువైన పర్యాటక ఆస్తుల తగిన విధంగా ఉపయోగించుకుని వృద్ధిలోకి తీసుకొస్తాం' అని మంత్రి పేర్కొన్నారు. నాగాలాండ్ మంత్రి టెమ్‌జెన్ ఇమ్నా అలాంగ్ మాట్లాడుతూ.. నాగాలాండ్ రాజధాని కోహిమాలో ఈనెల 18-21 వరకు దేశంలోనే అతిపెద్ద 'హార్న్‌బిల్ మ్యూజిక్ ఫెస్టివల్' జరుగుతుందని తెలిపారు. భారత్‌లోనే అతిపెద్ద బ్యాండ్ పోరుగా పేరున్న ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచే విజేతలకు రూ.20 లక్షలు, రెండు, మూడు స్థానాల్లో నిలిచే వారికి రూ.10లక్షలు, రూ.5లక్షల నగదు, వ్యక్తిగతంగా ప్రతిభచాటే వారికి రూ.5లక్షల విలువైన సంగీత పరికరాలు అందజేస్తామని చెప్పారు. తెలంగాణ, ఏపీతో కలిసి పర్యాటకాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. వేడుక నిర్వహణకు శ్రేయాస్ గ్రూప్ సంస్థ, సుచిర్ ఇండియా గ్రూప్ సంస్థలతో నాగాలాండ్ టూరిజం శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సుచిర్ ఇండియా గ్రూప్ ఎండీ కిరణ్, శ్రేయాస్ గ్రూప్ డైరెక్టర్ శ్రీనివాస్, ఆర్టిస్ట్ కనెక్ట్ సంస్థ సీఈఓ ఉజ్జల్ ముఖియా, నాగాలాండ్ సీఎం సలహాదారుడు అబు మెహ్‌తా, టీఏఎఫ్ఎంఏ సంస్థ ఛైర్మన్ తేజా మేరు పాల్గొన్నారు. సంగీత దర్శకుడు రమణ గోగుల సంగీత విభావరి అలరించింది.



మ్యూజిక్ ఫెస్టివల్ టికెట్లు ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి, నాగాలాండ్‌మంత్రి టెమ్‌జెన్ ఇమ్నా అలాంగ్, కిరణ్, శ్రీనివాస్‌రావు, రమణగోగుల, అబుమెహ్‌తా తదితరులు

పైపులైన్ల శుభ్రతా పనులు షురూ

రామచంద్రాపురం రూరల్: పైపులైన్లలో మురుగు, ఇతర వ్యర్థాలు, పూడికను తొలగించేందుకు 90 రోజుల కార్యాచరణ చేపట్టినట్లు కార్పొరేటర్ పుష్ప తెలిపారు. గురువారం రామచంద్రాపురం డివిజన్ శ్రీనివాస్ నగర్‌లో యంత్రాలతో పైపులైన్ల శుభ్రం చేసే పనులు ప్రారంభించారు.

27న మాలమహానాడు కార్యవర్గ సమావేశం

హిమాయత్‌నగర్: నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఈనెల 27న జరిగే మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్.రాజు పిలుపునిచ్చారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని సంస్థ కేంద్ర కార్యాలయంలో పదాధికారుల సమావేశంలో పలు తీర్మానాలు ఆమోదించారు.

ఘనంగా దేవీశరన్నవరాత్రి వేడుకలు



వివేకానందనగర్‌కాలనీలో ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు



సుమిత్రానగర్‌లోని కనకదుర్గాదేవి



పీజేఆర్ స్టేడియం కట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారు



మల్లికార్జున్ నగర్‌లో కొలువుదీరిన బాలా త్రిపుర సుందరిదేవి అమ్మవారు



పాపిరెడ్డి కాలనీ రాజీవ్ స్వగృహ ఆరంభ టౌన్‌షిప్‌లో..

శేరిలింగంపల్లి, వివేకానందనగర్‌కాలనీ, రామచంద్రాపురం రూరల్, చందానగర్, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం మొదటిరోజు సుమిత్రానగర్ కనకదుర్గాదేవి అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకొని వివేకానందనగర్‌కాలనీకి చెంది లక్ష్మి తన నివాసంలో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటుంది. పటాన్‌చెరు నియోజకవర్గం రామచంద్రాపురం డివిజన్ పరిధి మల్లికార్జున్ నగర్‌లో దుర్గా భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అష్టాదశ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బాల త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు.

బతుకమ్మ సంబురాలు



చందానగర్ గిరిజా మార్వెల్ అపార్ట్‌మెంట్ వద్ద..

చందానగర్, న్యూస్‌టుడే: చందానగర్ ప్రజ్ఞ డిగ్రీ కళాశాల బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. గురువారం ఎస్ఎన్ రెడ్డి గార్డెన్స్‌లో జరిగిన బతుకమ్మ ఉత్సవాలను కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్స్ విజయలక్ష్మి, బాలకృష్ణతో కలిసి ప్రారంభించారు. విద్యార్థినులు పూలతో బతుకమ్మను పేర్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు.



ప్రజ్ఞ కళాశాల విద్యార్థినుల ఆటాపాట

నాదబ్రహ్మోత్సవాలు ప్రారంభం

మాదాపూర్, న్యూస్‌టుడే: దసరా నవరాత్రుల నేపథ్యంలో మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో గురువారం నాదబ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. గోరుకంటి మేఘన శిష్యబృందం చూడముచ్చటైన శాస్త్రీయ నృత్యంతో చూపరులను ఆకట్టుకుంది. నాట్యకళారంగంలో అందిస్తున్న సేవలకుగాను నృత్యకళాకారిణి, డా.అలేఖ్య పుంజలకు అన్నమాచార్య భావనా వాహిని తరఫున ప్రకటించిన 'లాస్యసంజీవని' బిరుదును దేవనార్ ఫౌండేషన్ అధినేత సాయిబాబాగౌడ్ చేతుల మీదుగా బిరుదు అందజేశారు. అన్నమాచార్య భావనా వాహిని వ్యవస్థాపకురాలు డా.శోభారాజు, ట్రస్టీ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి గుర్తింపు

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్ ఠాణా పరిధిలో గతనెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. మియాపూర్ మెట్రో స్టేషన్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా అప్పట్లో అతని వద్ద గుర్తింపు ఆధారాలు లభించలేదు. వాహన వివరాలు సైతం పోలీసులకు అందలేదు. ఈ కేసు విచారణను చేపట్టిన ఎస్సై మాణిక్యం సిబ్బంది సాయంతో ప్రమాదం జరిగిన ప్రాంతంలో దొరికిన చిన్న ఆధారాలతో దర్యాప్తు నిర్వహించగా మృతుడు నాగర్ కర్నూలు జిల్లా బిజినేపల్లి మండల కేంద్రానికి చెందిన కోటయ్య(35) గుర్తించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని సైతం సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించామని ఎస్సై తెలిపారు. కోటయ్య భార్య చనిపోవడంతో ఒంటరిగా మియాపూర్ లక్ష్మీనగర్‌లో ఉంటూ మేస్త్రి పనులు చేస్తూ జీవిస్తున్నాడని వారి బంధువులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.

NOTICE
IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE VIKARABAD DISTRICT, AT VIKARABAD
E.P. No. 29 of 2019
IN
O.S. No. 123 of 2005

Between:
Smt. LAXMI
...Decree Holder/ Plaintiff
AND
P.HANMANTH REDDY & others
...Judgement Debtors/ Defendants

To,
S.Shekar Goud S/o Prabhu Goud, Aged about: 40 Years, Occ: Business, R/o H. No. 2-38, Plot No. 11, Shivajinagar, Sherilingampally Mandal, Hyderabad. **(JDR No. 3)**

Please take Notice that the Decree Holder/ Plaintiff filed the above Execution Petition for execution of Decree dated **05-06-2017** in **O.S. No. 123 of 2005** on the file of Senior Civil Judge, at Vikarabad in respect of the Suit Schedule Property all that the Agriculture Land in Sy.No. 287/A, Admg. Ac. 2-21 gts., situated at Nagireddypalle Village, of Chittigidda Revenue Village, Nawabpet Mandal, Vikarabad District.

Therefore, you are required to appear before the above Court on **13-11-2024 at 10:30 A.M.** in person or through Advocate duly instructed, failing which matter will be heard in your absence.

// BY ORDER OF THE COURT //
Sd/- **M.MAHESHWAR,** Advocate
H.No. 4-3-14, Near Thahsildar Office, A.G. Road, Vikarabad., **Cell: 9440392970.**

ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు



తెల్లాపూర్‌లో సర్వేలో పాల్గొన్న రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి

రామచంద్రాపురం రూరల్, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని రెవెన్యూ అదనపు కలెక్టర్ మాధురి అన్నారు. గురువారం తెల్లాపూర్ పురపాలక పరిధి ఎంఐజీ కాలనీ మూడో వార్డులో ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఆమె మాట్లాడుతూ.. కుటుంబ డిజిటల్ కార్డులు అందించేందుకు వీలుగా ప్రయోగాత్మకంగా సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా నియోజకవర్గం యూనిట్‌గా పట్టణ ప్రాంతంలో మున్సిపల్ వార్డు, మండలంలో ఒక గ్రామాన్ని ప్రయోగాత్మకంగా ఎంపిక చేసి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో పట్టణ ప్రాంతంగా ఉన్న తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు, గ్రామీణ ప్రాంతంగా జిన్నారం మండలం మంగంపేట గ్రామాలను ఎంపిక చేశామని తెలిపారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ఎంఐజీ కాలనీ మూడో వార్డులో 287 ఇళ్లు ఉన్నాయని చెప్పారు. వీటిల్లో నివసిస్తున్న కుటుంబం యూనిట్‌గా ఒక డిజిటల్ కార్డు జారీ చేస్తామన్నారు. సర్వే చేయడానికి మూడు బృందాలను నియమించామని చెప్పారు. రెండు ప్రాంతాల్లో ఆరు బృందాలకు డివిజన్ అధికారిగా పటాన్‌చెరు మండల ప్రత్యేక అధికారి దేవుజ వ్యవహరిస్తారని చెప్పారు.

పెళ్లి జరుగుతుందో లేదోనని యువతి ఆత్మహత్య

పటాన్‌చెరు అర్బన్: ప్రేమించి వ్యక్తి పెళ్లి చేసుకుంటాడో లేదోననే అనుమానంతోనే అరబిందో పరిశ్రమలో కార్మికురాలు శ్రావణి(23) ఆత్మహత్య చేసుకుందని పటాన్‌చెరు పోలీసులు తెలిపారు. ఈ పరిశ్రమలో శ్రావణి మూడేళ్లుగా పనిచేస్తుండగా.. రెండేళ్ల నుంచి మరో కార్మికుడు పెళ్లయి ఇద్దరు పిల్లలున్న వ్యక్తిని ప్రేమించింది. దీనికితోడు సహచర కార్మికురాలు పెళ్లయిన వ్యక్తిని ప్రేమించడం ఏమిటని అడిగేవారు. అయితే శ్రావణి ప్రేమించే విషయం కార్మికుని భార్యకు కూడా తెలిసింది. దీనితో ప్రేమించిన వ్యక్తి తనను పెళ్లిచేసుకుంటాడో లేదో అని అనుమానంతో బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు చున్నీతో ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత బలవన్మరణం

పటాన్‌చెరు అర్బన్: ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పటాన్‌చెరు ఎస్సై వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మహాలక్ష్మణుడు మూడేళ్ల క్రితం భార్య శ్రీవాణి(34)తో కలిసి ఇంద్రేశంలో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు. బుధవారం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన శ్రీవాణి పడకగదిలోకి వెళ్లింది. ఎంతసేపటికి తలుపు తీయకపోవడంతో తలపు పగులగొట్టి చూడగా ఆమె ఫ్యానుకు వేలాడుతూ కన్పించింది. ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మహాలక్ష్మణుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బాయిలర్‌లో నీరు మీద పడి ఇద్దరికి గాయాలు

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: ప్రైవేట్ పరిశ్రమలో బాయిలర్ తెరుస్తుండగా వేడి నీరు శరీరంపై పడి ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. బీడీఎల్ సీఐ స్వామిగౌడ్ వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం శేరిగూడెం గ్రామానికి చెందిన శంకర్, కృష్ణంరాజు పాశమైలారం పారిశ్రామికవాడ సింథోకెమ్ ల్యాబ్స్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. గురువారం తెల్లవారుజాము రెండు గంటల సమయంలో బాయిలర్ తలుపు తెరిచిన సమయంలో వేడి నీరు శంకర్, కృష్ణంరాజుపై పడ్డాయి. తల కింది భాగం నుంచి కాళ్ల వరకు వేడి నీటితో కాలి గాయాలయ్యాయి. వారిని పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీవో అపోలో ఆసుపత్రిలో చేర్పించారు. శంకర్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కుత్బుల్లాపూర్

దసరా పండగకు జీడిమెట్ల డిపో నుంచి ప్రత్యేక బస్సులు

జీడిమెట్ల, న్యూస్‌టుడే: ప్రయాణికుల డిమాండ్ మేరకు.. ప్రత్యేక బస్సు సర్వీసులను కొనసాగిస్తామని జీడిమెట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. జీడిమెట్ల పరిసర ప్రాంతాల్లో నివాసముండే వారు పదిహేను మంది కలిసి.. ఓ ప్రాంతానికి వెళ్లాలని మా దృష్టికి తీసుకొస్తే.. వెంటనే బస్సును ఏర్పాటు చేస్తామని చెప్పారు. మంచిర్యాల, నిర్మల్, ఆర్మూర్, నిజామాబాద్, కరీంనగర్, కోదాడ, ఖమ్మం ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు సంప్రదించాలని సూచించారు. డిమాండ్‌కు అనుగుణంగా సర్వీసులు ఉంటాయని చెప్పారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్ - 9959226150, అసిస్టెంట్ మేనేజర్- 7382822588లను సంప్రదించవచ్చు.

ఊరెళుతున్నారా.. ఈ జాగ్రత్తలు పాటించండి


సీఐ విజయవర్ధన్

పేట్‌బషీరాబాద్: దసరాకు సొంతూళ్లకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలని పేట్‌బషీరాబాద్ సీఐ కె.విజయవర్ధన్ సూచించారు. ఠాణాలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ... బంగారు, వెండి ఆభరణాలు, విలువైన ఇతర వస్తువులు ఇళ్లలో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. ఇంటి వద్ద సెక్యూరిటీ అలారం, సెంట్రల్ లాక్ సిస్టం ఏర్పాటు చేసుకోవటం శ్రేయస్కరమని చెప్పారు. కాలనీలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న వారి కదలికలపై నిఘా ఉంచాలన్నారు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా 100కు డయల్ చేయాలని కోరారు. వాహనాలకు చైన్‌లతో లాక్ ఏర్పాటు చేసుకోవాలని, ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీని ఆన్‌లైన్ ద్వారా ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలన్నారు. ఊరెళ్లే వారు ఠాణాలో సమాచారం ఇస్తే వారి ఇళ్ల వద్ద పెట్రోలింగ్ పెంచుతామన్నారు.

రియల్ ఎస్టేట్ ఏజెంటులా సీఎం తీరు: ఎమ్మెల్యే

ఫిల్మ్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు వ్యక్తిగత శ్రేయస్సు కోసం పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ ఏజెంటుగా పనిచేస్తున్నారని, ఫోర్త్‌సిటీ సీఎం రేవంత్‌రెడ్డి ఊహల, కల్పిత నగరమన్నారు. భారాస ప్రభుత్వం 69 కిలోమీటర్ల మేర మెట్రోను పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందని, రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు తీసుకెళ్లాలని కేసీఆరే నిర్ణయం తీసుకున్నారన్నారు. రెండవ దశ మెట్రో పనులకు గతంలో రూ.24 వేల కోట్లు బడ్జెట్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.11కోట్లు మాత్రమే కేటాయించిందని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి మెట్రో అవసరం ఉందని ఎన్నికల ప్రచారంలో చెప్పి, అధికారంలోకి రాగానే మోసం చేశారన్నారు. మేడ్చల్ మెట్రో సాధన సమితి పేరుతో మెట్రో రైలు కావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని గుర్తు చేశారు. హైదరాబాద్ నగరం నుంచి ఒక్క మంత్రి లేరని శాఖలన్నీ ముఖ్యమంత్రి వద్దే ఉండటం వల్ల అభివృద్ధి పనులు అరకొరగా జరుగుతున్నాయన్నారు.

సంచార వైద్య సేవలు అందించాలి: సీపీఎం

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: సూరారం డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించాలని గురువారం సర్కిల్ డీఈ శిరీషకు సీపీఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి...పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. వాతావరణ మార్పులతో జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో పేదలకు సంచార వైద్య సేవలు అందించాలని సూచించారు. పార్టీ మండల కార్యదర్శి లక్ష్మణ్, శాఖ కార్యదర్శులు అంజయ్య, స్వాతి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నిర్వహణ అస్తవ్యస్తం..!

నీటి ట్యాంకుల్లో దుమ్ము, ధూళి

జీడిమెట్ల,న్యూస్‌టుడే: ఆ ట్యాంకుల నుంచి నీటిని లక్షలాది మందికి చేరవేస్తారు. కొంత మంది తాగేందుకు వినియోగిస్తే.. మరికొందరు వాడుకునేందుకు ఉపయోగిస్తారు. ట్యాంకుల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కాలపరిమితిలోగా శుభ్రం చేయకపోవడంతో దుమ్ము, ధూళి పేరుకుపోయింది.

రెండు ప్రాంతాల్లో...

జలమండలి అధికారులు ట్యాంకులను జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని రెండు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఒకటి మిలియన్ లీటర్లు, మరొకటి రెండు మిలియన్ల సామర్థ్యంతో ఉన్నాయి. వాటికి గోదావరి జలాలు వస్తాయి. ఆ నీటిని ట్యాంకుల్లో నిల్వ ఉంచాల్సి ఉంటుంది. జలమండలి ద్వారా ఆన్‌లైన్‌లో గృహ, వాణిజ్య అవసరాలకు బుక్ చేసుకున్న వారికి ట్యాంకర్ల ద్వారా అందించడంతోపాటు సూరారం కాలనీ, దుండిగల్, గండిమైసమ్మ ప్రాంతాల్లోని కొన్ని రిజర్వాయర్లకు తరలిస్తారు. అక్కడి నుంచి పలు నివాస ప్రాంతాలకు సరఫా చేస్తారు. అలా లక్షలాది తాగునీటి ఇతర అవసరాలకు వినియోగిస్తారు.


ఊడిపోయిన జాలీలు

నాలుగేళ్లుగా...

నిబంధనలకు ప్రకారం ఏడాదికోసారి శుభ్రం చేయాలి. కానీ ఇక్కడి ట్యాంకుల నిర్వహణను నాలుగేళ్లుగా పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొన్నారు. ట్యాంకుల్లోకి గాలి వెళ్లేలా ఏర్పాటు చేసిన జాలీలు ధ్వంసమయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా కొత్తవి ఏర్పాటు చేయకపోవడంతో ట్యాంకుల్లోకి దుమ్ము, ధూళి, చెట్ల కొమ్మలు, ఆకులు పడిపోతున్నట్లు స్థానికులు తెలిపారు.



శుభ్రం చేసింది 2020 అక్టోబరు

ఏటా శుభ్రం చేస్తాం

– అశోక్, కుత్బుల్లాపూర్ జలమండలి ఇన్‌ఛార్జి జనరల్ మేనేజర్

సర్వీసు ట్యాంకుల నిర్వహణ పక్కాగా ఉంటుంది. ఏడాదికోసారి శుభ్రం చేస్తాం. నీటిని అందించేటప్పుడు ఒక అడుగు వరకు నీరు ఉండగానే ఆపేస్తాం. ఒక్కోసారి జలాశయం నుంచి నీరు వచ్చిన సమయంలో మట్టి వస్తే వెంటనే శుభ్రం చేయిస్తాం. ట్యాంకుల చుట్టూ కొత్త జాలీలు ఏర్పాటు చేయిస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
శాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

షాపూర్‌నగర్, దుండిగల్, పేట్‌బషీరాబాద్, నిజాంపేట, న్యూస్‌టుడే

? గాజులరామారం డివిజన్ పరిధి వోక్షిత్ హిల్‌వ్యూ కాలనీలో ప్రధాన రహదారిలో మూడు విద్యుత్తు స్తంభాలకు దీపాలు వెలగడం లేదు. రాత్రి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. **–సురేందర్, వోక్షిత్ హిల్‌వ్యూకాలనీ**

✓ కొత్త విద్యుత్తు దీపాలను ఏర్పాటుచేయించేలా చర్యలు తీసుకుంటాం. **– రఘుపతిరెడ్డి, జీహెచ్‌ఎంసీ విద్యుత్ విభాగం అధికారి**

? సూరారం డివిజన్ పరిధి టీఎస్‌ఐఐసీ కాలనీ పార్కులోని మసీదు వద్ద చెత్త పేరుకుపోయింది. దుర్గంధం వెలువడుతుండడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. **–నర్సింహ, సంజయ్‌గాంధీనగర్**

✓ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్తను అక్కడి నుంచి తరలింపజేస్తాం. **–మమత, జీహెచ్‌ఎంసీ వైద్యాధికారి**

? దుండిగల్ పురపాలిక కార్యాలయం కమాన్ నుంచి స్థానిక రెండు పడక గదుల ఇళ్ల గృహసముదాయం వరకు వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో అంధకారం నెలకొంటోంది. **– శివ, డి.పోచంపల్లి నివాసి**

✓ వెలగని వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం. **– సత్యనారాయణ, కమిషనర్, దుండిగల్ పురపాలిక**

? వెన్నెలగడ్డ ప్రాథమిక పాఠశాల గల్లీలో ఇటీవల సీసీ రోడ్డు వేశారు. సక్రమంగా క్యూరింగ్ చేయటం లేదు. **– బాలమల్లేష్, వెన్నెలగడ్డ.**

✓ క్యూరింగ్ ఉదయం, సాయంత్రం వేళల్లో చేయాలని గుత్తేదారును ఆదేశిస్తాం. నేను వచ్చి పరిశీలిస్తాను. **– అనురాగ్ మహదేవ్, జీడిమెట్ల డివిజన్ ఏఈ.**

? ప్రగతినగర్ ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ప్రధానంగా అంబీర్ చెరువు మలుపులోని ఎస్‌బీఐ బ్యాంకు వద్ద రోడ్డు మరీ అధ్వానంగా ఉండటంతోపాటుగా వేగనిరోధకాలు సైతం పాడయ్యాయి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. **–బట్టు మల్లికార్జున్, ప్రగతినగర్**

✓ మరమ్మతులకు అంచనాలు రూపొందించాం. త్వరలోనే టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సి ఉంది. తొలుత తాత్కాలిక మరమ్మతులు చేస్తాం. **–సత్యనారాయణ, ఈఈ, నిజాంపేట నగర పాలక సంస్థ**

శరన్నవరాత్రి వేడుకల వైభవం


దుండిగల్‌లోని ఆశ్రమంలో అమ్మవారికి పూజలు చేస్తున్న శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ, చిత్రంలో శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ


గాజులరామారం చిత్తారమ్మ దేవాలయంలో బాలాత్రిపురసుందరిగా కొలువైన అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు


కుత్బుల్లాపూర్ వేణుగోపాలస్వామి ఆలయంలో కాంగ్రెస్ నేత కె.ఎం.ప్రతాప్, రామాంజనేయ యువజన సంఘం నేతలు


దుర్గా ఎస్టేట్స్‌లో బాలాత్రిపుర సుందరిగా కొలువైన దుర్గామాత


నిజాంపేటలో ప్రత్యేక అలంకరణలో భక్తులకు కనువిందు చేసిన కనకదుర్గాదేవి


బాచుపల్లి సాయి అనురాగ్ కాలనీలో రజితదుర్గాదేవిగా విజయ కనకదుర్గ

నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం నేత్రపర్వంగా శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు ప్రజాప్రతినిధులు, స్థానికులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

జగద్గిరిగుట్టలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు విజ్ఞప్తి


చాడ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: జగద్గిరిగుట్టలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ సీపీఐ నాయకులు గురువారం ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ద్వారా, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. ప్రతిరోజు రాత్రి ఇతర జిల్లాల నుంచి వచ్చిన 50కి పైగా బస్సులు బస చేస్తాయని, నిత్యం జిల్లాలకు 100కు వరకు బస్సులు నడుస్తాయని వివరించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఇక్కడ నివాసముంటున్నారని, 30 ఏళ్లుగా బస్‌డిపో ఏర్పాటు ప్రతిపాదన కాగితాలకే పరిమితమైందని పేర్కొన్నారు. కొత్తగా డిపోల ఏర్పాటు ప్రతిపాదన ఉందని, వాటిలో జగద్గిరిగుట్ట ఉండేలా చూస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు సీపీఐ మండల కార్యదర్శి ఉమామహేష్ తెలిపారు. నాయకులు ఏసురత్నం, నర్సింహ, హరినాథ్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలపై మాజీ ఎమ్మెల్యేకు వినతులు

షాపూర్‌నగర్: నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు గురువారం మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను షాపూర్‌నగర్‌లోని నివాసంలో కలిశారు. తమ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు సమర్పించారు. వోక్షిత్ హిల్‌వ్యూ కాలనీలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు.

అడుగుకో గుంత.. ప్రయాణమంటే చింత


మల్లంపేట హనుమాన్ ఆలయం వద్ద గుంతలమయంగా ప్రధాన రహదారి

దుండిగల్ పరిధిలోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. మల్లంపేటలో హనుమాన్ ఆలయం వద్ద ప్రధాన మార్గం గుంతలమయంగా ఉంది. దుండిగల్ తండా-2, గాగిల్లాపూర్ తండా ప్రధాన రహదారి అడుగుకో గుంత ఏర్పడింది. వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. –న్యూస్‌టుడే, దుండిగల్


దుండిగల్ తండా-2, గాగిల్లాపూర్ తండా రోడ్డు


షాపూర్‌నగర్ హెచ్ఎంటీ సొసైటీలో


బాపూనగర్ ఆర్ఎస్‌కే హైస్కూల్‌లో ..


సుచిత్ర వెంకటేశ్వరనగర్‌లో..

అటుకుల బతుకమ్మా.. అండగ నిలువమ్మా


గాజులరామారంలోని ద్వారకానగర్‌లో...

బతుకమ్మ పండగలో భాగంగా రెండోరోజు గురువారం నియోజకవర్గంలోని పలుప్రాంతాల్లో అటుకుల బతుకమ్మ వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు పూల గౌరమ్మ చుట్టూ ఆడుతూపాడుతూ అలరించారు.


మహాలక్ష్మినగర్‌లో బతుకమ్మ కుంట ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద, కార్పొరేటర్ జగన్, స్థానికులు


సుభాష్‌నగర్ బోధివృక్ష స్కూలులో ..


బహదూర్‌పల్లి గ్రీన్ హిల్స్ కాలనీలో..

రోడ్డు విస్తరణ .. ట్రాఫిక్ మళ్లింపు

దుండిగల్, న్యూస్‌టుడే: మల్లంపేట బస్టాప్ నుంచి స్థానిక హనుమాన్ దేవాలయం వరకు రహదారి విస్తరణ చేపట్టిన నేపథ్యంలో ట్రాఫిక్‌ను ఇతర మార్గాల్లో మళ్లిస్తున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాచుపల్లి నుంచి వచ్చే వాహనాలను మల్లంపేట బస్టాప్ నుంచి ఎడమవైపు ఖాజీపల్లి రోడ్డు మీదుగా స్థానిక అవుటర్ సర్వీసు రోడ్డుకు మళ్లిస్తారు. బాచుపల్లికి వెళ్లే వాహనాలు మల్లంపేట అవుటర్ సర్వీసు రోడ్డు నుంచి ఖాజీపల్లి రోడ్డు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. సుమారు 20 రోజులపాటు ఇలా మళ్లిస్తున్నట్లు తెలిపారు.

కార్పొరేటర్ పాదయాత్ర

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: గాజులరామారం డివిజన్ పరిధి రోడామిస్త్రీనగర్-బిలో గురువారం కార్పొరేటర్ రావుల శేషగిరి పాదయాత్ర చేసి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఉషోదయాకాలనీలో రూ.74 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఏఈ కళ్యాణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన

దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్ పరిధిలోని మల్లంపేట, బౌరంపేట రహదారి విస్తరణ పనులను గురువారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కమిషనర్ సత్యనారాయణ పరిశీలించారు. నాణ్యత విషయంలో రాజీ వద్దని గుత్తేదారులకు సూచించారు. కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, అనంతస్వామి, వెంకటేశం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దారి అధ్వానం.. మ్యాన్‌హోల్ ప్రమాదకరం



గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్‌లో మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. స్థానికంగా భూగర్భ డ్రైనేజీ పనులు పూర్తయి ఆరు నెలలే కావడం కొసమెరుపు. పక్కన పెద్దరంధ్రం ఏర్పడి లోపలికి విరిగిపడే స్థితికి చేరింది. ఈ రహదారి సైతం పలుచోట్ల గుంతలమయంగా ఉంది. వర్షం పడిన సమయంలో గుంతలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. –న్యూస్‌టుడే, షాపూర్‌నగర్

క్యాంటీన్‌లో గొడవ.. విద్యార్థులపై కేసు

దుండిగల్, న్యూస్‌టుడే: కళాశాల క్యాంటీన్‌లో విద్యార్థుల మధ్య చిన్నపాటి గొడవ ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో ఇద్దరికి గాయాలైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక ఓ కళాశాలలో మూడు రోజుల క్రితం ద్వితీయ సంవత్సరం విద్యార్థికి, మరో విద్యార్థితో క్యాంటీన్‌లో గొడవ జరిగింది. అదే రోజు రెండో ఏడాది విద్యార్థి నలుగురు మిత్రులతో కలిసి అతడిపై దాడికి యత్నించాడు. సర్దిచెప్పేందుకు అక్కడే ఉన్న విద్యార్థులు శశాంక్‌రెడ్డి, సంతోష్ ప్రయత్నించి గాయపడ్డారు. వీరి ఫిర్యాదుతో దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశారు.

తప్పుడు ప్రచారంపై బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు, హైదరాబాద్: తనపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ యూట్యూబర్ హర్షసాయిపై నమోదైన అత్యాచార కేసులో బాధితురాలు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హర్షసాయి సూచన మేరకు తప్పుడు ఆడియో కాల్ రికార్డింగ్స్, అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలా చేస్తున్న విజ్ఞాన్ దాసరి, మహిధర్ సురిశెట్టి, ఆర్‌జే శేఖర్ బాషాపై చర్యలు తీసుకోవాలని కోరారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విరిగిన స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం

జీడిమెట్ల పారిశ్రామికవాడ నుంచి అయోధ్యనగర్ వెళ్లే రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఇటీవల గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్తంభం అడుగున విరిగిపోయి... తీగల సహాయంతో వేలాడుతోంది. బలమైన గాలులు వీస్తే పడిపోయే అవకాశం ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. –న్యూస్‌టుడే,కుత్బుల్లాపూర్



పరిశ్రమల్లో తనిఖీలకు పీసీబీ సిద్ధం

ఈనాడు, హైదరాబాద్: అక్టోబరు నెలకు సంబంధించి కాలుష్య నియంత్రణ మండలి గ్రేటర్ పరిధిలోని పది పరిశ్రమల్లో తనిఖీలు చేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా 57 పరిశ్రమలకు సంబంధించి కంప్యూటరైజ్డ్ తనిఖీలకు సంబంధించి జాబితా సిద్ధం కాగా ఇందులో 10 పరిశ్రమలు మూడు జిల్లాల పరిధిలో ఉన్నాయి. తనిఖీలకు సంబంధించి ఆయా పరిశ్రమలకు సమాచారం అందింది. నెలరోజుల వ్యవధిలో ఆయా పరిశ్రమల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి 24గంటల్లో నివేదిక సమర్పించనున్నారు. తనిఖీల్లో భాగంగా కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్, కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ అనుమతులు, ఉత్పత్తులు, రా మెటీరియల్ల వినియోగం, వ్యర్థాలను లెక్కింపు, ఎఫ్లుయెంట్ ట్రీట్‌మెంట్ వ్యవస్థ, ఘన, హానికర వ్యర్థాల ఉత్పత్తి, భద్రత, పీసీబీ మార్గదర్శకాల పాటింపు తదితర అంశాలను పరిశీలించి పూర్తి నివేదిక సమర్పించనున్నారు.

జాబితాలో ఉన్నవి ఇవే: ఏస్ టైర్స్ - బాచుపల్లి, అమృత్ ఐరన్ క్రాఫ్ట్స్ - మేడ్చల్, అవ్రా లేబొరేటరీస్- నాచారం, బింజుసరియా స్పాంజ్ అండ్ పవర్ ప్రయివేటు లిమిటెడ్ - ఫరూక్‌నగర్, హైదరాబాద్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు - దుండిగల్, ఇండో ఫ్యాబ్ మెట్రో ఇంజినీర్స్ ఎల్ఎల్‌పి - కుత్బుల్లాపూర్, కోణార్ ఆర్గానిక్స్ లిమిటెడ్ - మల్లాపూర్, మేడ్చల్ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ - మేడ్చల్, రసుల ఫార్మా అండ్ ఫైన్ కెమికల్స్ - ఐడీఏ కూకట్‌పల్లి, సుందర్ ఇస్పాత్ స్పాంజ్ ఐరన్ లిమిటెడ్ - రంగారెడ్డి జిల్లా ఇప్పలపల్లి.

సమన్వయ లోపం...కూడళ్ల అభివృద్ధిలో జాప్యం


జగద్గిరిగుట్ట కూడలిలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం కూడళ్ల ఆధునికీకరణకు శాపంగా మారుతోంది. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఇటీవల గాజులరామారం సర్కిల్‌లోని కూడళ్ల అభివృద్ధికి చర్యలు ప్రారంభించారు. ప్రస్తుతం నర్సాపూర్ ప్రధాన రహదారి గాజులరామారం కూడలి, జగద్గిరిగుట్ట పోలీసు అవుట్‌పోస్టు వద్ద పనులు కొనసాగుతున్నాయి. సూరారం, షాపూర్‌నగర్ చౌరస్తాల వద్ద ప్రారంభించాల్సి ఉంది. కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించేందుకు పలు పరిశ్రమల యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నా, సంబంధిత విభాగాల తీరుతో పనులు వేగంగా జరగడం లేదు. గాజులరామారం కూడలిలో వైఎస్ఆర్, ఇందిరాగాంధీ విగ్రహాలను తొలగించి విస్తరిస్తున్నారు. జగద్గిరిగుట్ట, గాజులరామారం గ్రామ కూడలిలోనూ పనులు మొదలైనా విద్యుత్ స్తంభాలు, ఆక్రమణల తొలగింపు విషయంలో ట్రాన్స్‌కో, పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల మధ్య సమన్వయం కొరవడి జాప్యం జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లోని కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటుంది. ఉదయం సాయంత్రం వేళల్లో పాఠశాల బస్సులు, ఇతర వాహనాలు బారులు తీరుతున్నాయి. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు చేపట్టిన చౌరస్తాల విస్తరణ పనులు యంత్రాంగం తీరుతో నెలల తరబడి సాగుతున్నాయి. త్వరగా పూర్తిచేసి సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.